సత్యమేవ జయతే

సాక్షి

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 272

శనివారం 23-12-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే

సాక్షి



WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 272

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నాకొద్దీ 'పద్మశ్రీ'..

పౌర పురస్కారాన్ని వెనక్కి ఇచ్చిన భారత స్టార్ రెజ్లర్ బజరంగ్

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడి ఎన్నికపై నిరసనగా నిర్ణయం

13లో

భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల ఫలితాలపై టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజరంగ్ పూనియా తీవ్రమైన నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఘనతకు గుర్తింపునిస్తూ 2019లో ఇచ్చిన పౌరపురస్కారం 'పద్మశ్రీ'ని అతను వెనక్కి ఇచ్చారు. శుక్రవారం ప్రధాని మోదీ నివాసం వద్దకు వెళ్లడానికి బజరంగ్ ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో 'పద్మశ్రీ'అవార్డును అక్కడే పెట్టి తిరిగి వచ్చారు. బజరంగ్ నిర్ణయం వ్యక్తిగతమని క్రీడా శాఖ వ్యాఖ్యానించింది.

జేఎన్‌-1 ప్రమాదకరం కాదు



- ఎక్కువ మందికి సోకే అవకాశాలే తప్ప తీవ్రత ఉండకపోవచ్చు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి

-2లో

ట్రాఫిక్ చలాన్ల చెల్లింపుపై
భారీ డిస్కౌంట్

ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. సీఎం ఆదేశాలతో ఉత్తర్వులు జారీ చేసిన పోలీసులు
ఈ నెల 26 నుంచి జనవరి 10 వరకు ఆన్‌లైన్‌లో అవకాశం

రాయితీలు ఇలా..

ద్విచక్ర వాహనాలు, ఆటోలు	కార్లు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలు
80%	60%

ఆర్టీసీ డ్రైవర్లు, తోపుడు బండ్లకు.. 90%

- వివరాలు 2లో



చైనాతో పోల్చొద్దు



- భారత్‌ను ప్రజాస్వామ్య దేశాలతో పోల్చండి
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు

- వివరాలు 6లో

నేడు బీఆర్‌ఎస్ 'స్వేద పత్రం'

తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించేందుకు సిద్ధం

కేటీఆర్, హరీశ్‌రావు ప్రజెంటేషన్

- వివరాలు 3లో



బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

ఢిల్లీలో 'ఇండియా' కూటమి ఆందోళన

- వివరాలు 6లో

పార్లమెంట్‌ను కాపాడలేని బీజేపీ దేశాన్ని రక్షిస్తుందా?

ధర్నాచౌక్ వద్ద ఆందోళనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2లో


శుక్రవారం ఎట్‌హోం కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, జస్టిస్ అలోక్ అరాధే దంపతులు, చెన్నమనేని విద్యాసాగర్, మంత్రి రాజనర్సింహ తదితరులు

రాష్ట్రపతి నిలయంలో ఘనంగా ఎట్‌హోం

గవర్నర్, సీఎం సహా రాష్ట్ర ప్రముఖులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తేనీటి విందు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఘనంగా ఎట్ హోం నిర్వహించారు. రాష్ట్ర ప్రముఖులకు తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీత, మంత్రులు, విపక్ష నేతలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఆహూతులను పరిచయం చేసుకున్న ద్రౌపదీ ముర్ము కాసేపు వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై శివుని కాంస్య విగ్రహాన్ని రాష్ట్రపతికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే దంపతులు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్‌అలీ, జగదీశ్‌రెడ్డి, ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పర్ణికారెడ్డి, యశస్విని, రాగమయి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, మండలి, అసెంబ్లీ సభ్యులు పలువురు అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

‘కారు’ స్టీరింగ్‌పై కేటీఆర్

ఒకే వాహనంలో హరీశ్‌తో కలిసి ‘ఎట్‌హోం’ కార్యక్రమానికి..


ఒకే కారులో వెళ్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ‘ఎట్ హోం’ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్ నుంచి ఎట్‌హోమ్ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నేతలు తరలివెళ్లే క్రమంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. తెలంగాణ భవన్‌కు వచ్చిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి చెందిన ‘డిఫెండర్’వాహనాన్ని నడిపేందుకు కేటీఆర్ ఆసక్తి చూపారు. కేటీఆర్ కారు స్టీరింగ్ పట్టి సొంతంగా డ్రైవ్ చేస్తూ వెళ్లారు. అదే వాహనంలో పక్క సీట్లో మాజీ మంత్రి హరీశ్‌రావు కూర్చున్నారు. తాము ఒకే వాహనంలో ప్రయాణిస్తున్న ఫొటోలను హరీశ్‌రావు సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. కాగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జరిగాయి. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్న ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

క్లుప్తంగా...

పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయం: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనివ్వడాన్ని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశంసించారు. ఈ దిశగా వారిని ఆకర్షించడంలో జేఎన్టీయూహెచ్ అధికారులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. జేఎన్టీయూహెచ్ నేతృత్వంలో చేపడుతున్న పూర్వ విద్యార్థుల సదస్సును గవర్నర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇతర దేశాల్లో పలు హోదాల్లో పనిచేస్తున్నారని, వారిని ఒక వేదికపైకి తీసుకురావడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మన యూనివర్సిటీలో చదువుకున్న వారు ఉన్నత స్థానాలకు వెళ్లడం గర్వకారణంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, అలుమ్ని డైరెక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు వర్సిటీకి తమ వంతు సహాయాన్ని ప్రకటించారు.

ఢిల్లీ వెళ్లిన డిప్యూటీ సీఎం

సాక్షి, హైదరాబాద్: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ఆయన ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలో ఆయన పలువురు పార్టీ పెద్దలతో సమావేశం కానున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు ప్రభుత్వ పనితీరుపై వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను కూడా వివరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విక్రమార్క శనివారం రాత్రి తిరిగి వచ్చే అవకాశం ఉందని తెలిసింది.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మాట తప్పింది

ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మార్పీఎస్ నిరసన



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మరోసారి మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. వర్గీకరణ చేస్తామని మాట తప్పిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ‘వర్గీకరణ విషయంలో బీజేపీ మాట తప్పిందంటూ’ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాదిగల సభ కోసం తెలంగాణకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ వర్గీకరణపై కమిటీ వేసి, ఆ కమిటీ రిపోర్టు వచ్చిన వెంటనే వర్గీకరణ చేస్తామంటూ ప్రకటించారని గుర్తుచేశారు. కేవలం మాదిగల ఓట్ల కోసమే ఎన్నికల ప్రచారంలో మాయ మాటలు చెప్పారని ఆరోపించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని బీజేపీ పెద్దలను కలసి వినతిపత్రాలను ఇచ్చి అభ్యర్థించినట్లు శ్రీనివాస్ తెలిపారు.

ఇదం జగత్


ఎక్కడికెళ్లారో అస్సలు అంతుపట్టడం లేదు!

ట్రాఫిక్ చలాన్ల చెల్లింపుపై భారీ డిస్కౌంట్!

ద్విచక్ర వాహనాలు, ఆటోలపై 80%, కార్లు సహా ఇతర భారీ వాహనాలపై 60 శాతం రాయితీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు జరిమానాలు ఎదుర్కొంటున్న వాహనదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. న్యూ ఇయర్ నేపథ్యంలో పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల చెల్లింపుపై భారీ రాయితీలు అందిస్తున్నట్లు ప్రకటించింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలపై చలాన్ల మొత్తంలో 80 శాతం రాయితీ ఇచ్చింది. అలాగే కార్లు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలపై పెండింగ్ చలాన్ల మొత్తంలో 60 శాతం రాయితీని, ఆర్టీసీ డ్రైవర్లకు, తోపుడు బండ్ల వారికి 90 శాతం రాయితీని ప్రకటించింది. ట్రాఫిక్ చలాన్ల చెల్లింపులో రాయితీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించడంతో పోలీస్ అధికారులు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. https://echallan.tspolice.gov.in/publicview/ వెబ్‌సైట్‌లో వాహనదారులు ఈ నెల 26 నుంచి జనవరి 10 వరకు ఆన్‌లైన్‌లో పెండింగ్ చలాన్లను రాయితీపై చెల్లించవచ్చని అధికారులు పేర్కొన్నారు.



పెండింగ్ చలాన్ల విలువ రూ. 800 కోట్లు..

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల ఈ–చలాన్‌లు పెండింగ్‌లో ఉండగా వాటి విలువ సుమారు రూ. 800 కోట్ల వరకు ఉంటుందని పోలీసు ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. భారీ రాయితీలు కల్పించడం వల్ల పెండింగ్‌లో ఉన్న చలాన్లను వాహనదారులు చెల్లిస్తారని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల 30న తెలంగాణ హైకోర్టు పర్యవేక్షణలో మెగా జాతీయ లోక్ అదాలత్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గతేడాది మార్చిలో ట్రాఫిక్ చలాన్ల చెల్లింపులపై ఇదే తరహాలో ఇచ్చిన డిస్కౌంట్‌ను హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వాహనదారులు సద్వినియోగం చేసుకోగా జిల్లాల్లోని వాహనదారులకు ఈ అంశంపై పూర్తిస్థాయిలో అవగాహన లేక ఆశించినట్లు వినియోగించుకోలేకపోయారని అధికారులు తెలిపారు. అప్పట్లో సుమారు రూ. 350 కోట్ల మేరకు రాయితీలను ఉపయోగించుకొని వాహనదారులు చెల్లింపులు చేసినట్లు పోలీసు వర్గాల సమాచారం.

జేఎన్-1 అంత ప్రమాదకరం కాదు

ఎక్కువ మందికి సోకే అవకాశాలే తప్ప తీవ్రత ఉండకపోవచ్చు

- ‘సాక్షి’ ఇంటర్వ్యూలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి
- వారం, పది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వస్తుంది
- ఎక్కువ మంది గుమిగూడిన చోటికి వెళ్తే మాస్క్ పెట్టుకోవాలి
- మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్నవారు జాగ్రత్త పడాలని సూచన


డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 అంత ప్రమాదకరమేమీ కాదని.. దాని గురించి అతిగా ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. వారం, పది రోజుల్లో ఈ ఇన్ఫెక్షన్ వ్యాప్తి ఎలా ఉంటుందనే దానిని బట్టి దీని తీవ్రత, చూపబోయే ప్రభావంపై మరింత స్పష్టత వస్తుందని చెప్పారు. ఇది ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కాబట్టి ఎక్కువ మందికి సోకవచ్చన్నారు. అంతే తప్ప తీవ్ర లక్షణాలు ఉండటంగానీ, ప్రమాదకరంగా మారే అవకాశంగానీ తక్కువని స్పష్టం చేశారు. కొన్నిరోజులుగా దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ‘సాక్షి’కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివిధ అంశాలపై స్పష్టతనిచ్చారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

‘‘నా అంచనా ప్రకారం.. ఇప్పటికే నమోదైన కేసుల పరిస్థితిని చూస్తే ఈ వైరస్ అంతగా ప్రమాదకారి కాదు. సాధారణ జలుబు, దగ్గు, సైనసైటిస్, ఒళ్లు నొప్పులు వంటి స్వల్ప లక్షణాలు ఉంటాయి. అందరూ అన్నిచోట్లా మాస్క్ వేసుకోవాల్సిన అవసరం లేదు. కేన్సర్, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. బయటికి వెళ్లినప్పుడు మాస్క్ ధరిస్తే చాలు.

డబ్ల్యూహెచ్‌వో పరిశీలిస్తోంది

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) జేఎన్–1ను వేరియెంట్ ఆఫ్ ఇంట్రెస్ట్‌గా ప్రకటించింది. అంటే వచ్చే 10–15 రోజులు ఇది ఎంతగా విస్తరిస్తుంది, ఎంత వేగంగా వ్యాపిస్తుంది (ఇన్‌ఫెక్టివిటీ), సీరియస్ ఇన్ఫెక్షన్‌గా మారుతుందా (విరులెన్స్) అన్న అంశాలను పరిశీలిస్తారు. ఇప్పటివరకు ఉన్న డేటా మేరకు ఈ వైరస్‌కు విరులెన్స్ అంత ఎక్కువగా లేదు. వ్యాపించే సామర్థ్యం ఒమిక్రాన్ అంతలేదు.. కానీ డెల్టా కంటే ఎక్కువగా ఉంది. ఈ వేరియంట్‌కు సంబంధించి కేరళలో ఎక్కువగా, ఇతర రాష్ట్రాల్లో కొన్ని కేసులు నమోదవుతున్నాయి. సింగపూర్‌లో ఈ కేసులు అధికంగా వచ్చాయి. యూఎస్, యూరప్‌లోనూ నమో దవుతున్నాయి.

రోగ నిరోధక శక్తి ముఖ్యం

ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు ఇమ్యూనిటీముఖ్యం. ప్రస్తుతం మనలో ఎంత ఇమ్యూనిటీ ఉందనే దానిపై ఏఐజీ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తున్నాం. వారం, పదిరోజుల్లో ఇది పూర్తవుతుంది. బూస్టర్ డోస్ వేసుకోవాలా వద్దా అన్న దానిపై స్పష్టత వస్తుంది. ఇమ్యూనిటీ ఉన్నవారు బూస్టర్ డోస్‌ను వేసుకోవాల్సిన అవసరం లేదు.

మన దేశ ప్రజల్లో హైబ్రిడ్ ఇమ్యూనిటీ ఉంది



‘‘మళ్లీ కరోనా వ్యాప్తి నేపథ్యంలో బూస్టర్ డోస్ తీసుకోవాలా వద్దా అని చాలా మంది డాక్టర్లను సంప్రదిస్తున్నారు. అమెరికాలో అయితే 65ఏళ్లు దాటినవారు బూస్టర్ డోస్ తీసుకోవాలని సూచిస్తున్నారు . అదే భారత్‌లో చాలా వరకు వ్యాక్సిన్ వేసుకోవడం, కరోనా సోకి ఉండటంతో ఏర్పడిన ‘హైబ్రిడ్ ఇమ్యూనిటీ’ ఉంది. ఒకవేళ వైరస్ సోకినా అది తీవ్ర వ్యాధిగా మారకుండా ఈ ఇమ్యూనిటీ ఉపయోగపడుతుంది. ఒమిక్రాన్ స్పైక్ ప్రొటీన్లలో మార్పులతో జేఎన్–1 వేరియంట్ ఏర్పడినందున గతంలో తీసుకున్న వ్యాక్సినేషన్, కోవిడ్ సోకడం వల్ల వచ్చిన ఇమ్యూనిటీని ఇది తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే దీనితో జ్వరం, గొంతునొప్పి, గొంతులో గరగర, దగ్గు, తలనొప్పి వంటి స్వల్ప అస్వస్థతే కలుగుతోంది. వృద్ధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. విదేశీ పర్యటనలు, దూరప్రాంతాలకు వెళ్లి వచ్చినవారికి లక్షణాలు ఉంటే టెస్ట్ చేయించుకోవాలి. ’’

– డాక్టర్ గోపీచంద్ ఖిల్నానీ,
డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ ఎయిర్ పొల్యూషన్ అండ్ హెల్త్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ మెంబర్

రాష్ట్రంలో మరో తొమ్మిది కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోవిడ్-19 కేసులు ఒక్కసారిగా పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన 1,245 కరోనా నిర్ధారణ పరీక్షల్లో కొత్తగా తొమ్మిది కోవిడ్ –19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 68 నమూనాలకు సంబంధించి ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉంది. తాజాగా నమోదైన కేసులతో కలిపి ప్రస్తుతం 27 మంది కరోనా బాధితులు చికిత్స పొందుతున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య విభాగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. కొత్తగా నమోదైన కేసుల్లో ఏకంగా 8 హైదరాబాద్ జిల్లాకు చెందినవి కాగా... ఒకటి రంగారెడ్డి జిల్లాలో నమోదైంది.

పుణేకు కరోనా నమూనాలు

నలుగురు బాధితుల శాంపిళ్లు పంపిన వైద్య, ఆరోగ్యశాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసుల్లో ఆకస్మిక పెరుగుదల, పొరుగు రాష్ట్రాల్లో కొత్త వేరియంట్ జేఎన్.1 వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. నలుగురు కరోనా పాజిటివ్ బాధితుల నమూనాలను శుక్రవారం జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పుణేకు పంపింది. జేఎన్.1 వేరియంట్ కేరళ సహా పలు రాష్ట్రాల్లో విస్తరిస్తున్నందున ఇది తెలంగాణలోనూ ప్రవేశించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అయితే నమూనాలు తీసుకున్న కరోనా రోగులకు ఇతర ప్రాంతాల్లో ప్రయాణించిన చరిత్ర లేదని చెబుతున్నారు.

పార్లమెంట్‌ను కాపాడలేని బీజేపీ దేశాన్ని రక్షిస్తుందా?

- ధర్నాచౌక్ వద్ద ఆందోళనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- హాజరైన పలువురు మంత్రులు, కోదండరాం, కూనంనేని తదితరులు


ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న కోదండరాం. చిత్రంలో మల్లురవి తదితరులు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌పై జరిగిన దాడితో ప్రపంచదేశాల్లో భారతదేశ విలువ ఎంతో దిగజారిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారత పార్లమెంట్‌ను రక్షించలేని బీజేపీ పాలకులు ఈ దేశాన్ని ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ‘ఇండియా’కూటమి ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ ధర్నాకు హాజరైన భట్టి విక్రమార్క మాట్లాడుతూ పార్లమెంట్‌పై దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. దేశ రక్షణను గాలికి వదిలేసిన ప్రధాని మోదీని ప్రశ్నించిన ఇండియాకూటమి ఎంపీలతోపాటు మొత్తంగా 146 మందిని సస్పెండ్ చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యానికి దేవాలయంగా భావించే పార్లమెంట్‌పై జరిగిన దాడిపై సభలో సభ్యులు అడిగిన దానికి సమాధానం చెప్పకుండా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు ప్రశ్నించిన సభ్యులను సస్పెండ్ చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడాలనే ఆలోచన బీజేపీకి లేదని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ సైతం రోడ్లపైకి వచ్చి ఈ దేశం కోసం తామున్నామని, ప్రజలకు బాసటగా నిలుస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు.

సమాధానం చెప్పకుండా సస్పెన్షనా?

తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ పార్లమెంట్ ఘటనపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం విపక్ష సభ్యులను బయటకు పంపించిందని విమర్శించారు. ముఖ్యమైన బిల్లులపై చర్చ జరుగుతుంటే, అందరినీ బయటకు పంపించి బలవంతంగా బిల్లులను ఆమోదింప చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. వెంటనే విపక్ష సభ్యులను సభలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పార్లమెంట్ మీద దాడి జరగడం అంటే అంబేడ్కర్ గుండెపైన దాడి జరిగినట్టేనని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో పొగ బాంబులు వేస్తే ఇంతవరకు సమాధానం చెప్పని ప్రధాని మోదీ చరిత్రలో ఎన్నడు లేని విధంగా 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని విమర్శించారు. మరో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పార్లమెంట్‌కు భద్రత ఇవ్వలేని స్థితిలో ఉన్న ఎన్‌డీఏ దేశానికి భద్రత ఎలా కల్పిస్తుందని ఎద్దేవా చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కులమతాల పేరుతో బీజేపీ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, ఆమ్ ఆద్మీ పార్టీ కోఆర్డినేటర్ దిడ్డి సుధాకర్, ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, నాగరాజు, విజయ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

48 ఎంపీ స్థానాల్లో పోటీ

మహారాష్ట్రపై గులాబీ గురి

- 30న కొల్హాపూర్‌లో బహిరంగసభ
- త్వరలో పుణే, ఔరంగాబాద్‌లో పార్టీ కార్యాలయాల ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ ప్రణాళికలు కొనసాగించాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. అందులో భాగంగానే వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించింది. తెలంగాణతోపాటు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని 48 స్థానాల్లోనూ బరిలో దిగేందుకు సిద్ధమైంది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఉనికి చాటిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల లక్ష్యంగా కార్యకలాపాలు వేగవంతం చేయాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశించారు. తుంటి ఎముక శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న ఆయన త్వరలోనే మహారాష్ట్ర బీఆర్‌ఎస్ కీలక నేతలతో భేటీ కానున్నారు. మహారాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ కల్వకుంట్ల వంశీధర్‌రావు నిరంతరం అక్కడి నేతలతో సమన్వయం చేస్తూ స్థానికంగా సభలు, సమావేశాలు కొనసాగేలా చూస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఫలితాల తర్వాత లాతూరులో పదివేల మందితో సభ నిర్వహించిన బీఆర్‌ఎస్, ఈ నెల 30న కొల్హాపూర్‌లోనూ బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తర్వాత షోలాపూర్, ఔరంగాబాద్, వార్ధా, బీడ్‌లోనూ సభలు ఉంటాయని మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలు వెల్లడించారు.

క్షేత్ర స్థాయిలో చురుగ్గా కమిటీలు

డిసెంబర్ మొదటివారంలో మహారాష్ట్రలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 200కు పైగా సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను బీఆర్‌ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. నాగపూర్, ఔరంగాబాద్ (శంభాజీనగర్), వార్ధా, బీడ్, సతారా, కొల్హాపూర్, సాంగ్లి, షోలాపూర్ తదితర జిల్లాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ ఏడాది జూన్‌లో బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టగా, మహారాష్ట్ర వ్యాప్తంగా 20లక్షలకు పైగా మంది క్రియాశీల సభ్యులుగా నమోదయ్యారు. సంస్థాగతంగా 48 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోనూ పార్టీ ప్రధాన, అనుబంధ కమిటీల ఏర్పాటు పూర్తయ్యింది. ఇప్పటికే నాగపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించి కార్యకలాపాలు సాగుతుండగా, త్వరలో పుణే, ఔరంగాబాద్‌లోనూ పార్టీ సొంత కార్యాలయాలు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తెలంగాణకు సరిహద్దుగా ఉన్న విదర్భ, మరాఠ్వాడా ప్రాంతంలో బీఆర్‌ఎస్ పట్ల ఆదరణ పెరిగిందని పార్టీ అంచనా వేస్తోంది.

తెలంగాణ ఓటమితో సానుభూతి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పట్ల సానుభూతి పెరిగిందని మహారాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు మాణిక్ కదమ్ ‘సాక్షి’కి వెల్లడించారు. ‘వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతుబంధుతో పాటు కల్యాణలక్ష్మి వంటి పథకాలు అమలు చేసినా పార్టీ ఓడిపోవడంపై చర్చ జరుగుతోంది. ఆచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ గందరగోళాన్ని సృష్టించి అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని విడమరిచి చెబుతున్నాం. మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలకు బీఆర్‌ఎస్ అనుసరించే రైతు అనుకూల విధానాలతోనే పరిష్కారం దొరుకుతుందనే భావన కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున బీఆర్‌ఎస్ సభలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కేసీఆర్ కోలుకున్న తర్వాత మహారాష్ట్ర పర్యటనకు వచ్చే అవకాశముంది’అని వెల్లడించారు.

ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో వామపక్ష పార్టీల నిరసన


నిరసన ప్రదర్శనలో ఎమ్మెల్యే కూనంనేని, వామపక్ష నేతలు

చిక్కడపల్లి: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. పార్లమెంట్‌లో జరిగిన ఘటనపై నిలదీసిన 146 మంది విపక్షాల ఎంపీలపై విధించిన సస్పెన్షన్ అప్రజాస్వామికమని, వెంటనే దానిని ఎత్తివేయాలన్నారు. ఎంపీలపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు శుక్రవారం నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన చేపట్టాయి. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బీజేపీ తీరు ఇలాగే ఉంటే దుండగులు ఎంపీల మీద దాడి చేసి, కాల్చి చంపుతారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ గెలుపుపై అనేక అనుమానాలున్నాయని, ఓటింగ్ యంత్రాలు తారుమారైనట్లు తెలుస్తున్నదని చెప్పారు.

ఇకపై వారానికి 4 రోజులు కరీంనగర్-తిరుపతి రైలు

కేంద్ర రైల్వే శాఖ సిద్ధం

- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీజేపీ ఎంపీ బండి సంజయ్ విజ్ఞప్తి
- ‘కరీంనగర్–హసన్‌పర్తి కొత్త రైల్వేలేన్’ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం


కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సత్కరిస్తున్న బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలు ఇకపై వారానికి నాలుగు రోజులపాటు నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. ఆదివారం, గురువారం మాత్రమే నడిచే ఈ రైలు ఇకపై వారంలో 4 రోజులపాటు నడవనుంది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి రైల్వే పెండింగ్ పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలు ప్రయాణికులతో విపరీతమైన రద్దీ ఏర్పడినందున వారానికి నాలుగు రోజులపాటు పొడిగించాలని కోరారు. బండి సంజయ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆది, గురువారాల్లో మాత్రమే నడుస్తున్న ఈ రైలును మరో రెండ్రోజులు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. కాగా, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజల ఆకాంక్ష మేరకు కరీంనగర్ – హసన్‌పర్తి కొత్త రైల్వే లేన్ కోసం ఫైనల్ లొకేషన్ సర్వే పనులు వెంటనే పూర్తి చేసి కొత్త రైల్వే లేన్ పనులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా రైల్వే మంత్రిని బండి సంజయ్ కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి వెంటనే దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఫోన్ చేసి త్వరగా ఫైనల్ లోకేషన్ సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

జమ్మికుంటలో పలు రైళ్ల హాల్ట్

ప్రజల సౌకర్యార్థం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను జమ్మికుంట స్టేషన్‌లో ఆపే (హాల్ట్) విధంగా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ రైల్వే మంత్రిని కోరారు. సికింద్రాబాద్ - గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (12590–89), యశ్వంతపూర్ – గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (12592–91), హైదరాబాద్ – న్యూఢిల్లీ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ (12723–23), సికింద్రాబాద్ – పట్నా దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (12791–92), చెన్నై – అహ్మదాబాద్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (12656–55) రైళ్లను జమ్మికుంట స్టేషన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన రైల్వే మంత్రి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఆయా రైళ్లను జమ్మికుంట స్టేషన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎగ్జిబిషన్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా మంత్రి శ్రీధర్‌బాబు


మంత్రి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న వనం సత్యేందర్, హనుమంతరావు, అశ్విని మార్గం

అబిడ్స్ (హైదరాబాద్): ఎగ్జిబిషన్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు నియమితులయ్యారు. ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సమావేశంలో శ్రీధర్‌బాబును ఏకగ్రీవంగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత కొన్నేళ్లుగా ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామా చేయడంతో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం నుంచి ఒక మంత్రి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా నియమితులు కావడం ఆనవాయితీగా వస్తోంది. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, మాజీ ఉపాధ్యక్షుడు అశ్విని మార్గంలు నూతనంగా నియమితులైన శ్రీధర్‌బాబును కలిసి అభినందనలు తెలిపారు. త్వరలోనే ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు తెలిసింది. జనవరి 1న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనశాల (ఎగ్జిబిషన్)ను ప్రారంభించేందుకు సీఎంను ఆహ్వానించనున్నారు. ఏటా జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజులపాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.

టీపీసీసీ కార్యవర్గ సమావేశం రేపటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశాన్ని శనివారం నుంచి ఆదివారానికి వాయిదా వేసినట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భేటీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇందిరాభవన్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. పీఏసీ సభ్యులు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొనే ఈ సమావేశానికి ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు టీపీసీసీ మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, టీపీసీసీ అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల కార్యవర్గాల సమావేశం ప్రకాశం హాలులో జరుగుతుందని తెలిపారు.

శ్వేతపత్రాలతో ఒరిగేదేమీ లేదు: దాసోజు



సాక్షి, హైదరాబాద్: శ్వేతపత్రాల విడుదల పేరిట అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసి 'కొండను తవ్వి ఎలుకను పట్టిన'రీతిలో వ్యవహరించిందని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. సినీఫక్కీలో అతి ఆర్భాటంతో శ్వేతపత్రాల పేరిట కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రయత్నించిందన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ శ్రవణ్ శుక్రవారం బహిరంగలేఖ రాశారు. బట్టకాల్చి మీదేసే రాజకీయాలకు కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి రెండింతలు కావాలని తమ పార్టీ కోరుకుంటోందని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ తొలి అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, భవిష్యత్తులో తెచ్చే విధానాల గురించి ఏమాత్రం ప్రస్తావించలేదన్నారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన ఆంధ్ర నాయకుల ఆలోచనా విధానం శ్వేతపత్రాల్లో కనిపించిందని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కండువా కప్పుకుని ప్రచారంలో పాల్గొన్నారని, దీనిపై చర్యలు చేపట్టాలని కోరుతూ గవర్నర్‌కు ఆయన వినతి పత్రం సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోసం వెంకటయ్య డబ్బుల పంపిణీతోపాటు మందు, విందులు చేశారని ఆరోపించారు. ఇందుకు ఆధారాలను వినతిపత్రానికి జత చేసినట్టు చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేందుకు కొన్నిరోజుల ముందు వెంకటయ్యను ఈ పదవిలో నియమించగా, షెడ్యూల్ వెలువడిన మర్నాడే ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారని వివరించారు. ఈ అంశంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చారని రఘునందన్‌రావు విలేకరులకు వెల్లడించారు.

పల్లవి ప్రశాంత్‌కు బెయిల్

షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు



సాక్షి, హైదరాబాద్: బిగ్‌బాస్ తెలుగు సీజన్–7 విజేత పల్లవి ప్రశాంత్‌కు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. అతనితో పాటు అరెస్ట్ అయిన ముగ్గురికి కూడా నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రశాంత్‌తో పాటు అతని సోదరుడిని గురువారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం అతడిని ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు. ఈ సందర్భంగా పల్లవి ప్రశాంత్ తరపు న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం పల్లవి ప్రశాంత్‌తోపాటు ముగ్గురికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పల్లవి ప్రశాంత్ మీడియాతో మాట్లాడటం, సమావేశాలు నిర్వహించడం చేయకూడదని షరతు విధించింది. మరోవైపు అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద జరిగిన దాడికి సంబంధించి నమోదైన రెండు కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయని, ఆ షో నిర్వాహకులకు కూడా నోటీసులు ఇచ్చి విచారిస్తామని వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో తాజాగా సరూర్‌నగర్‌కు చెందిన హరినాథ్ అనే ఇంటర్ విద్యార్థి, యూసుఫ్‌గూడకు చెందిన సుధాకర్ అనే ప్రైవేట్ ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అరెస్టయిన వారి సంఖ్య 18కి చేరింది.

పల్లవి ప్రశాంత్ కుటుంబీకులకు అండగా ఉంటాం

మాజీ మంత్రి హరీశ్‌రావు



గజ్వేల్: బిగ్‌బాస్–7 విజేత పల్లవి ప్రశాంత్ కుటుంబసభ్యులను మాజీమంత్రి హరీశ్‌రావు గురువారం ఫోన్‌లో పరామర్శించారు. సామాన్య కుటుంబానికి చెందిన ప్రశాంత్ విజేతగా నిలవడం అభినందనీయమని చెబుతూనే అనుకోని సంఘటనల కారణంగా జైలుకెళ్లడం దురదృష్టకరమన్నారు. ప్రశాంత్ కుటుంబానికి అండగా ఉంటామని హరీశ్ భరోసా ఇచ్చారు.

టీబీజీకేఎస్‌ను గెలిపించుకుంటేనే కార్మికులకు న్యాయం: కవిత



సాక్షి, హైదరాబాద్: కార్మికుల పక్షాన నిలబడే ఏకైక సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అని, దాన్ని గెలిపించుకుంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ పోటీ చేస్తుందని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం నాయకత్వ బాధ్యతల్లో యువతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో సంస్థ కోసం, కార్మికుల సంక్షేమం కోసం చేసిన పనులను చూసి కార్మికులు ఆత్మసాక్షిగా ఆలోచించి ఓటేసి టీబీజీకేఎస్ సంఘాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సింగరేణి సంస్థ నికర లాభాల్లో కార్మికులకు భారీ మొత్తంలో వాటాలను పంచారని గుర్తు చేశారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించారని, సొంత ఇల్లు నిర్మించుకునే వారికి రూ.10 లక్షల మేర రుణం వరకు సంస్థనే వడ్డీ భరించడం, ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థల్లో చదువుకునే కార్మికుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయడం వంటి నిర్ణయాలను కేసీఆర్ తీసుకున్నారని వివరించారు.

సీఎం సీపీఆర్వో అయోధ్యరెడ్డికి సన్మానం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా నియమితులైన అయోధ్యరెడ్డిని టీపీసీసీ నాయకులు సన్మానించారు. శుక్రవారం గాంధీభవన్‌కు వచ్చిన అయోధ్యరెడ్డిని మాజీ ఎంపీ మల్లు రవి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధులు హరివర్ధన్‌రెడ్డి, శ్రీరంగం సత్యం, కాల్వ సుజాత తదితరులు శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీకి అయోధ్యరెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

సామాన్యుడూ ఎమ్మెల్యే కావొచ్చు

డబ్బులుంటేనే రాజకీయాలనే ఆలోచన వద్దు

- ఎంత సంపాదించామనేది కాదు.. సమాజానికి ఎంత పంచామనేది ముఖ్యం
- సీఎం కోసం ఎంతో మంది పోటీలో ఉన్నా సోనియా గాంధీ అవకాశం ఇచ్చారు
- బీఆర్ అంబేడ్కర్ లా కాలేజీ అలుమ్నీ మీట్, గ్రాడ్యుయేషన్ డేలో సీఎం రేవంత్‌రెడ్డి
- 'కాకా' విగ్రహావిష్కరణ


కాకా విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వివేక్, వినోద్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: డబ్బులుంటేనే రాజకీయాలనే ఆలోచన పక్కన పెట్టాలని, ఇందిరమ్మ ఇంట్లో నివసించే సామాన్యుడూ ఎమ్మెల్యే అవ్వొచ్చని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల్లోకి వెళ్లి సేవ చేస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని చెప్పారు. డబ్బులతో రాజకీయాలకు పనిలేదనేది కాంగ్రెస్‌తో సాధ్యమైందని, ఎందరో పెద్ద వాళ్లు ఉన్నా యువకులకు, కొత్త వారికి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేలను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, సమాజానికి ఎంత పంచామనేది ముఖ్యమని వ్యాఖ్యానించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కాలేజీలో అలుమ్నీ మీట్, గ్రాడ్యుయేషన్‌లో డేలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, విజయ రమణారావు, రాజ్‌ఠాకూర్, నాగరాజు, కాలేజీ కరస్పాండెంట్ సరోజ వివేక్ పాల్గొన్నారు. జి.వెంకటస్వామి (కాకా) విగ్రహావిష్కరణ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

రోజుకు 18 గంటలు పనిచేస్తున్నాం

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిని అయ్యానని, సీఎం కోసం ఎంతో మంది పోటీలో ఉన్నా నాకు పదవి ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి ధన్యావాదాలు తెలుపుతున్నానన్నారు. నేతలంతా రోజుకు 18 గంటల కఠోర దీక్షతో పనిచేస్తూ తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని రేవంత్ చెప్పారు.

కాకా సేవలు చిరస్మరణీయం...

తెలంగాణ ఉద్యమంలో కాకా కుటుంబం ముందుందనీ, దేశ నిర్మాణంలో కూడా కాకా పాత్ర ఉందని, అలాంటి కాకా వర్ధంతి రోజున గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం గొప్ప విషయమన్నారు. 1973లో ప్రారంభమైన ఈ విద్యా సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఎంతో మందిని ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లుగా తయారు చేసిందని అభినందించారు. కాకా తర్వాత ఈ విద్యా సంస్థను నడిపిస్తున్న ఇద్దరి కొడుకులను చూస్తుంటే లవకుశలను చూసినట్లు అనిపిస్తోందని కొనియాడారు.

విద్యార్థుల భవితకు అండగా ఉంటాం

బీఆర్ అంబేడ్కర్ కాలేజీ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి చేయూతనందించేందుకు సిద్ధమని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అండగా ఉంటామన్నారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అన్ని రంగాలను ప్రభుత్వమే అభివృద్ధి చేయదని, చేసేవాళ్లకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

శ్వేతపత్రాల్లో ఆ స్కాంలు లేవేంటి?

- గత పాలకుల కుంభకోణాల వివరాలు ఎక్కడ?
- బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రాల్లో గత పాలకుల స్కాంల వివరాలు ఎందుకు లేవని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ఆధారాలున్నాయని చెప్పిన అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆ వివరాలన్నీ ఇప్పుడు సభ ఎదుట ఎందుకు పెట్టలేదని నిలదీశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా చేసిన ఆరోపణల మేరకు బీఆర్‌ఎస్ చేసిన అప్పులపై శ్వేతపత్రంలో కాంగ్రెస్ ఎందుకు స్పష్టతనివ్వలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెప్పిన కాంగ్రెస్ నేతలు దానిపై ఎందుకు చర్చ జరపలేదన్నారు. మోటార్లకు మీటర్లు అని బీజేపీని బీఆర్‌ఎస్ బద్నాం చేయాలని చూస్తే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ విధంగా చేయాలని కేంద్రం చెప్పలేదని స్పష్టతనిచ్చారని, అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పాయల్ శంకర్ పేర్కొన్నారు. మహాలక్ష్మి స్కీమ్‌లో ఫ్రీ బస్సులనే అమలు చేశారని, మిగిలినవి ఎప్పుడు అమలుచేస్తారని ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, మెగా డీఎస్సీతోపాటు 2 లక్షల ఖాళీలు భర్తీ చేయాలని రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

నేడు బీఆర్‌ఎస్ 'స్వేద పత్రం'

గత తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించేందుకు సిద్ధం

- కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన శ్వేతపత్రాలపై తమ వాదన వినిపించే యత్నం... వివిధ రంగాల్లో గణాంకాలతో కేటీఆర్, హరీశ్‌రావు తదితరుల ప్రజెంటేషన్
- నేటి ఉదయం 11 గంటలకు తెలంగాణభవన్‌లో కార్యక్రమం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ వేదికగా రెండు రోజుల పాటు కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన శ్వేతపత్రాలపై తమ వాదన వినిపించేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమైంది. తమ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తెలంగాణ సాగించిన ప్రగతి ప్రస్థానం దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని.. దానికోసం తమ ప్రభుత్వం చిందించిన చెమటను ప్రజలకు వివరించేందుకు 'స్వేద పత్రం'పేరిట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. శనివారం ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయం తెలంగాణభవన్ వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి కేటీఆర్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ''పగలూరాత్రీ తేడా లేకుండా రెక్కల కష్టంతో చెమటోడ్చి నిర్మించిన తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీస్తే సహించం. విఫల రాష్ట్రంగా చూపించాలని ప్రయత్నిస్తే భరించం. అగ్రగామి రాష్ట్రాన్ని అవమానిస్తే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకోం. అందుకే గణాంకాలతో సహా వాస్తవ తెలంగాణ ముఖచిత్రాన్ని వివరించేందుకు.. అప్పులు కాదు, తెలంగాణ రాష్ట్రానికి సృష్టించిన సంపదను ఆవిష్కరించేందుకు 'స్వేద పత్రం'విడుదల చేస్తున్నాం''అని ప్రకటించారు.

వాస్తవాలను వివరించేందుకే..

ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో స్పందించేందుకు అవకాశం ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పీకర్‌కు లేఖ రాయడం తెలిసిందే. అయితే అధికార కాంగ్రెస్ పక్షం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వకపోవడంతో బీఆర్‌ఎస్‌కు అవకాశం దక్కలేదు. ఈ క్రమంలో శ్వేతపత్రాలపై అసెంబ్లీలో బుధ, గురువారాల్లో చర్చ సందర్భంగా ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరించి తమపై బురద జల్లేందుకే ప్రయత్నించిందని బీఆర్‌ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. తాము వివరణలు కోరినా సమాధానాలు రాలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్ వేదికగా 'స్వేద పత్రం' పేరిట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్తున్నారు.

అంశాలన్నింటినీ క్రోడీకరించి..

అసెంబ్లీలో శ్వేతపత్రాలపై చర్చ సమయంలోనే.. 'పదేళ్లలో సృష్టించిన ఆస్తులు', 'ఫ్యాక్ట్ షీట్'పేరిట రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై బీఆర్‌ఎస్ రెండు నివేదికలను విడుదల చేసింది. ఇప్పుడు వాటిలోని అంశాలను క్రోడీకరించడంతోపాటు రంగాల వారీగా మరిన్ని వివరాలు జోడిస్తూ.. 'స్వేద పత్రం'ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి.

ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్‌ఎస్ కమిటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై విస్తృతంగా అధ్యయనం చేసేందుకు పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు వివిధ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్ల సమస్యలు, వారు కోరుకుంటున్న పరిష్కార మార్గాలను ఈ కమిటీ తెలుసుకుంటుంది. కమిటీలో సభ్యులైన బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేతలు రూప్ సింగ్, రాంబాబు యాదవ్, మారయ్య ఆటో డ్రైవర్ల సంఘాల ప్రతినిధులతో మాట్లాడతారు. కేవలం ఆటో డ్రైవర్ల సమస్యలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని ఓలా, ఉబర్, ఇతర టాక్సీ డ్రైవర్లతో కూడా వీరు చర్చించి పార్టీకి నివేదికను అందజేస్తారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో కేటీఆర్ పేర్కొన్నారు.

శాస్త్ర నియమానుసారంగా కర్మలు చేస్తూనే ఈ ప్రపంచంలో నూరేళ్లు నిండుగా బతకాలని కోరుకోవాలి. ఈ విధంగా చేసే కర్మలు నిన్ను అంటవు, మానవ శరీరంలో లిప్తం కావు.
– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి
శనివారం, 23 డిసెంబర్ 2023

ఇది విజయమా... వైఫల్యమా?

చరిత్ర సృష్టించటం మంచిదే. కానీ ఆ చరిత్ర తరతరాలు చెప్పుకొనేలా వుండాలి. ఈ నెల 4న ప్రారంభమై ఎజెండా అంశాలన్నీ పూర్తికావటంతో ఒకరోజు ముందు గురువారం నిరవధిక వాయిదా పడిన పార్లమెంటు సమావేశాలు ఫలవంతమయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. లోక్‌సభ వరకూ చూస్తే ఈ సమావేశాలు దాదాపు 62 గంటలు సాగాయి. అత్యంత కీలకమైన 18 బిల్లులు చర్చల అనంతరం ఆమోదం పొందాయి. ఇందులో భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), సాక్ష్యాధారాల చట్టం స్థానంలో కొత్త చట్టాలుగా వస్తున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులున్నాయి. టెలికమ్యూనికేషన్ల బిల్లు వుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్‌ల నియామకాల బిల్లుంది. వార్తాపత్రికల, మేగజిన్‌ల కొత్త రిజిస్ట్రేషన్ చట్టం తాలూకు బిల్లు కూడావుంది. మొత్తంగా లోక్‌సభ 74 శాతం ఉత్పాదకతను చూపింది. రాజ్యసభ సైతం 17 బిల్లుల్ని ఆమోదించింది. సమావేశాలు 65 గంటల పాటు సాగాయి. దాని ఉత్పాదకత రేటు 79 శాతం వుంది. ఈ 17వ లోక్‌సభకు సంబంధించి ఇవి 14వ సమావేశాలు. వీటన్నిటా ఈ సమావేశాలే అత్యంత ఫలవంతమైనవని గణాంకాలు వివరిస్తున్నాయి. వచ్చే సాధారణ ఎన్నికల్లోగా మరో సమావేశం మాత్రమే జరుగుతుంది. అందులో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టడం మినహా మరే ఇతర కార్యకలాపాలూ వుండకపోవచ్చు. అయితే బాధాకరమైన అంశమేమంటే... ఈ ప్రధాన బిల్లుల చర్చల్లో దాదాపుగా విపక్షం లేదు. ఇరవై రెండేళ్ల నాటి చేదు అనుభవాన్ని గుర్తుకు తెస్తూ ఈనెల 13న యువకులు పదడుగుల ఎత్తునున్న ప్రేక్షకుల గ్యాలరీ నుంచి కిందకు దూకి పొగగొట్టాలు వదిలి దిగ్భ్రమపరిచారు. పార్లమెంటు వెలుపల సైతం అదే సాగింది. అమెరికాలో వున్న ఖలిస్తానీ తీవ్రవాది పన్నూ పార్లమెంటుపై దాడిచేస్తామని అంతకు చాలారోజులముందే బెదిరించాడు. అప్రమత్తంగా వుండాలని ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం సూచించాయి. అయినా పార్లమెంటు భద్రత వ్యవహారాలు చూసే వ్యవస్థ నిద్రాణమై వుంది. దాడి జరిగి పదిరోజులు గడుస్తున్నా దానికి సూత్రధారులెవరో ప్రజలకు తెలియలేదు. 2001 దాడినుంచి భద్రతా వ్యవస్థలు ఏ గుణపాఠమూ నేర్చుకోలేదని ఈ పరిణామం తెలియజేసింది. ఇదిగాక దేశాన్ని ఆశ్చర్యపరిచిన ఘటన మరొకటుంది. అది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సభా బహిష్కరణ. ఇన్ని చేదు ఉదంతాల మధ్య సమావేశాలు ఫలవంతంగా జరిగాయని అనుకోగలమా?

విపక్షాలు పాలకులను నిలదీయటం, అర్థవంతమైన చర్చల ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సర్వసాధారణం. తమ సూచనలనూ, సలహాలనూ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించే ప్రభుత్వానికి మూకుమ్మడిగా తమ అసమ్మతిని తెలియజేయటానికి వాకౌట్ ఒక ఆయుధం. తగిన జవాబిచ్చినా విపక్ష సభ్యులు ఉద్దేశపూర్వకంగా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని, నినాదాలు చేస్తున్నారని, ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారని, అధ్యక్ష స్థానాన్ని కించపరుస్తున్నారని, దురుద్దేశాలు ఆపాదిస్తున్నారని భావించినప్పుడు అందుకు కారకులైనవారిపై సస్పెన్షన్ వేటు వేయటం కూడా కొత్తేమీ కాదు. కానీ అటువంటి ఉదంతాలు రాను రాను పెరుగుతుండటం, రివాజుగా మారటం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి ఉభయ సభలనుంచీ 146 మంది ఎంపీలు సస్పెండయ్యారు. లోక్‌సభలోకి యువకులు చొరబడటంపై ప్రధాని, హోంమంత్రి ప్రకటన చేయాలంటూ సభలో ఆందోళన నిర్వహించటం, వెల్‌లోకి వెళ్లి ప్లకార్డులు ప్రదర్శించటం కారణంగా ఈ సస్పెన్షన్లు చోటుచేసుకున్నాయి. కొందరు ఎంపీలపై సభాహక్కుల కమిటీకి ఫిర్యాదు వెళ్లింది. దేశం మొత్తాన్ని దిగ్భ్రమలో పడేసిన ఉదంతంపై ప్రకటన చేసే విషయంలో కేంద్రం ఎందుకంత పట్టుదలకు పోయిందో ఆశ్చర్యం కలిగిస్తుంది. లోక్‌సభలో దాడిచేసిన ఉదంతంపై ప్రకటన చేసినంత మాత్రాన విపక్షాలకు లొంగిపోయినట్టు కాదు... సంప్రదాయ విరుద్ధం అసలే కాదు. ఈ ఉదంతం వెనక ఏ శక్తులున్నాయో, వారి ఉద్దేశాలేమిటో వివరించటం వల్ల, తదనంతరం తీసుకున్న పటిష్ట చర్యలేమిటో చెప్పటంవల్ల దేశ ప్రజలకు సాంత్వన కలుగుతుంది.

ఈ సస్పెన్షన్ల పర్యవసానంగా అత్యంత కీలకమైన బిల్లులపై విపక్షం ఆలోచనలేమిటో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఉదాహరణకు ఐపీసీ స్థానంలో వచ్చిన భారతీయ న్యాయసంహిత బిల్లు పోలీసులకు తగినంత జవాబుదారీతనం ఇవ్వకుండానే వారికి విస్తృతాధికారాలు కట్టబెడుతున్నదని నిపుణులంటున్నారు. సీఆర్‌పీసీ స్థానంలో తెచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహితలో ఏ చర్య ఉగ్రవాదమో, ఏది కాదో నిర్ణయించే అధికారాన్ని పోలీసులకు ఇచ్చారు. దీన్ని న్యాయస్థానాల్లో సవాలు చేస్తామని విపక్షాలంటున్నాయి. ఇక టెలికాం బిల్లు అంశానికొస్తే జాతీయ భద్రతా ప్రయోజనాల కోసమంటూ తాత్కాలికంగా టెలికాం సర్వీసుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొనేందుకు అది వీలుకల్పిస్తోంది. సీఈసీ, ఈసీల నియామకం సంగతి సరేసరి. వీటన్నిటిపైనా లోతైన చర్చ సాగొద్దా? పౌరుల్లో తలెత్తిన సందేహాలకు సమాధానాలు దొరకాల్సిన అవసరం లేదా? కనీసం అందుకోసమైనా విపక్షాల సస్పెన్షన్లు ఎత్తివేసివుంటే పాలకపక్షం పెద్ద మనసు వెల్లడయ్యేది. గత దశాబ్దం వరకూ రాజీవ్‌గాంధీ హయాంలో 66 మంది ఎంపీల సస్పెన్షనే రికార్డుగా నమోదైతే, ఈసారి ఆ సంఖ్య 146కి ఎగబాకటం ఆందోళనకరం. సమావేశాల అంతరాయానికి కారకులెవరన్న అంశాన్నలా వుంచితే... సమన్వయంతో, సదవగాహనతో మెలగి పార్లమెంటరీ వ్యవస్థ ఔన్నత్యాన్ని నిలబెట్టడం ఇరుపక్షాల బాధ్యత కాదా?

న్యాయం వేగంగా జరిగేనా?

కేంద్ర ప్రభుత్వం నూతనంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలను తెచ్చింది. పార్లమెంట్ భద్రతా వైఫల్యం గురించిన ప్రతిపక్షాల ఆందోళన, బదులుగా అత్యధిక ఎంపీలు సస్పెండ్ కావడంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త బిల్లులు చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. ఇందులో పోలీసు కస్టడీ సంభావ్య వ్యవధికి సంబంధించిన భారీస్థాయి విస్తరణ, పౌర హక్కుల పరిరక్షణ మూలాన్నే దెబ్బతీస్తోంది. ఈ నూతన చట్టాలు వలసవాద తార్కికతకు తిరిగి శంకుస్థాపన చేశాయి. ఇక్కడ ప్రజలను గరిష్ఠ స్థాయిలో నియంత్రించడమే ప్రభుత్వ ప్రధాన ఆసక్తిగా ఉంది. అయితే దర్యాప్తు, విచారణ సమయంలో సమయపాలన, సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా న్యాయబద్ధతకూ, సామర్థ్యానికీ కట్టుబడి ఉండే నేర న్యాయవ్యవస్థను మాత్రం బీఎన్ఎస్ఎస్ ఊహిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ లా బిల్లులను వేగంగా ఉపసంహరించుకుంది; వాటికి బదులుగా భారతీయ న్యాయ సంహిత (ఐపీసీ, 1860 స్థానంలో తీసుకొచ్చిన బీఎన్ఎస్-2), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 స్థానంలో వచ్చిన బీఎన్ఎస్ఎస్-2) కొత్త వెర్షన్‌లను తెచ్చింది. అలాగే, భారతీయ సాక్ష్య చట్టాన్ని (ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 స్థానంలో తెచ్చిన బీఎస్‌బీ-2) తెచ్చింది. వీటి సారాంశం కచ్చితంగా, వివరంగా ఉన్నప్పటికీ, ఈ చట్టాలలో దాగి ఉన్న వాక్చాతుర్యం గురించి ఆందోళన చెందవలసి ఉంటుంది. క్రిమినల్ చట్టం, న్యాయం విషయంలో ఏదైనా పరివర్తనా దృష్టిని చూడటం వీటిల్లో కష్టమనే చెప్పాలి. మొత్తం మీద మితిమీరిన నేరీకరణ (క్రిమినలైజేషన్), విస్తృతమైన పోలీసు అధికారాల ద్వారా ప్రభుత్వ నియంత్రణను అసమంజసంగా విస్తరించే వ్యవస్థ వైపు మనం వెళ్తున్నట్లు కనిపిస్తోంది.



పోలీసులకు విస్తృత అధికారాలా?

బీఎన్ఎస్ఎస్‌కి చెందిన ఒక ప్రత్యేక అంశం పౌర హక్కులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. కానీ అది పెద్దగా ఎవరి దృష్టినీ ఆకర్షించలేదు. బీఎన్ఎస్ఎస్‌లో పోలీసు కస్టడీ సంభావ్య వ్యవధికి సంబంధించిన భారీస్థాయి విస్తరణ, పౌర హక్కుల పరిరక్షణ మూలాన్నే దెబ్బతీస్తోంది. సాధారణ క్రిమినల్ చట్టం ప్రకారం ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీ గరిష్ఠ పరిమితిని 60 రోజులు లేదా 90 రోజులకు (నేర స్వభావాన్ని బట్టి) బీఎన్ఎస్ఎస్ విస్తరించింది. ఇప్పటివరకూ ఉన్న చట్టం ప్రకారం, పోలీసు కస్టడీని అరెస్టయిన మొదటి 15 రోజులకు పరిమితం చేస్తారు. అయితే బీఎన్ఎస్ఎస్‌లోని ఈ కస్టడీ విస్తరణ పోలీసుల మితిమీరిన చర్యల ప్రమాదాన్ని పెంచుతుంది. పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తుల భద్రత గురించి ఇప్పటికే ఎన్నో ఆందోళనలు ఉన్నాయి. నిర్బంధపూరితంగా, బలవంతంగా పొందుపర్చే కల్పిత సాక్ష్యాలకు చెందిన అధిక ప్రమాదం కూడా ఉంటుంది. అయినప్పటికీ బీఎన్ఎస్ఎస్ పోలీసు అధికారాలను దిగ్భ్రాంతికరంగా విస్తరించిందనే చెప్పాల్సి ఉంది. విశేషమేమిటంటే, మన సాధారణ క్రిమినల్ చట్టం ఇప్పుడు ప్రత్యేక చట్టాలకే పరిమితమైన నిబంధనలను కలిగి ఉండటం. వాస్తవానికి, ఈ నిబంధనలు పోలీసు కస్టడీ వ్యవధిపై 'ప్రత్యేక చట్టాలు' అందించిన వాటికంటే కూడా మించి ఉన్నాయి.

ఈ పోలీసు కస్టడీ విస్తరణను భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని అత్యంత విస్తారమైన, అస్పష్టమైన నేరాల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. అనేక నేరాలు మితిమీరిన నేరీకరణ గురించిన కసరత్తులా ఉన్నాయి. రాజ్య భద్రతను పరిరక్షించడానికి ఉద్దేశించిన నేరాలకు ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. ఉదాహరణకు, బీఎన్ఎస్-1లోని విస్తృత పదాలతో కూడిన నిబంధనలు, తప్పుడు సమాచారానికి శిక్ష (భారతదేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రత లేదా భద్రతకు హాని కలిగించే తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారం) వంటివి బీఎన్ఎస్-2లోనూ అలాగే ఉన్నాయి. పునర్నిర్మించిన బీఎన్ఎస్‌లో 'విద్రోహం' అనే పదాన్ని తొలగించినప్పటికీ, దానికి మరోరూపమైన నేరం – భారత సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతకు హాని కలిగించడం– రెండు వెర్షన్లలోనూ విస్తారమైన, అస్పష్టమైన పదాలతో బాధించడం కొనసాగింది. బీఎన్ఎస్-1 కూడా 'వ్యవస్థీకృత నేరం', 'ఉగ్రవాద చర్య'పై విస్తారమైన పదాలతో కూడిన నేరాలను పరిచయం చేసింది. ప్రత్యేకించి వాటిని ఎదుర్కోవడానికి వాటి ప్రస్తుత నిర్వచనాలకు మించి నిర్వచించింది. 'చిన్న వ్యవస్థీకృత నేరం' అనేది ఒకటి కొత్తగా చేరింది. ఇందులో స్నాచింగ్, పిక్-పాకెటింగ్, బ్లాక్‌లో టిక్కెట్లను విక్రయించడం వంటి వివిధ రకాల వ్యవస్థీకృత దొంగతనాల గురించిన అస్పష్టమైన జాబితా ఉంది.

ఈ నేరాల పరిధి బీఎన్ఎస్-2లో విస్తృతంగా కొనసాగుతుండగా, చిన్న వ్యవస్థీకృత నేరాల, వ్యవస్థీకృత నేరాల పరిధిని స్పష్టం చేయడానికి, పరిమితం చేయడానికి ప్రయత్నం అయితే జరిగింది. 'ఉపా'లోని సెక్షన్ 15 కింద ఉన్న 'ఉగ్రవాద చట్టం' నిర్వచనానికి అనుగుణంగానే బీఎన్ఎస్-2 కూడా ఉంది. అయినప్పటికీ, ఉపాపై పెట్టిన తీవ్రవాద నేరాలకు బీఎన్ఎస్ వర్తింపు గురించి స్పష్టత లేదు. బీఎన్ఎస్-2లో కొత్తగా జోడించిన వివరణ ప్రకారం, పోలీసు సూపరింటెండెంట్ స్థాయి కంటే తక్కువ స్థాయి లేని అధికారి ఈ నిబంధన లేదా చట్టవిరుద్ధమైన కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967 ప్రకారం కేసు నమోదు చేయాలా వద్దా అని నిర్ణయిస్తారు. అధికారి ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకుంటారనే దానిపై నిజమైన మార్గదర్శకత్వం లేని ఇది ఒక ఆసక్తికరమైన నిబంధన.

చట్టంలోని అనేక సానుకూల అంశాలు మన నేర న్యాయ వ్యవస్థలో ప్రాథమిక పరివర్తనలపై ఆధారపడి ఉంటాయి. దర్యాప్తు, విచారణ సమయంలో సమయపాలన, సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా, న్యాయబద్ధతకూ, సామర్థ్యానికీ కట్టుబడి ఉండే నేర న్యాయ వ్యవస్థను బీఎన్ఎస్ఎస్ ఊహించింది. శోధనకు, నిర్బంధానికి సంబంధించిన ఆడియో–వీడియో రికార్డింగ్ తప్పనిసరి అవసరం అనేది పోలీసు పనితీరులో మరింత జవాబుదారీతనం, పారదర్శకత తేవడంలో ఒక ముఖ్యమైన దశ అవుతుంది. ఏది ఏమైనప్పటికీ, మనం లోతైన నిర్మాణాత్మక అడ్డంకులను పరిష్కరిస్తే తప్ప, సత్వర న్యాయం, సమర్థవంతమైన దర్యాప్తునకు చెందిన లక్ష్యాలను న్యాయబద్ధంగా సాధించలేమని గుర్తించడం చాలా ముఖ్యం.

కస్టడీలో సీసీటీవీ కెమెరాలుండాలి

అధికంగా ఉన్న ఖాళీలు, ఇప్పటికే అధిక భారం మోస్తున్న న్యాయవ్యవస్థ సమస్యలను పరిష్కరించకుండా సమయపాలనను చేరుకోలేము. విచారణలో ఫోరెన్సిక్ నిపుణుల తప్పనిసరి ప్రమేయం, విచారణ సమయంలో ఆడియో–వీడియో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం (పోలీసుల వాంగ్మూలాల రికార్డింగ్‌తో సహా), మౌలిక సదుపాయాలు, పరికరాలు, సిబ్బంది శిక్షణలో అభివృద్ధి అవసరం. ఫోరెన్సిక్స్‌లో, సామర్థ్య సమస్యలతో పాటు, మన నేర న్యాయ వ్యవస్థలో ఉపయోగించే పద్ధతుల శాస్త్రీయ ప్రామాణికతకు సంబంధించి చాలా లోతైన సమస్య ఉంది. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ద్వారా దేశంలో ఫోరెన్సిక్ సైన్స్ సామర్థ్యాన్ని పెంపొందించడానికి గణనీయమైన తోడ్పాటు అవసరం. అయితే ఫోరెన్సిక్ నిపుణుల సాక్ష్యాలకు సంబంధించిన విధానం గురించి ప్రాథమిక ప్రశ్నలు ఎక్కువగా పరిష్కృతం కాలేదు. సమర్థత, న్యాయం గురించి మనం జాగ్రత్త పడినట్లయితే, కస్టడీ హింసను నిరోధించడానికి పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే ప్రయత్నం విధిగా ఉండాలి. ఇవి ఏ నేపథ్యంలో అమలు అవుతాయో తగినంతగా లెక్కించకుండానే మనం తరచుగా సాంకేతికత, సామర్థ్యానికి చెందిన ప్రశ్నలను పరిశీలిస్తాము.

మొత్తంగా ఈ చట్టాలు మన నేర న్యాయ వ్యవస్థలో పాతుకుపోయిన అన్యాయాలను సరిదిద్దే అవకాశాలను కోల్పోయాయి. బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్‌బి రెండు వెర్షన్‌ల మధ్య మార్పులు ఉన్నాయి, కానీ నేర చట్టానికి సంబంధించిన విధానంలో ఎటువంటి ప్రాథమిక మార్పు వీటిలో లేదు. ఇప్పటికే ఉన్న క్రిమినల్ చట్టాన్ని నిర్వీర్యం చేసే బదులు, ఈ నూతన చట్టాలు వలసవాద తార్కికతకు మళ్లీ శంకుస్థాపన చేశాయి. ఇక్కడ ప్రభుత్వ ప్రధాన ఆసక్తి ప్రజలను గరిష్ఠ స్థాయిలో నియంత్రించడంగానే ఉంది.

– అనూప్ సురేంద్రనాథ్, జెబా సికోరా
వ్యాసకర్తలు ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ 'ప్రాజెక్ట్ 39ఏ'లో పనిచేస్తున్నారు.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏమైంది మనకు?



మన క్రీడలు, ప్రజాస్వామ్యానికి సంబంధించి ఒక సిగ్గుచేటైన నేరారోపణ వస్తుంది. అయినా భారత రెజ్లింగ్ సమాఖ్యకు వాళ్ల వర్గమే తిరిగి ఎన్నికవుతుంది. అగ్రశ్రేణి మల్లయోధులు తమ కెరియర్ నుంచి విరమణ ప్రకటిస్తారు. కానీ మంత్రులు, నాయకులు ఎవరినుంచీ కూడా ఒక వ్యాఖ్యానం రాదు. మన సామూహిక నైతికతా, వివేకమూ ఏమైనాయి?
– యశోవర్ధన్ ఝా ఆజాద్, మాజీ ఐపీఎస్

జడ్జ్ చేయొద్దు



జనం ఎవరిదో ఒకే ఒక్క పోస్ట్ చూస్తారు. కేవలం దాని ద్వారా వాళ్లకు ఆటిజం లేదా ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్) ఉందని నిర్ణయించేస్తారు. ఇది ఎంత చిరాకు కలిగిస్తుందో చెప్పలేను. మీ వికృత అంచనాలతో ఎదుటివారిని శల్యపరీక్ష చేయడం మానుకోండి.
– అర్నేసా బులిజుస్కిక్ కుస్తూరా పరిశోధకురాలు

సీతాకోకల్లా...



సీతాకోకచిలుక జీవితకాలం కేవలం కొన్ని రోజుల నుంచి వారమే ఉంటుంది. అయినప్పటికీ ఎంత సంతోషంగా ఎగురుతుంది! అది అందరికీ ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ పంచుతుంది. మన జీవితాలు కూడా అలా ఉండాలి.
– మాతా అమృతానందమయి ఆధ్యాత్మిక గురువు

ఇదీ అప్పు



పెరుగుతున్న ఇండియా రుణాల వల్ల, మీరు అత్యధిక పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. 2014: 54 లక్షల కోట్లు. 2023: 205 లక్షల కోట్లు. ఈ గణాంకాల మీద జనాలు రాజకీయం చేస్తున్నారు. కానీ ఇవి తెలుసుకోవాల్సిన కీలక వాస్తవాలు.
– అక్షత్ శ్రీవాస్తవ, ఆర్థిక నిపుణులు

ఇంకా చేయలేదా?



ఇంకా కొంత మంది ఎంపీలను గనక బహిష్కరించివుంటే, మన వెలుగులు జిమ్మే నూతన పార్లమెంట్ ఇక అచ్చమైన భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలా ఉండేది.
– రమేశ్ శ్రీవత్స్, కమెడియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

శత వసంతాల విద్యాకుసుమం

సికింద్రాబాద్‌లో బేగంపేట్ మీదుగా వెళ్తుంటే ఓ పెద్ద ప్రహరీ గోడపై 'ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట్, 1923లో నెలకొల్పబడినది' అని పెద్ద అక్షరాలు కన్పిస్తాయి. లోపల విశాలమైన మైదానాల్లో నిజాం కాలం నాటి తెలుపు రంగులో తళతళ మెరిసే భవంతుల సముదాయం కన్పిస్తుంది. ఈ సంవత్సరం ఈ బడికి వందేళ్లు పూర్తయ్యాయి. గొప్ప వారి పిల్లల కోసం ఏడవ నిజాం 1923లో 'జాగీర్దార్స్ కాలేజీ' పేరిట దీనిని ప్రారంభించారు. దీని కోసం ఒక బేగం 88 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చింది. మిగతా స్థలం కోసం జాగీర్దార్లు విరాళాలు ఇచ్చారు. నవాబులు, జాగీర్దారుల పిల్లలు, ఇంకా నగరంలోని ధనవంతుల పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా దీనిని ఏర్పాటు చేశారు. జాగీర్దారుల వార్షిక ఆదాయంలో 2 శాతం సొమ్మును వసూలు చేసి స్కూల్ భవనాల నిర్మాణాలు చేపట్టారు. అందువల్ల వారి పిల్లలకు విద్య ఉచితంగా లభించేది. ఆరంభంలో ఐదుగురు విద్యార్థులు, ఆరుగురు టీచర్లతో కేంబ్రిడ్జ్ తరహాలో పాఠాలు మొదలుపెట్టారు. 1930 నాటికి విద్యార్థుల సంఖ్య 150కి పెరిగింది. 1950లో జాగీర్దారీ విధానాన్ని రద్దు చేయడంతో ఆ కాలేజీకి 1951లో 'హైదరాబాద్ పబ్లిక్ స్కూల్' అని పేరు మార్చారు.

ఏడవ నిజాంకు తన స్టేట్‌లో లండన్‌లోని ఇంగ్లీష్ స్కూల్ స్థాయిలో ఒక పాఠశాలను కులీనుల పిల్లల కోసం ఏర్పాటు చేయాలనుకున్నాడు. తన వద్ద పనిచేసే ఓ ఆంగ్ల అధికారితో తన ఆలోచన పంచుకోగా ఆయన లండన్‌లోని 'ఈటన్ రెసిడెన్షియల్ స్కూల్' మాదిరి గురుకుల విద్యాలయం బాగుంటుందని చెప్పాడు. అలా ఆ ఆలోచన నిర్మాణ రూపానికి వచ్చింది.

ఈ స్కూల్లో చదివి ఉన్నత పదవుల్లో ఉన్నవారే ఈ స్కూల్ ఘనతకు నిదర్శనంగా నిలుస్తారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, ప్రోక్టర్ అండ్ గాంబ్లే సి ఓఓ శైలేష్ జేజురికార్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ పాల్ సింగ్ బంగా, ఎయిర్ మార్షల్ జె చలపతి, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, విప్రో వైస్ చైర్మన్‌గా పనిచేసిన టీకే కురియన్, క్రికెట్ కామెంటేటర్ హర్ష భోగ్లే.. ఇంకా కొందరు రాజకీయ నాయకులు, సినీనటులు ఈ స్కూల్‌లో చదువుకున్నారు. ఇదే స్కూల్‌లో 1986 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ విద్యార్థిగా ఉన్నప్పుడే 18 ఏళ్ల లోపు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. తన స్కూల్ అనుభవాలని చెబుతూ సత్య నాదెళ్ల తమ స్కూల్‌లో పాడుకొనే 'తు షహీన్ హై' అనే ఇక్బాల్ గీతం ఇప్పటికి స్ఫూర్తినిస్తోంది అన్నారు. ఖరీదైన విద్యాలయమైనా హైదరాబాద్ కీర్తి కిరీటంలో ఈ స్కూల్ ఓ రత్నంలా భాసిల్లుతోంది.

– బి. నర్సన్
తెలంగాణ బ్యాంకు విశ్రాంత అధికారి । 94401 28169

ప్రభుత్వ రంగం సిగలో విరిబోణి సింగరేణి

సందర్భం




ఎం.డి. మునీర్

సింగరేణికి ప్రభుత్వ రంగంలో 103 ఏండ్లు వచ్చాయి. మరో 150 ఏండ్లకు సరిపడా నిక్షేపాలున్నాయి. 10 వేల మిలయన్ టన్నులకు పైగా ఇప్పటికే గోదావరి తీరంలో గుర్తించిన నల్లబంగారం ఉన్నది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలు వల్ల సంస్థ భవిష్యత్తుకు ప్రమాదం వచ్చి పడింది. మళ్ళీ అస్తిత్వం కోసం, ప్రభుత్వ రంగంలో నిలదొక్కు కోవడం కోసం యూనియన్లకు, రాజకీయ పార్టీలకు అతీతంగా పోరు బాట పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులు, ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడి కార్మికుల, అధికారుల సమష్టి కృషితో నిలదొక్కుకున్న ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులూ, వారి కుటుంబ సభ్యులూ ముందు వరుసలో నిలబడ్డారు. తెలంగాణ కోసం 42 రోజులు సమ్మె చేశారు. ఇప్పుడు భవిష్యత్తు కోసం పోరాడుతున్నారు.

దేశంలోనే ప్రభుత్వ రంగంలో మొట్ట మొదటి సంస్థగా సింగరేణి ఆవిర్భవించింది. దేశానికి స్వాతంత్రం రాకముందు నుంచే సింగరేణి ప్రభుత్వ రంగంలో ఉన్నది. 1889లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించిన సింగరేణికి 134 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది. 1920 డిసెంబరు 23న సింగరేణి లిమిటెడ్ కంపెనీగా మారింది. రాష్ట్రం 51 శాతం.. కేంద్రం 49 శాతం వాటాతో సంస్థ పబ్లిక్ సెక్టార్ కంపెనీగా ఉంది. 1990 దశకంలో రెండుసార్లు దాదాపు ఖాయిలా జాబితాలో పడి బయటకు వచ్చిన మొట్ట మొదటి ప్రభుత్వ రంగసంస్థ సింగరేణి ఒక్కటే. ఈ సంవత్సరం డిసెంబర్ 23 నాటికి 'సింగరేణి లిమిటెడ్' సంస్థగా మారి 103 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం ఇది. సంస్థ నష్టాల నుంచి బయటపడి 1998 నుంచి లాభాల్లోకి వచ్చింది. సింగరేణి 2001–02 నుంచి కార్మికులకు తన నికర లాభాల నుంచి వాటా బోనస్‌ను చెల్లిస్తూ వస్తోంది. భారతదేశంలోని ప్రభుత్వరంగ సంస్థలలో ఎక్కడా కూడా లాభాలలో వాటా బోనస్‌ను ఉద్యోగులకు పంచి ఇస్తున్న సంస్థ లేదు. డిపెండెంట్ ఎంప్లాయి మెంట్‌ను కూడా అనారోగ్యంగా ఉన్న కార్మికుల ఇన్ వ్యాలి డేషన్ అనంతరం రెండు సంవత్సరాల మిగులు సర్వీసు నిబంధన మేరకు కొనసాగిస్తున్నారు.

సింగరేణి సొంతంగా మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఏర్పాటు చేసిన 1,200ల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి రాష్ట్రానికి విద్యుత్తును అందిస్తూ 50 శాతం రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీరుస్తున్నది. దీని వల్ల సంస్థకు ప్రతి ఏటా నాలుగు వందల కోట్ల రూపాయల లాభాలు వస్తున్నాయి. సోలార్ విద్యుత్ రంగంలోనూ అడుగు పెట్టి 300



మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఇప్పటికే సగం వరకు సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి రంగం సిద్ధం చేశారు. డిపెండెంటు, ఇతర కేటగిరీల కింద మొత్తంగా 9 వేల వరకు ఉద్యోగాలను సింగరేణి గడిచిన 7 సంవత్సరాలలో యువతకు కల్పించడం జరిగింది. ఉద్యోగులకు సొంత గృహం నిర్మించుకోవడానికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం, ఇంటింటికీ ఏసీలు పెట్టుకునే అవకాశం కల్పించింది సంస్థ.

ఐతే కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చి అమలు చేస్తున్న 'ప్రైవేటీకరణ చట్టం' వల్ల ప్రైవేట్ మల్టీ నేషనల్స్‌తో కలిసి ఫీజులు చెల్లించి వేలంలో పాల్గొంటే తప్ప కొత్త బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించే పరిస్థితి లేదు. అటు కోల్ ఇండియా దుఃస్థితి కూడా ఇలాగే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెండ్లు, పన్నులు, రాయల్టీల పేరిట ప్రతి సంవత్సరం ఆరు వేల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నా సింగరేణికి వేలంలో పాల్గొంటే తప్ప ఇప్పుడు కొత్త బ్లాక్‌లు వచ్చే పరిస్థితి లేదు. బొగ్గు బ్లాక్‌ల కోసం గత ఏడాది 72 గంటల సమ్మె కూడా చేశారు. ఈ పోరు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ విషయాన్ని కొత్తగా ఎంపికైన ఆ ప్రాంత ప్రజా ప్రతి నిధులూ, కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. లేకపోతే సంస్థ భవిష్యత్తు ఇరకాటంలో పడుతుంది. సింగరేణి అంటే తెలంగాణకు గుండెకాయ లాంటిది. వేలాది మందికి భవిష్యత్తులో ఉపాధి కల్పించే తల్లి లాంటిది. అలాంటి సంస్థను ప్రభుత్వరంగంలో కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

స్వాతంత్ర్యానికి ముందు నుంచి ప్రభుత్వరంగంలో ఉన్న సింగరేణిలో కార్మిక సంఘాలకు కూడా దశబ్దాల పోరాట చరిత్ర ఉంది. హక్కుల కోసం 1936లో 'ఉబాసి లాల్ ఫాసి' అనే కార్మికుడి నేతృత్వంలో 13 రోజులు సమ్మె జరిగిన దాఖలాలున్నాయి. 1945 నుంచి కార్మిక సంఘాల కార్యకలాపాలు, పోరాటాలు కొనసాగు తున్నాయి. 1998 నుంచి దేశంలోని ఎక్కడా కూడా బొగ్గు సంస్థలలో లేని విధంగా యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 27న యూనియన్ గుర్తింపు ఎన్నికలు ఉన్నాయి. 7వ సారి ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. అలాంటి సింగరేణిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

సింగరేణి లాభాలలో ఉంది నిజమే. అయితే సంస్థకు రావాల్సిన బకాయిలు వసూలు కాకపోవడంతో క్యాష్ రిచ్ కంపెనీ కాలేక పోతున్నది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుంచి ఎలాగూ బడ్జెటరీ మద్దతు లేదు. బొగ్గు విద్యుత్ సరఫరా చేసిన వేల కోట్ల బకాయిలనైనా అవి చెల్లించాలి. అందుకు తెలంగాణ ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధి, నిజాయితీతో కృషి చేయాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99518 65223
(నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం)

దైవ లీల

భగవంతుడు గతం, వర్తమానం తెలుసుకోవడానికి వీలు కల్పించాడు కానీ భవిష్యత్తులో ఏం జరగబోతుందో తెలియకుండా చేసి పెద్ద మెలిక పెట్టాడు. అందువల్లే మానవ జీవితాల్లో పలు మలుపులు చోటుచేసుకుంటూ ఉంటాయి. అనుకోనివి, ఊహకందనివి జరుగుతుంటాయి. వాటి వల్ల కలిగే మంచి లేదా చెడు అనేదంతా వారి వారి ప్రారబ్ధం మీద ఆధారపడి ఉంటుంది అంటారు.



ఓ భక్తుడు దేవేంద్రుడిని స్తుతిస్తూ నడుస్తున్నాడు. ఇంద్రుడు ఎదురుపడి 'ఏం కావాలి' అని అడిగాడు. 'నాకు కొద్దిగా అమృతం కావా'లని కోరాడు భక్తుడు. వెంటనే ఇంద్రుడు మూతపెట్టిన ఓ చిన్న అమృత పాత్ర సృష్టించి ఇచ్చాడు. 'జాగ్రత్తగా ఇంటికి తీసుకుపో. ఎవరికీ తెలీకుండా రహస్యంగా అమృతాన్ని సేవించు. నీకిక ఏ వ్యాధీ రాదు. మరణమూ రాదు. కానీ ఒక నిబంధన. ఇంటికి పోతున్నప్పుడు ఈ పాత్రను ఎక్కడా కింద ఉంచకూడద'న్నాడు. సరేనని భక్తుడు ఇంటికి బయలుదేరాడు. సరిగ్గా అదే సమయంలో కడుపు నొప్పితో బాధపడుతూ ఆత్మహత్య చేసుకోదలచిన వ్యక్తి ఎదురయ్యాడు. ఇంతలో భక్తునికి మూత్ర విసర్జన అవసరం వచ్చింది. దీంతో తన దగ్గర ఉన్న అమృత పాత్ర అతడికి ఇచ్చి 'దీనిలో విషం ఉంది. కింద పెట్టకుండా జగ్రత్తగా పట్టుకో' అని చెప్పి, చెట్టు చాటుకు వెళ్లాడు. వెంటనే అమృత పాత్ర తీసుకున్న వ్యక్తి... అమృతాన్ని విషంగా భావించి ఆత్మహత్య చేసుకోవడానికి తాగాడు. కడుపునొప్పి నుంచి వెంటనే విముక్తి పొందాడు. భక్తుడు భవిష్యత్తుని తెలుసుకోగలిగితే ఇలా జరిగేదేనా? అదే భగవంతుడి లీల!

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.ఏకాదశి ఉ.7.56 వరకు, తదుపరి ద్వాదశి తె.6.21 వరకు (తెల్లవారితే ఆదివారం), నక్షత్రం: భరణి రా.10.16 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: ఉ.8.23 నుండి 9.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.29 నుండి 7.58 వరకు, అమృతఘడియలు: సా.5.39 నుండి 7.12 వరకు, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి, గీతా జయంతి; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.30, **సూర్యాస్తమయం:** 5.27.

జగదానందకారకుడి జలవిహారం

- గోదావరిలో వైభవంగా భద్రాచల రామయ్య తెప్పోత్సవం
- శాస్త్రోక్తంగా సీతారాములకు పూజాదికాలు



గోదావరిలో విహరిస్తున్న హంస వాహనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం భద్రాచలంలో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం నుంచి సీతాసమేత శ్రీరాముడి ప్రయాణం పల్లకిలో గోదావరికి మొదలైంది. ముందు వరుసలో మహిళలు కోలాటం ఆడుతుండగా.. మంగళవాయిద్యాల బృందాలు అనుసరించాయి. రాజవీధుల గుండా ప్రయాణం సాగుతూ గోదావరి తీరానికి సాయంత్రం 5 గంటలకు రామయ్య చేరుకున్నారు. 5–08 గంటలకు హంస వాహనం దగ్గరకు చేరుకోగా, ఆగమ శాస్త్ర పద్ధతులను అనుసరిస్తూ సీతారాములను సాదరంగా ఆహ్వానించారు. హంస వాహనంలో కొలువుదీరిన రాముడిని షోడశోపచారాలతో పూజించి వేద పారాయణం చేశాక హారతులు అందించారు. సాయంత్రం 6–05 గంటల సమయంలో హంసాలంకరణ పడవలో సీతారాముల జలవిహారం ప్రారంభమైంది. ఒక్కో పరిక్రమణానికి ఒక్కోరకమైన హారతిస్తూ కనుల పండువగా వేడుక నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు ఐదు పరిక్రమణాలతో తెప్పోత్సవాన్ని పూర్తి చేశారు.

పులకించిన భక్తులు

తెప్పోత్సవంలో ఊరేగుతున్న రామయ్యను చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ ప్రియాంక అల పాల్గొన్నారు.

నేడు ఉత్తర ద్వారదర్శనం

భద్రాచలంలో శనివారం శ్రీ సీతారామచంద్రస్వామి వారు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. ఇందుకోసం దేవస్థానం ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.

'నామినేటెడ్ పోస్టుల్లో గంగపుత్రులకు ప్రాధాన్యమివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పోస్టుల్లో గంగపుత్రులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశబోయిన రఘు కోరారు. ఈమేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖరాశారు. త్వరలో ప్రకటించనున్న నామినేటెడ్ పోస్టుల్లో గంగపుత్రులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

జిల్లాలు, నియోజకవర్గాలవారీగా ప్రజావాణి తేదీలు ప్రకటించాలి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణిలో విన్నపాలు వినిపించేందుకు జిల్లాలు, నియోజకవర్గాల వారీగా తేదీలు ప్రకటించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ కోరారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్లకు అధికారం ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణకు రూ. 1,533 కోట్లు.. ఏపీకి రూ. 2,952 కోట్లు

రాష్ట్రాలకు పన్నుల వాటాలను విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాలకు పన్నుల్లో వాటాలకు సంబంధించిన నిధులను కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. రానున్న పండుగలు, నూతన ఏడాదిని దృష్టిలో ఉంచుకొని వివిధ సాంఘిక సంక్షేమ కార్యక్రమాల అమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకాల కోసం రూ.72,961.21 కోట్ల పన్నుల బకాయిల అదనపు వాయిదాను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు రూ. 1,533.64 కోట్లు, ఏపీకి రూ. 2,952.74 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. అత్యధికంగా యూపీకి రూ. 13,088 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రాల వాటాలను ఒక ఆర్థిక సంవత్సరంలో 14 విడతల్లో విడుదల చేస్తున్న కేంద్రం... అదనపు వాటా కింద ఈ నిధులను విడుదల చేసింది. ఇప్పటికే ఈ నెల 11న విడుదల చేసిన వాయిదాతోపాటు వచ్చే నెల 10న విడుదల చేయనున్న వాటాకు అదనంగా ఈ వాటా నిధులను విడుదల చేసినట్లు పేర్కొంది.

దైవదర్శనానికి వెళ్తూ మృత్యుఒడికి..

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద కారు, లారీ ఢీ
- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతులు ములుగు జిల్లా ఏటూరు నాగారం వాసులు

అతివేగం, పొగమంచు వల్లే ప్రమాదం? పరారీలో లారీ డ్రైవర్



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



కాంతయ్య, రేణుక



చందన



భరత్



శంకర్

ఎల్కతుర్తి/ఏటూరునాగారం: దైవదర్శనం కోసం కారులో వేములవాడ బయలుదేరిన ఓ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికలపేట, శాంతినగర్ సమీపంలో హనుమకొండ–కరీంనగర్ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి దాటాక కారు, లారీ ఢీకొన్న దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృత్యువాతపడ్డారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

రాత్రిపూట ప్రయాణంతో...


ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన మంతెన శంకర్ (60), మంతెన భరత్ (29), మంతెన కాంతయ్య (72), మంతెన చందన (16)తోపాటు మంతెన రేణుక (55), మంతెన భార్గవ్, మంతెన శ్రీదేవి కలసి కారులో గురువారం రాత్రి ఏటూరునాగారం నుంచి వేములవాడకు బయలుదేరారు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ నుంచి పెంచికలపేట సమీపంలోకి రాగానే వరంగల్ వైపు వెళ్తున్న లారీ, కారు ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అవడంతోపాటు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భరత్‌తోపాటు ఆయన తండ్రి శంకర్, మంతెన కాంతయ్య, ఆయన కుమార్తె చందన అక్కడికక్కడే మృతిచెందగా వెనుక సీటులో కూర్చున్న రేణుక, శ్రీదేవి, భార్గవ్‌లకు తీవ్ర గాయాలై కారులోనే ఇరుక్కుపోయారు. సమాచారం తెలుసుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రేణుక మృతిచెందింది. నిద్రమత్తు, అతివేగం, పొగ మంచు వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారైనట్లు తెలిపారు.

హనుమకొండలో షాపింగ్ చేసుకొని..

మంతెన శంకర్, కాంతయ్యలు వరుసకు అన్నదమ్ములు. శంకర్ కార్పెంటర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన భార్య శ్రీదేవికాగా చిన్న కుమారుడు భరత్ టీఎస్ ఎండీసీ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా, పెద్ద కుమారుడు భార్గవ్ వాజేడులోని రెవెన్యూ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాంతయ్య కంసాలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన భార్య రేణుకకు చాలాకాలం తర్వాత చందన జన్మించింది. అయ్యప్ప మాల ధరించిన శంకర్ చిన్న కుమారుడు భరత్‌కు మేడారం జాతర ముందు వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ కావడంతో దానిలో భాగంగానే శ్రీదేవి అక్క కొడుకుకు చెందిన కారును తీసుకొని కుటుంబ సభ్యులతో కలసి గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఏటూరునాగారం నుంచి వేములవాడకు బయలుదేరారు. మార్గమధ్యంలో హనుమకొండలో షాపింగ్ చేసుకొని తిరిగి వేములవాడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై ములుగు జిల్లాకు చెందిన పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించినట్లు తెలిపారు.

రబీ రంది తీరేదెలా?

- రైతుబంధుకు రైతుల ఎదురుచూపు



సాక్షి, హైదరాబాద్: రైతు బంధు కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటివరకు ఎకరంలోపు భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లోనే రైతుబంధు సొమ్ము జమ అయ్యింది. 9.44 లక్షల ఎకరాల్లో రైతులు ఇప్పటికే యాసంగి పంటలు సాగు చేశారు. అందులో 1.47 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. మరో 38 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు పనులు జరుగుతున్నాయి. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులకు డబ్బులు అవసరమవుతాయి. ఈ కీలకమైన సమయంలో సొమ్ము పడకపోతే ప్రైవేట్ అప్పులే శరణ్యమని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈనెల 12 నుంచి రైతుబంధు ప్రక్రియ ప్రారంభం కాగా, ఎకరాలోపు భూమి ఉన్న రైతుల్లో.. అది కూడా కొందరికే సొమ్ము పడింది. వాస్తవంగా రోజుకో ఎకరా చొప్పున మొదటి రోజు ఎకరా వరకు, రెండో రోజు రెండెకరాలు... ఇలా రోజుకు ఎకరం చొప్పున గతంలో ఇచ్చేవారు. అలాగే ఇస్తామని అధికారులు కూడా చెప్పారు. కానీ ఎకరాకు మించి భూమి ఉన్న వారికి పెట్టుబడి సాయం అందలేదని రైతులు అంటున్నారు.

మొత్తం రైతుబంధు లబ్ధిదారులు 68.99 లక్షలు: అధికారంలోకి రాగానే రైతుబంధు సొమ్ము అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఆ ప్రకారం రైతుబంధు సొమ్ము జమ ప్రక్రియ ప్రారంభమైంది. అది ఎకరాలోపు కొందరికి మాత్రమే ఇచ్చి నిలిచిపోయింది. మిగిలిన వారికి సొమ్ము పడలేదు. మొత్తం రైతుబంధు లబ్ధిదారులు 68.99 లక్షలున్నారు. వారందరికీ కలిపి రూ.7,625 కోట్లు చెల్లించాలి. ఎకరాలోపు ఉన్న రైతులు 22.55 లక్షల మంది ఉన్నారు. వారికి రూ. 642.57 కోట్లు చెల్లించాలి. ఇప్పటివరకు ఎకరాలోపున్న వారి లో సగం మందికే రైతుబంధు వచ్చింది. మొత్తంగా చూస్తే రైతుబంధు కోసం ఇంకా దాదాపు 58 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని వ్యవసాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిధులు లేకపోవడం వల్లే రైతుబంధు ఆలస్యమవుతుందని అధికారులు అంటున్నారు. ఈ నెలాఖరుకైనా ఇస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది. ఇది లాఉంటే రైతులకు బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వడం లేదు. గత పంటల రుణమాఫీ పూర్తికాకపోవడం, ఇంకా పెండింగ్‌లో ఉండటంతో బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

కొత్త రుణమాఫీపై కసరత్తు...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో రైతులు కూడా దానికోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై మార్గదర్శకాలు ఖరారు చేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖకు విన్నవించినట్లు తెలిసింది. గత రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారమే నడుచుకుంటారా? లేక కొత్తగా అదనపు నిబంధనలతో ఏమైనా మార్పులు చేర్పులు చేస్తారా అనేది తేలాల్సి ఉంది.

భూ విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతుల సంఖ్య	ఇవ్వాల్సిన రైతుబంధు
1–2	16.98 లక్షలమంది	రూ.1,278.60 కోట్లు
2–3	10.89 లక్షల మంది	రూ.1,325.24 కోట్లు
3–4	6.64 లక్షల మంది	రూ.1,131 కోట్లు
4–5	5.26 లక్షల మంది	రూ.1,052 కోట్లు
ఐదెకరాలకుపైబడి	6.65 లక్షల మంది	రూ. 2,600 కోట్లు

దుర్గం చెరువు పరిరక్షణపై త్రిసభ్య కమిటీ

- ఏర్పాటు చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలోని దుర్గం చెరువు పరిరక్షణకు త్రిసభ్య కమిటీని హైకోర్టు ఏర్పాటు చేసింది. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ అతుల్ నారాయణ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శిని కమిటీ సభ్యులుగా నియమించింది. ఆరు వారాల్లో నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది. దుర్గం చెరువు కలుషితం అవుతుండటం వల్ల శ్వాస ఆడక చేపలు మృత్యువాతపడి ఒడ్డుకు చేరుతున్నాయంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణగా స్వీకరించిన సంగతి తెలిసిందే.

చలి పెరిగింది



ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర పాఠశాలలో చలికి తట్టుకోలేక చలిమంట కాచుకుంటున్న విద్యార్థులు

- రాష్ట్రంలో భారీగాపడిపోయిన ఉష్ణోగ్రతలు
- గత ఐదేళ్లతో పోలిస్తే ఈసారి అత్యంత తక్కువగా ఉష్ణోగ్రతలు
- సగటు కనిష్ట ఉష్ణోగ్రత12.4 డిగ్రీల సెల్సియస్
- సాధారణం కంటే 4 డిగ్రీల మేర తగ్గిన కనిష్ట ఉష్ణోగ్రత
- అత్యంత తక్కువగా గిన్నెదారిలో 6.8 డిగ్రీలు

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)...	
మెదక్	9.4
ఆదిలాబాద్	9.5
రామగుండం	11.4
హన్మకొండ	12.0
హైదరాబాద్	12.5
దుండిగల్	13.2
నిజామాబాద్	13.2
హకీంపేట్	13.6
నల్లగొండ	14.4
ఖమ్మం	15.2
భద్రాచలం	16.0
మహబూబ్‌నగర్	16.7

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఐదేళ్లతో పోలిస్తే ఈసారి అత్యంత తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు నెలకొన్నాయి. దీంతో క్రమంగా తగ్గుతూ వచ్చిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు మరింత పడిపోయాయి. ఉష్ణోగ్రతల పతనానికి తోడుగా ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో చలి తీవ్రత పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రత కుమ్రుం భీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెదారిలో 6.8 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

అంతటా తగ్గుదలే...


రాష్ట్ర మంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగానే నమోదయ్యాయి. వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సగటు కనిష్ట ఉష్ణోగ్రత 14 డిగ్రీల సెల్సియస్. కానీ ప్రస్తుతం సగటు కనిష్ట ఉష్ణోగ్రత 12.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల వారీగా పరిశీలిస్తే మెదక్, హన్మకొండలో సాధారణం కంటే 4 డిగ్రీల మేర తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్, నల్లగొండ, రామగుండంలో, ఆదిలాబాద్ కనిష్ట ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల మేర తక్కువగా, ఇతర ప్రాంతాల్లో 2 డిగ్రీల మేర తక్కువగా నమోదై నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

ఇంకో రెండు రోజులు ఇలానే

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో ఇదే తరహాలో వాతావరణం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే ఖమ్మంలో గరిష్ట ఉష్ణోగ్రత 30డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

ప్రగతి పథంలో దక్షిణమధ్య రైల్వే

- దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వెల్లడి
- విశిష్ట రైల్ సేవా పురస్కారాలు ప్రదానం



పురస్కారం అందజేస్తున్న దక్షిణమధ్య రైల్వే జీఎం జైన్

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే జోన్ ప్రగతి పథంలో పరుగులు తీస్తుందని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అంకిత భావంతో, అత్యుత్తమ సేవలను అందజేయడమే ఈ ప్రగతికి కారణమని చెప్పారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించిన 68వ రైల్వే వారోత్సవాలలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలందించిన 77 మంది అధికారులు, ఉద్యోగులకు విశిష్ట రైల్ సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ..ఈ ఏడాది 383.85 కి.మీ. కొత్త ట్రాక్‌లతో కొత్త ప్రాంతాలకు రైల్వే సదుపాయాలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. 'మిషన్ ఎలక్ట్రిఫికేషన్' సాధించే దిశగా రికార్డు స్థాయిలో 1,017 రూట్ కి.మీ.ని విద్యుదీకరించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక ఏడాదిలో రూ. 21,635.49 కోట్ల అత్యధిక ఆదాయాన్ని ఆర్జించామన్నారు. అందులో 131.854 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.13,051.09 కోట్ల ఆదాయం లభించిందన్నారు. అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులు, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరవింద్ మల్ఖేడే, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.శ్రీధర్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు పాల్గొన్నారు.

భారత్‌ను చైనాతో పోల్చొద్దు: మోదీ



న్యూఢిల్లీ: అభివృద్ధి విషయంలో భారత్‌ను పొరుగు దేశమైన చైనాతో పదేపదే పోలుస్తుండడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసహనం వ్యక్తం చేశారు. భారత్‌ను ప్రజాస్వామ్య దేశాలతో పోల్చాలి తప్ప చైనాతో కాదని తేల్చిచెప్పారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల వార్తా పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. చైనా ప్రజాస్వామ్య దేశం కాదని, అక్కడ నియంతృత్వం రాజ్యమేలుతోందని చెప్పారు. భారత్‌ను ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోల్చమే సముచితమని సూచించారు. ఇండియాలో నిరుద్యోగం, అవినీతి, పరిపాలనాపరమైన అడ్డంకులు, నైపుణ్యాల లేమి వంటివి పెద్దగా లేవని మోదీ పేర్కొన్నారు. నిజంగా ఇలాంటి అంశాలు ఉండి ఉంటే, ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అనే హోదా మన దేశానికి దక్కేది కాదని స్పష్టం చేశారు. పలు అంతర్జాతీయ సంస్థల్లో భారత సంతతి సీఈఓలు సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఇండియాలో నైపుణ్యాల లేమి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. దేశంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టిస్తున్నామని మోదీ వెల్లడించారు. ప్రఖ్యాత విదేశీ సంస్థలను ఆకర్షించడమే తమ లక్ష్యమని తెలిపారు. దేశంలో మైనార్టీలను అణచివేస్తున్నారన్న ఆరోపణల్లో పస లేదని స్పష్టం చేశారు. మైనార్టీలపై ఎలాంటి వివక్ష లేదన్నారు. 20 కోట్ల మంది మైనార్టీలు ఇక్కడ క్షేమంగా జీవిస్తున్నారని చెప్పారు.

సస్పెన్షన్ కోసం వాళ్లే అభ్యర్థించారు: జోషి



న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయాలని కేంద్రప్రభుత్వం అనుకోలేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. సభకు అంతరాయం కలిగించిన కొందరు ఎంపీలను సస్పెండ్ చేయడంతో తమను కూడా సస్పెండ్ చేయాలంటూ ప్రతిపక్ష ఎంపీలు తమను కోరారని ఆయన చెప్పారు. శుక్రవారం మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాతో మాట్లాడారు. 'ఎంపీలను సస్పెండ్ చేయాలనే ఉద్దేశం మాకు లేదు. ప్లకార్డులతో రావొద్దని కోరాం. చర్యలుంటాయని ముందుగానే వారికి చెప్పాం. నిబంధనలు ఉల్లంఘించి కొందరు ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. క్రమశిక్షణారాహిత్యం కింద తమను కూడా సస్పెండ్ చేయాలంటూ మిగతా వారు కూడా కోరారు. కాంగ్రెస్ స్థాయి అంతగా దిగజారింది. లోక్‌సభ నుంచి 100 మంది, రాజ్యసభ సభ్యులు 46 మంది మొత్తం 146 మంది ఎంపీలు బహిష్కరణకు గురయ్యారు' అని మంత్రి చెప్పారు. తాజాగా పార్లమెంట్ ఆమోదం పొందిన మూడు క్రిమినల్ బిల్లుల్లో ఏమైనా లోపాలున్నాయని భావిస్తే కోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ప్రతిపక్షాలకు ఉందని ఆయన చెప్పారు.

గణతంత్ర దినోత్సవాలకు మాక్రాన్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరి 26న జరుగనున్న 75వ భారత గణతంత్ర వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన ఈ వేడుకల్లో పాల్గొనబోతున్నారని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. భారత గణతంత్ర దినోత్సవంలో పాల్గొంటున్న ఆరో ఫ్రాన్స్ అధ్యక్షుడిగా మాక్రాన్ రికార్డుకెక్కబోతున్నారు. గతంలో ఫ్రాన్స్ నుంచి ఐదుగురు అధినేతలు భారత రిపబ్లిక్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. వాస్తవానికి 2024 గణతంత్ర దినోత్సవానికి భారత ప్రభుత్వం తొలుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. కానీ, జనవరిలో భారత్‌లో పర్యటించలేనని ఆయన అశక్తత వ్యక్తం చేశారు.

ప్రఖ్యాత కవి ఇమ్రోజ్ కన్నుమూత



ముంబై: ఇమ్రోజ్‌గా అందరికీ సుపరిచితుడైన ప్రముఖ కవి, కళాకారుడు ఇందర్ జీత్(97) శుక్రవారం ముంబైలో కన్నుమూశారు. వయో సంబంధ రుగ్మతలతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. ఇమ్రోజ్, రచయిత్రి అమృతా ప్రీతమ్ మధ్య నాలుగు దశాబ్దాల బంధం ఉంది. ముంబైలోని కాండివిలిలో ఆయన అంత్యక్రియలు పూర్తి చేసినట్లు అమృతా ప్రీతమ్ కోడలు అల్కా క్వాత్రా చెప్పారు. ఇమ్రోజ్ చితికి ప్రీతమ్ మనవరాలు నిప్పంటించారు. 1926లో పంజాబ్‌లోని ల్యాల్‌పూర్‌లో ఇమ్రోజ్ జన్మించారు. పంజాబీలో రచయిత్రిగా మంచి పేరున్న అమృతా ప్రీతమ్‌తో 1950ల నుంచి ఆయన అనుబంధం కొనసాగింది. దాదాపు 40 ఏళ్లపాటు కలిసే ఉన్నారు. 2005లో అమృతా ప్రీతమ్ చనిపోయారు. ప్రీతమ్ అనారోగ్యం బారిన పడినప్పటి నుంచి ఇమ్రోజ్ కవితలు రాయడం ప్రారంభించారు. అమృతా ప్రీతమ్ చనిపోయాక కూడా కవితా వ్యాసంగం కొనసాగించి, ఆమెకు అంకితం చేశారు.

విన్ డీజిల్‌పై లైంగిక వేధింపుల కేసు



లాస్ ఏంజెలిస్: 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' సిరీస్ యాక్షన్ చిత్రాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న హాలీవుడ్ నటుడు విన్ డీజిల్ వివాదంలో చిక్కుకున్నారు. 2010లో సహాయకురాలి పనిచేస్తున్న సమయంలో అత్యాచారానికి యత్నించారంటూ మాజీ ఉద్యోగిని అస్టా జొనాస్సన్ తాజాగా ఆయనపై ఆరోపణలు చేశారు. అట్లాంటాలోని ఓ హోటల్‌లో బస చేసిన సమయంలో విన్ డీజిల్ తనను లైంగికంగా వేధించారంటూ ఆమె గురువారం లాస్ ఏంజెలెస్ కోర్టులో దావా వేశారు. లైంగిక వాంఛను తీర్చలేదనే కోపంతో వెంటనే విన్ డీజిల్‌కు చెందిన వన్ రేస్ ప్రొడక్షన్స్ సంస్థ నుంచి తనను తొలగించినట్లు ఆరోపించారు.

కర్ణాటకలో హిజాబ్‌పై నిషేధం ఎత్తివేత

మైసూరు: కర్ణాటకలో విద్యా సంస్థల్లో హిజాబ్ ధారణపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం ప్రకటించారు. ఈ నిర్ణయం శనివారం నుంచే అమల్లోకి వస్తుందన్నారు. నంజన్‌గూడ్‌లో మూడు పోలీస్ స్టేషన్లను ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలు సరికావంటూ బీజేపీపై మండిపడ్డారు. ''వాళ్లు పైకేమో సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అంటారు. కానీ టోపీలు, బురఖాలు, గడ్డం ఉన్నవారిని మాత్రం మినహాయిస్తుంటారు'' అంటూ చురకలంటించారు. మరి హిజాబ్‌పై ఆంక్షలెందుకని సభికులు ప్రశ్నించగా, ''ఇకపై హిజాబ్ ధరించవచ్చు. రేపట్నుంచి ఆంక్షలుండబోవు'' అని బదులిచ్చారు.

తగ్గిన వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాల వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.39.5 మేర తగ్గింది. దాంతో 19 కిలోల సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,757కు తగ్గిందని చమురు సంస్థలు తెలిపాయి. ముంబైలో రూ.1,710, కోల్‌కతాలో రూ.1,868.5, చెన్నైలో రూ.1,929గా ఉంటుందన్నాయి. దీని ధరను డిసెంబర్ 1న రూ.21 మేర పెంచడం తెలిసిందే. గృహావసరాల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.903లో ఎటువంటి మార్పు లేదని చమురు సంస్థలు స్పష్టం చేశాయి.

రహస్య పత్రాల కేసులో ఇమ్రాన్‌కు బెయిల్

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు ఊరట. రహస్య పత్రాల లీకేజీ కేసులో ఇమ్రాన్, ఆయన అనుచరుడు షా మహమూద్ ఖురేషీకి సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. తోషఖానా కేసులో ఇమ్రాన్ జైలులో ఉండటం తెలిసిందే.

డ్రాగన్‌పై అణుమానాలు!

అణు పరీక్షలకు సిద్ధమవుతున్న చైనా! వాయవ్య చైనాలోని లోప్‌నూర్‌లో ఏర్పాట్లు

- 1964 నాటి పరీక్ష కేంద్రంలో కొన్నేళ్లుగా చురుగ్గా కదలికలు
- ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడి, సర్వత్రా ఆందోళనలు
- మరోసారి అంతర్జాతీయ ఆయుధ పోటీ!
- భద్రతపరంగా భారత్‌కూ పెను సవాలే

డ్రాగన్ దేశం మళ్లీ అణు పరీక్షలకు సిద్ధపడుతోందా? అందుకోసం చాపకింద నీరులా కొన్నేళ్లుగా క్రమంగా పక్కాగా ఏర్పాట్లన్నీ చేసుకుంటూ వస్తోందా? ఏ క్షణంలోనైనా భారీ స్థాయిలో అణు పరీక్షలు చేపట్టనుందా? అంటే అవుననే అంటోంది తాజా పరిశోధన ఒకటి. అణు నిరాయుధీకరణ చర్యలను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో చైనా తాజా చర్యలు కలకలం రేపుతున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ ఆయుధ పోటీ ఎలాంటి మలుపు తీసుకుంటుందోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి...

అది వాయవ్య చైనాలోని మారుమూల జిన్‌జియాన్ అటానమస్ ఏరియా. అక్కడి ఓ ప్రాంతంలో కొన్నేళ్లుగా పలురకాలుగా హడావుడి పెరుగుతూ వస్తోంది. రకరకాల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కొండల్ని తొలిచి సొరంగాల్లాంటివి వేసే పనులూ సాగుతున్నాయి. ఇంకోవైపు కొత్త వైమానిక స్థావరం నిర్మాణంలో ఉంది. దానికి కొద్ది దూరంలోనే ఓ చిన్నపాటి శాటిలైట్ టౌన్ పుట్టుకొస్తోంది. బయటి ప్రపంచం దృష్టిలో పడకుండా అత్యంత పకడ్బందీగా జరుగుతున్న ఈ కార్యకలాపాలన్నీ ప్రముఖ అంతర్జాతీయ నిఘా నిపుణుడు డాక్టర్ రెనీ బాబియార్జ్ బయట పెట్టిన ఉపగ్రహ చిత్రాలతో తాజాగా వెలుగులోకి వచ్చాయి. దాంతో అంతర్జాతీయంగా ఒక్కసారిగా కలకలం రేగుతోంది. ఇవన్నీ జరుగుతున్నది 1964లో చైనా తొలిసారి అణు పరీక్షలు జరిపిన లోప్‌నూర్ ప్రాంతంలో కావడమే అందుకు కారణం! త్వరలో భారీ ఎత్తున అణు పరీక్షలకు చైనా సిద్ధమవుతోందనేందుకు ఇవన్నీ తిరుగులేని ఆధారాలని న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక పేర్కొంది. అమెరికా రక్షణ సంస్థ పెంటగాన్ మాజీ విశ్లేషకుడు కూడా అయిన రెనీ లోప్‌నూర్‌లో కార్యకలాపాలకు సంబంధించి కొన్నేళ్లుగా తీసిన ఉపగ్రహ ఛాయాచిత్రాలను లోతుగా పరిశీలించారు. ఆ మీదట ఆయన అందజేసిన సాక్ష్యాల ఆధారంగా న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనం కలకలం రేపుతోంది.

పక్కాగా ఏర్పాట్లు...!: న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని అభూత కల్పనగా చైనా కొట్టిపారేసింది. ఏదేదో ఊహించుకుని రాసిన నిరాధార కథనంగా దాన్ని అభివర్ణించింది. కానీ ఉపగ్రహ చిత్రాల్లో వెలుగు చూసిన విషయాలు మాత్రం చైనా కచ్చితంగా ఏదో దాస్తోందనేందుకు ఊతమిస్తున్నాయి. ఎందుకంటే ఒకట్రెండు శిథిల భవనాలు తప్ప 2017 దాకా నిద్రాణావస్థలోనే ఉన్న లోప్‌నూర్ ప్రాంతంలో గత కొన్నేళ్లలో అత్యాధునిక భవనాల భవన సముదాయాలు పుట్టుకొచ్చిన వైనం ఆ చిత్రాల్లో స్పష్టంగా కన్పిస్తోంది. అంతేగాక నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిన ఓ పటిష్టమైన బంకర్ కూడా ఉందక్కడ. దాని చుట్టూ ఎత్తైన రక్షణ గోడలు, పిడుగుపాటు నుంచి కాపాడే వ్యవస్థలు తదితరాలు కూడా కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. వీటితో పాటు ఏకంగా 90 అడుగుల ఎత్తైన డ్రిల్లింగ్ యంత్రం, ఆ పక్కనే డ్రిల్లింగ్ పైపులు కూడా ఉన్నాయి. దాని సాయంతో బహుశా నేలలోకి నిలువుగా కనీసం పావు మైలు లోతైన రంధ్రం చేసి అందులో అణ్వాయుధంతో కూడిన పేలుడు పదార్థాన్ని పేల్చి పరీక్షిస్తారన్నది బాబియార్జ్ అంచనా. లోప్‌నూర్‌కు కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో మలాన్ ప్రాంతంలో కూడా ఓ అత్యాధునిక శాటిలైట్ సిటీ నిర్మాణంలో ఉన్నట్టు ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది. అక్కడ కూడా రిగ్గింగ్ యంత్రాలు తదితర సెటప్ కనబడుతోంది. ఇదంతా బహుశా లోప్‌నూర్ అణు పరీక్ష పనుల్లో పాల్గొనే సిబ్బందికి పూర్తిస్థాయిలో ముందస్తు శిక్షణ కోసమని భావిస్తున్నారు.



అణు పరీక్ష కేంద్రంగా భావిస్తున్న ప్రాంతం. డ్రిల్లింగ్ రిగ్ (బాణం గుర్తుతో సూచించినది)



లోప్‌నూర్‌లో సిద్ధమవుతున్న కొత్త రోడ్లు. (ఇన్‌సెట్‌లో) రోడ్ గ్రేడర్ తదితర వాహనాలు

ఇప్పటిదాకా ఏయే దేశం ఎన్ని అణు పరీక్షలు చేసిందంటే...

దేశం	అణు పరీక్షలు
అమెరికా	1,030
రష్యా	715
ఫ్రాన్స్	210
చైనా	45
బ్రిటన్	45
భారత్	6
పాకిస్తాన్	2

(ఉత్తర కొరియా కూడా 6 అణ్వాయుధ పరీక్షలు జరిపినట్టు చెబుతారు)

ప్రాంతీయ భద్రతకు ముప్పే

చైనా అణు దూకుడు ఆసియాలో ప్రాంతీయ భద్రతను కూడా ప్రమాదంలో పడేసే పరిణామమేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చైనాతో సాయుధ ఘర్షణలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇది మరీ ఇబ్బందికర పరిణామమే కానుంది. 1998 పోఖ్రాన్ అణు పరీక్షల అనంతరం వాటిపై భారత్ స్వీయ నిషేధం విధించుకోవడం తెలిసిందే.

అణు పరీక్షలు ఎందుకంటే...

చైనా అణు పరీక్షలకు దిగనుండటమే నిజమైతే అందుకు కారణాలు ఏమై ఉంటాయా అన్న చర్చ కూడా జోరుగా జరుగుతోంది. అందుకు రక్షణ నిపుణులు పలు కారణాలను చూపుతున్నారు....

- అణు కార్యకలాపాల విషయంలో కొద్దికాలంగా చైనా దూకుడు పెంచింది.
- దశాబ్దం క్రితం దాకా దానివద్ద కేవలం 50 ఖండాంతర క్షిపణులు మాత్రమే ఉండేవి.
- వాటిని 2028 కల్లా ఏకంగా 1,000కి పెంచాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇటీవలే పెంటగాన్ వార్షిక నివేదిక వెల్లడించింది.
- వీటిలో 507 క్షిపణులను అణు సామర్థ్యంతో కూడినవిగా చైనా తీర్చిదిద్దనున్నట్టు తెలుస్తోంది.
- ఈ దిశగా కొంతకాలంగా పలు అత్యాధునిక అణు వార్‌హెడ్లను చైనా తయారు చేస్తోంది.
- వాటిని అధునాతన ఖండాంతర, క్రూయిజ్ మిసైళ్లకు అనుసంధానిస్తూ వస్తోంది.
- ఆ వార్‌హెడ్లను పూర్తిస్థాయిలో పరీక్షించి సరిచూసుకునే ఉద్దేశంతో డ్రాగన్ దేశం ఇలా అణు పరీక్షలకు సిద్ధమవుతోందని అనుమానిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గాజాలో 20,057కి చేరిన మృతుల సంఖ్య

ఖాన్ యూనిస్: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో సామాన్యులే సమిధలవుతున్నారు. అక్టోబర్ 7న ఇరుపక్షాల మధ్య మొదలైన యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ఇజ్రాయెల్ సైన్యం గాజాపై వైమానిక, భూతల దాడులకు దిగుతోంది. సాధారణ జనావాసాలపై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 20,057 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ శుక్రవారం ప్రకటించింది. అంటే గాజాలోని మొత్తం జనాభాలో ఒక శాతం మంది మృత్యువాత పడినట్లు స్పష్టమవుతోంది. మృతుల్లో మూడింట రెండొంతుల మంది మహిళలు, చిన్నారులే కావడం గమనార్హం. సరిపడా ఆహారం, నీరు అందక గాజాలో జనం ఆకలితో అల్లాడిపోతున్నారని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 5 లక్షల మందికి ఆహారం అందడం లేదని వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా గాజాకు మానవతా సాయం ఆశించిన స్థాయిలో అందడం లేదని పేర్కొంది. యుద్ధం కారణంగా వేలాది మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణను కోరుతూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరగాల్సిన ఓటింగ్ వాయిదా పడింది.

రెండు రోజుల్లో 390 మంది బలి

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భీకరస్థాయిలో విరుచుకుపడుతోంది. గత రెండు రోజుల వ్యవధిలో ఇజ్రాయెల్ దాడుల్లో ఏకంగా 390 మంది పాలస్తీనియన్లు బలయ్యారని గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. 734 మంది క్షతగాత్రులుగా మారారని తెలియజేసింది. గాజాలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా కమ్యూనికేషన్ వ్యవస్థ స్తంభించింది.

ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

బీజేపీపై 'ఇండియా' కూటమి నేతల ధ్వజం



శుక్రవారం ఢిల్లీలో విపక్ష ఇండియా కూటమి ధర్నాలో ఏచూరి, రాహుల్, ఖర్గే, పవార్, డి.రాజా తదితరులు

- 146 మంది ఎంపీల సస్పెన్షన్‌కు నిరసనగా 'సేవ్ డెమొక్రసీ' పేరుతో జంతర్‌మంతర్ వద్ద ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభల నుంచి 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడంపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద 'సేవ్ డెమొక్రసీ' పేరిట భారీ ధర్నా నిర్వహించారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై ప్రశ్నిస్తే బహిష్కరిస్తారా? అని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకం కావాలని ఇండియా కూటమి నాయకులు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు వామపక్ష నాయకులు, డీఎంకే, ఎన్సీపీ, సమాజ్‌వాదీ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, జేఎంఎం, రాష్ట్రీయ జనతాదళ్ తదితర పార్టీల నాయకులు, పార్లమెంట్ ఉభయ సభల నుంచి సస్పెండైన ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం పెనుముప్పును ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రతిపక్షాలు చేతులు కలపాల్సి వచ్చిందని చెప్పారు. అందరూ ఒక్కటై కలిసికట్టుగా పనిచేస్తే ప్రధాని నరేంద్ర మోదీ చేయగలిగేది ఏమీ ఉండదని అన్నారు. ప్రభుత్వం తమను ఎంతగా అణచివేయాలని చూస్తే అంతగా పైకి లేస్తామని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే తామంతా ఉమ్మడిగా పోరాడుతున్నామని ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ వీధివీధికీ తిరిగినా బీజేపీ ఓడిపోయిందని అన్నారు.

ప్రజల గొంతుకలను అణచి వేశారు

పార్లమెంట్‌లో ఈ నెల 13న చోటుచేసుకున్న భద్రతా వైఫల్యం ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని ప్రశ్నించినందుకు పార్లమెంట్ నుంచి 146 మంది విపక్ష సభ్యులను అన్యాయంగా సస్పెండ్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. అధికార బీజేపీ దేశంలో విద్వేషాన్ని మరింతగా వ్యాప్తి చేస్తోందని, 'ఇండియా' కూటమి పార్టీలు మాత్రం మరింత ప్రేమ, సోదరభావాన్ని పంచుతున్నాయని వ్యాఖ్యానించారు. 146 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి బహిష్కరించడం ద్వారా దేశ జనాభాలో 60 శాతం మంది ప్రజల గొంతుకలను ప్రభుత్వం అణచివేసిందని ఆరోపించారు. ''ఇద్దరు ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోకి దూకి పొగ వదిలారు. దీనిని చూసి బీజేపీ ఎంపీలు పారిపోయారు. దేశభక్తులుగా చెప్పుకునే బీజేపీ నేతల గాలి పోయింది'' అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ఇండియా కూటమి నాయకులు చెప్పారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ విమర్శించారు. పార్లమెంట్ నుంచి బయటకు పంపిస్తే విపక్షాల నోరు మూసుకుంటాయని ప్రభుత్వం భావిస్తోందని ఆక్షేపించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ... దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన సార్వభౌమత్వం ప్రజాప్రతినిధుల ద్వారా అమలు కావాలన్నారు. అమృత మథనం కథలో అమృతం రాక్షసుల చేతికి చిక్కిందని, దాన్ని వెనక్కి తెచ్చేందుకు అందరూ ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. పార్లమెంట్‌ను అనవసర వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తప్పుపట్టారు. పార్లమెంట్‌కు విలువ లేకపోతే ప్రజాస్వామ్యం మరణిస్తుందన్నారు. 'బీజేపీ విముక్త భారత్' మన లక్ష్యం కావాలని తృణమూల్ పార్టీ ఎంపీ మౌసమ్ నూర్ అన్నారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆర్జేడీ నేత మనోజ్ ఝా, సీపీఐ(ఎంఎల్) నాయకుడు దీపాంకర్ భట్టాచార్య, రాష్ట్రీయ లోక్‌దళ్ నేత షహీద్ సిద్దిఖీ, సమాజ్‌వాదీ నేత ఎస్.సి.హసన్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత హస్నైన్ మసూదీ తదితరులు ప్రసంగించారు.

మరో 640 కోవిడ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 640 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో, యాక్టివ్ కేసులు 2,669 నుంచి 2,997కు పెరిగాయని కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. దీంతో, దేశంలో ఇప్పటి వరకు నమోదైన కోవిడ్ కేసులు 4, 50, 07, 212కు చేరాయి. కోవిడ్‌తో చనిపోయిన వారి సంఖ్య 5,33,328కి పెరిగింది. రికవరీ రేటు 98.81 శాతం కాగా మరణాల రేటు 1.19గా ఉందని పేర్కొంది.

కేజ్రీవాల్‌కు ఈడీ మూడోసారి సమన్లు



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై ముఖ్య మంత్రి కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముచ్చటగా మూడోసారి సమన్లు పంపింది. జనవరి 3వ తేదీన తమ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అందులో కోరింది. నవంబర్ 2, డిసెంబర్ 21వ తేదీల్లో పంపిన రెండు నోటీసులకు కేజ్రీవాల్ స్పందించలేదు. చట్టవిరుద్ధంగా జారీ చేసిన సమన్లతో ఈడీ విచారణకు హాజరయ్యేది లేదని తేల్చి చెప్పారు. సీఎం కేజ్రీవాల్ ప్రస్తుతం విపాసన మెడిటేషన్ శిక్షణకు వెళ్లారు.

దాడి వెనుక పాక్, చైనా

- లద్దాఖ్ నుంచి ఆర్మీని వెనక్కి తీసుకొచ్చేలా భారత్‌పై ఒత్తిడికి కుట్ర
- కశ్మీర్‌లో ఉగ్రవాద ముఠాలకు రెండు పొరుగుదేశాలు ఊతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో గురువారం ఆర్మీ వాహనాలపై దాడి వెనుక పాక్, చైనాల హస్తముందని రక్షణ శాఖ వర్గాలు అంటున్నాయి. లద్దాఖ్ సరిహద్దుల్లో భారీగా మోహరించిన ఆర్మీని మరోవైపు తరలించేలా భారత్‌పై ఒత్తిడి పెంచేందుకే ఆ రెండు దేశాలు కుట్ర పన్నినట్లు అనుమానిస్తున్నాయి. కశ్మీర్ లోయలో ముఖ్యంగా పాక్ సరిహద్దుల్లో ఉన్న పూంఛ్, రాజౌరీ సెక్టార్లలో భారత ఆర్మీ లక్ష్యంగా ఇటీవల పెరిగిన ఉగ్ర దాడుల ఘటనలకు చైనా, పాకిస్తాన్‌ల ఉమ్మడి వ్యూహమే కారణమని చెబుతున్నాయి. ఆర్మీపై దాడుల ద్వారా భారత్‌ను రెచ్చగొట్టేందుకు పాకిస్తాన్ ఇప్పటికే పూంఛ్ అటవీ ప్రాంతాల్లోకి 25 నుంచి 30 మంది వరకు ఉగ్రవాదులను దొంగచాటుగా పంపించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి.



గురువారం ఉగ్రవాదుల దాడిలో దెబ్బ తిన్న సైనిక వాహనం

కశ్మీర్ వైపు దృష్టి మళ్లించేందుకే..

గల్వాన్ సంక్షోభం అనంతరం భారత్ లద్దాఖ్‌కు భారీగా సైన్యాన్ని తరలించడం చైనాకు రుచించడం లేదు. అందుకే తిరిగి కశ్మీర్ వైపు భారత్ దృష్టిని మళ్లించేందుకే, పాక్‌తో కుమ్మక్కయి పశ్చిమ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని రాజేసేందుకు పూనుకుంది. భారత్ 2020లో ప్రత్యేక శిక్షణ పొందిన రాష్ట్రీయ రైఫిల్స్ బలగాలను పూంఛ్ నుంచి లద్దాఖ్‌కు భారత్ తరలించింది. ఈ చర్యతో ఎంతో కీలకమైన లద్దాఖ్ ప్రాంతంలో చైనాపై భారత్‌దే పైచేయి అయ్యింది. అయితే, అదే సమయంలో పూంఛ్‌లో ఉగ్రవాదులను నిలువరించే వనరులు తక్కువపడ్డాయి. ఈ విషయం గ్రహించిన చైనా పూంఛ్‌లో పాక్‌కు దన్నుగా నిలుస్తూ ఉగ్ర చర్యలకు ఊతమివ్వసాగిందని రక్షణ రంగ నిపుణుడు కల్నల్ మనోజ్ కుమార్ చెప్పారు.

ఆర్టికల్ 370 రద్దుతో కడుపుమంట

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుపై చైనా, పాకిస్తాన్‌లు అసంతృప్తితో రగిలిపోతున్నాయి. అందుకే, కశ్మీర్‌లో ముఖ్యంగా సరిహద్దుల్లో ఉన్న పూంఛ్, రాజౌరీల్లో అశాంతిని ప్రేరేపించేందుకు కాచుక్కూర్చున్నాయని రిటైర్డు కల్నల్ అజయ్ కొథియాల్ చెప్పారు. తాజాగా, సుప్రీంకోర్టు కూడా రద్దు సరైందేనని తీర్పు ఇవ్వడం ఆ రెండు దేశాలకు పుండుమీద కారం చల్లినట్లయిందన్నారు. ఇకపై జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోసేందుకు అవి ప్రయత్నాలు ముమ్మరం చేసే అవకాశాలున్నాయన్నారు.

అమెరికా తయారీ రైఫిళ్లు: గురువారం నాటి దాడికి తమదే బాధ్యతంటూ పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరేతోయిబా అనుబంధ పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ (పీఏఎఫ్ఎఫ్) ఉగ్రవాదులు ప్రకటించుకున్నారు. దాడికి సంబంధించిన ఫొటోలను వారు సోషల్ మీడియాలో విడుదల చేశారు. వారి చేతుల్లో అమెరికా తయారీ అత్యాధునిక ఎం4 కార్బైన్ అసాల్ట్ రైఫిళ్లు కూడా కనిపిస్తున్నాయి. గతంలోనూ ఉగ్రవాదులు వీటిని వాడిన దాఖలాలున్నాయి.

హెలికాప్టర్లు.. స్నైపర్ డాగ్స్

పూంఛ్ జిల్లాలో అయిదుగురు జవాన్లను పొట్టనబెట్టుకున్న ముష్కరుల కోసం గాలింపు ముమ్మరమైంది. గురువారం మధ్యాహ్నం సురాన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధేరా కి గలి– బఫ్లియాజ్ మార్గంలో ఉన్న ధత్యార్ మోర్హ్ సమీపంలోని మలుపులో ఎత్తైన కొండపై ఉగ్రవాదులు పొంచి ఉన్నారు. బలగాలతో వెళ్తున్న రెండు వాహనాల వేగం బ్లైండ్ కర్వ్‌లో నెమ్మదించగానే ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో అయిదుగురు జవాన్లు నేలకొరగ్గా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ముష్కరులు ఇద్దరు జవాన్ల మృతదేహాలను ఛిద్రం చేయడంతోపాటు వారి వద్ద ఉన్న ఆయుధాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో ముగ్గురు లేదా నలుగురు ముష్కరులు పాల్గొని ఉంటారని ఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)అధికారులు తెలిపారు. ఘటన అనంతరం పరారైన ఉగ్రవాదుల కోసం అటవీ ప్రాంతంలో హెలికాప్టర్లతో గాలిస్తున్నారు. ఉగ్రవాదుల జాడను పసిగట్టేందుకు స్నైపర్ జాగిలాలను రంగంలోకి దించారు. ఘటన జరిగిన వెంటనే ఆ ప్రాంతాన్ని దిగ్బంధనం చేసిన బలగాలు శుక్రవారం ఉదయం నుంచి అణువణువూ శోధిస్తున్నాయి.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 23 । డిసెంబర్ । 2023



డబ్బులు డిమాండ్ చేసినందుకే హత్య
రేషన్ బియ్యం దందా చేస్తున్న వ్యక్తులను డబ్బులు డిమాండ్ చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని హత్య చేసిన కేసులో నిందితులను ఐఎస్ సదన్ పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో



సర్కిళ్ల వారీగా ఆస్తి పన్ను వసూలు
సర్కిళ్లవారీగా వంద శాతం ఆస్తిపన్నులు వసూలు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. -8లో

ప్రజావాణికి పోటెత్తిన జనం



ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం బేగంపేటలోని జ్యోతిరావు ఫులే ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి ఉదయం 4.30 గంటల నుంచే మొదలు కావడం గమనార్హం. -8లో

న్యూస్‌రీల్

ఇద్దరు చిన్నారులకు కోవిడ్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఆగాపుర ప్రాంతానికి చెందిన 14 నెలల చిన్నారికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో రెండు నెలల చిన్నారికి పాజిటివ్ వచ్చింది. దీంతో నిలోఫర్‌లో కోవిడ్ కేసుల సంఖ్య రెండుకు చేరింది. ఇవి పాత వేరియంట్ కేసులా లేక కొత్త వేరియంట్ (జేఎన్-1) కేసులా అని తెలుసుకునేందుకు చిన్నారి రోగుల రక్త నమూనాలను జీనోమిక్ సీక్వెన్స్ సెంటర్‌కు పంపించినట్లు నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు అప్రమత్తం అయ్యారు. ఆసుపత్రిలో ప్రత్యేక కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ఇన్ఫోసిస్ భవనంలో 120 బెడ్ల సామర్థ్యంతో ప్రత్యేక వార్డును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు కోవిడ్ కేసులు పెరిగినా 20 మంది రోగులకు సరిపడా సౌకర్యాలను సమకూర్చినట్లు, అవసరమైతే వార్డును పూర్తిస్థాయిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని డాక్టర్ ఉషారాణి తెలిపారు.

శేరిలింగంపల్లిలో కోవిడ్ పాజిటివ్ కేసు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో కోవిడ్ ఒక పాజిటివ్ కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు. గౌలిదొడ్డికి చెందిన 34 ఏళ్ల వ్యక్తికి కోవిడ్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కాంటినెంటల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు శుక్రవారం శేరిలింగంపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ సీహెచ్‌ఓ స్వామి తెలిపారు.

బంజారాహిల్స్‌లో అగ్నిప్రమాదం

- అయిదుగురిని కాపాడిన కానిస్టేబుళ్లు



కాలి బూడిదైన ఇంట్లోని వస్తువులు



ప్రమాదం నుంచి కాపాడిన కానిస్టేబుళ్లు

పంజగుట్ట: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1లోని ఓ వ్యాపార సముదాయ భవనంలోని ఆరో అంతస్తులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అయిదుగురిని కాపాడారు. ఘటన వివరాలు ఇలా.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్- 1లోని జలగం వెంగళరావు పార్క్ ఎదురుగా ఉన్న మల్లిక్ ఎస్టేట్‌లో వ్యాపార సముదాయం ఉంది. ఆరో అంతస్తులో టెర్రస్‌పై ఉన్న ఫ్లాట్‌లో అపార్ట్‌మెంట్‌లో పని చేసే ఓ కుటుంబం ఉంటోంది. శుక్రవారం ఉదయం 7. 30 గంటల ప్రాంతంలో టెర్రస్‌పై నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పెట్రోకార్ సిబ్బంది, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు శ్రావణ్ కుమార్, సత్యనారాయణ, దశరథరామిరెడ్డి ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేసి రప్పించారు. బయట ఉన్న ఓ డంబుల్ కానిస్టేబుళ్లు సాయంతో తలుపు గడియలు పగులగొట్టి ఫ్లాట్ లోపల ఉన్న అయిదుగురు కుటుంబ సభ్యులను బయటకు తీసుకువచ్చారు. అప్పటికే ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. ప్రమాదం నుంచి బయటపడిన ఓ మానసిక దివ్యాంగుడిని, అతని కుటుంబ సభ్యులను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చూపిన చొరవకు స్థానికులు అభినందించారు. ఆలస్యంగా వచ్చిన మూడు ఫైరింజిన్‌లు మంటలను ఆర్పాయి.





ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు.. (ఇన్‌సెట్‌లో) భుజంపై పక్షితో సరదాగా మంత్రి జూపల్లి

టూరిజంలో మనమే మేటి

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హైటెక్స్‌లో కిడ్స్ ఎక్స్‌పో, పెటెక్స్ ఇండియా



రూ.1.45 లక్షల విలువైన అరోవానా చేప



అక్వేరియాలను తిలకిస్తున్న విదేశీ వనితలు

మాదాపూర్: తెలంగాణకు గొప్ప సాంస్కృతిక వారసత్వం, ప్రశంసనీయమైన చరిత్ర ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం పెటెక్స్ ఇండియా- 2023, హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ టూరిజం బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలని సూచించారు. కిడ్స్ ఫెయిర్‌లో సృజనాత్మకత, సానుకూల ఆలోచన, ఆరోగ్యకరమైన పెరుగుదల, శారీరక శ్రమ, క్రీడలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ తెలిపారు. పెటెక్స్‌లో పెంపుడు జంతువుల ఫుడ్, హెల్త్‌కేర్, ఫ్యాషన్, లైఫ్ స్టైల్, యాక్సెసరీస్, పెట్ టాయ్‌లు, పెట్ బోర్డింగ్ లాంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫిష్ అక్వేరియాలు ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. అరుదైన 60 రకాల చేపలు అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. వీటిలో అరోవానా చేప ధర రూ.1.45 లక్షలుగా ఉందని శ్రీకాంత్ పేర్కొన్నారు.

నేరాలు పెరిగాయ్!



మహిళలపై అఘాయిత్యాల కేసులు ఎక్కువే..



2023 వార్షిక గణాంకాలను విడుదల చేస్తున్న నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తదితరులు

- అత్యాచారం కేసుల్లో 'అసలైనవి' తక్కువగానే..
- నగరంలో నేరాలు 2 శాతం.. శిక్షలు 20 శాతం
- 2023 గణాంకాలను విడుదల చేసిన సిటీ కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: గత ఏడాదితో పోలిస్తే నగరంలో నేరాలు 2 శాతం, శిక్షలు 20 శాతం పెరిగినట్లు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బాధిత అతివలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తుండటం, ఫిర్యాదు చేయడానికి ఉపకరించే మాధ్యమాలు పెరగడం తదితర కారణాల నేపథ్యంలో మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఎక్కువగానే ఉన్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఏర్పాటు చేసిన వార్షిక విలేకరుల సమావేశంలో ఆయన 2023కు సంబంధించిన గణాంకాలను విడుదల చేశారు. అత్యాచారం కేసుల్లోనూ పెరుగుదల కనిపిస్తోందని, అయితే వీటిలో అత్యధికం మైనర్లతో ప్రేమాయణం, పేరు పేరుతో మోసాలకు సంబంధించినవే అని, అసలైన అత్యాచారం కేసుల సంఖ్య తక్కువగానే ఉందని కొత్వాల్ వివరించారు. సొత్తు సంబంధిత నేరాలు తొమ్మిది శాతం, రికవరీలు మాత్రం 13 శాతం పెరిగాయని పేర్కొన్నారు. ఈ ఏడాది కోర్టుల్లో 7137 కేసుల విచారణ పూర్తయి, 4,465 మందికి శిక్షలు పడ్డాయని, ఇది గత ఏడాదితో పోలిస్తే 20 శాతం అధికమని వివరించారు. నానాటికీ పెరిగిపోతున్న సైబర్ నేరాలను కట్టడి చేయడానికి సిబ్బందికి సైతం ఎప్పటికప్పుడు శిక్షణ అవసరమని, వచ్చే నెల నుంచి దీన్ని పునఃప్రారంభిస్తున్నట్లు కొత్వాల్ పేర్కొన్నారు. నగర నేర పరిశోధన విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ల్యాండ్ స్కామ్‌లకు సంబంధించిన కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

డ్రగ్స్ గుర్తింపునకు ప్రత్యేక జాగిలాలు..

మాదకద్రవ్యాల నియంత్రణ కోసం టీఎస్-నాబ్‌తో కలిసి పని చేయడంతో పాటు డ్రగ్స్‌ను గుర్తించడం కోసం పోలీసు జాగిలాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న జాగిలాలు అటు పేలుడు పదార్థాలు, ఇటు మాదక ద్రవ్యాల గుర్తింపునకు వాడుతున్నామని, మరింత మెరుగైన ఫలితాల కోసం డ్రగ్స్‌కు ప్రత్యేక జాగిలాలను వాడనున్నామని శ్రీనివాసరెడ్డి తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించిన, సహకరించిన పబ్స్, బార్లతో పాటు ఫామ్‌హౌస్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కొన్ని ప్రాంతాల్లో 'సరి- బేసి' విధానం..

రాజధానిలో నానాటికీ పెరిగిపోతున్న వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని, దీన్ని గమనించిన ముఖ్యమంత్రి సైతం తన కాన్వాయ్ కోసం సామాన్యులకు ఇబ్బంది పెట్టద్దని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అయితే ఆయన భద్రతను దృష్టిలో పెట్టుకుని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసు కమిషనర్ తెలిపారు. నగరంలోని కొన్ని రహదారుల్లో «సరి-బేసి» విధానం అవలంబించేందుకు ప్రయత్నిస్తామని కొత్వాల్ పేర్కొన్నారు. దీని ప్రకారం సరి సంఖ్యతో కూడిన రిజిస్ట్రేషన్ నెంబర్ల వాహనాలు ఒక రోజు, మిగిలినవి మరో రోజు సంచరించాల్సి ఉంటుందన్నారు. ఆటో పర్మిట్ల నియంత్రణ, నిర్దేశిత ప్రాంతాల్లో అవి తిరగకుండా కట్టడికి ప్రయత్నాలు చేస్తామన్నారు. న్యూ ఇయర్ వేడుకలు రాత్రి ఒంటి గంటకు పూర్తి కావాలని కొత్వాల్ శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. సమావేశంలో అదనపు సీపీలు ఏవీ రంగనాథ్, విశ్వప్రసాద్, సంయుక్త సీపీలు సత్యనారాయణ, పరిమళ నూతల్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిఫారసులతో వస్తే సీరియస్ యాక్షన్...

నగర పోలీసు కమిషనరేట్‌లో జరిగే బదిలీలు, పోస్టింగ్స్ పూర్తి పారదర్శకంగా ఉంటాయని కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా బదిలీల ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. పోలీసు బదిలీల్లో ఎలాంటి సిఫారస్‌లకు తావు లేదని, ఎవరైనా ఇలాంటి లేఖలతో వచ్చినా, ఇతర విధాలుగా ప్రయత్నాలు చేసినా వారి యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్‌లో (ఏసీఆర్) ఆ అంశాన్ని పొందుపరుస్తామని హెచ్చరించారు.

కీలక గణాంకాలిలా..

నేరం	2022	2023
మొత్తం కేసులు	24220	24821
బాడీలీ క్రైమ్	2181	2537
తీవ్రమైన బాడీలీ క్రైమ్	368	513
సాధారణ బాడీలీ క్రైమ్	1813	2024
సొత్తు సంబంధిత నేరాలు	3094	3361
వీటిలో తీవ్రమైనవి	179	193
సాధారణమైనవి	2915	3005
మహిళలపై నేరాలు	2484	2775
పోక్సో కేసులు	428	377



రోడ్డు ప్రమాదాలు

	2022	2023
రోడ్డు ప్రమాదాలు	2018	2312
మరణాలు	275	280
క్షతగాత్రులు	2106	2370
పాదచారుల మరణాలు	110	121
డ్రంక్ డ్రైవింగ్ కేసులు	44990	37866
మొత్తం కేసులు	46,42,357	47,25,089

సైబర్ నేరాలు

	2022	2023
మొత్తం కేసులు	2249	2735
అరెస్టైన నిందితులు	274	169
ఆపరేషన్లు జరిగిన రాష్ట్రాలు	16	17
దోషులుగా తేలిన నిందితులు	13	02

చోరీలు.. రికవరీలు...	2022	2023
ప్రజలు కోల్పోయిన సొత్తు విలువ	రూ.27.98 కోట్లు	రూ.38.38 కోట్లు
రికవరీ	రూ.21.05 కోట్లు	రూ.28.45 కోట్లు




'గులాబీ'లో గుబులు!

పక్కచూపులు చూస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

- కాపాడుకునే యత్నంలో పార్టీ నేతలు
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో కొత్త సమీకరణలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ పాలకవర్గంలోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న మేయర్ బీఆర్ఎస్ పార్టీ కాగా, ఆ పార్టీకి దాదాపు 60 మంది కార్పొరేటర్లున్నారు. ఇటీవలి కాలంలో అన్ని పార్టీల్లోనూ జంపింగ్‌లు సాధారణమయ్యాయి. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిన వారితో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వారూ ఉన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచింది 56 సీట్లు కాగా, ఇతర పార్టీల నుంచి రాక పోకల నేపథ్యంలో దాదాపు 60 మంది కార్పొరేటర్లున్నారు. ఇప్పటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ స్థానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో బీఆర్ఎస్ నుంచి ఎంతమంది కాంగ్రెస్ వైపు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎందుకంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ అయితేనే తమ డివిజన్లలోఎక్కువ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించుకోవడంతో పాటు ఆయా కార్పొరేషన్ల నామినేటెడ్ చైర్మన్లుగా, డైరెక్టర్లుగా అవకాశాలు.. భవిష్యత్తులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లకు అవకాశం ఉంటుందనే తలంపుతో పలువురు అధికార పార్టీవైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే దాన్ని కాదని కొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇలాంటి వారి సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.



కేటీఆర్ సమావేశంలో రహస్యమేమిటో?

గతంలో అధికార పార్టీ అయినందున బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా లేక తమ పూర్వాశ్రమంలోకి వెళ్తారా లేక అధికార కాంగ్రెస్‌లో చేరతారా అన్నది చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లు సైతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన సమావేశానికి డుమ్మా కొట్టినట్లు తెలిసింది. దీంతో పలు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. సమావేశానికి హాజరైన వారు సైతం అందరూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా ? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రతిపక్ష పార్టీలో ఉంటే తమకు సరిగా పనులు జరగవేమోననే తలంపుతోనూ కొందరు కార్పొరేటర్లున్నట్లు తెలుస్తోంది. బహుశా.. కార్పొరేటర్ల ఊగిసలాటను గుర్తించే కాబోలు కేటీఆర్ వారితో నిర్వహించిన సమావేశంలో భవిష్యత్‌లో జరగబోయే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ వల్ల దాదాపు పదిమంది వరకు కార్పొరేటర్లకు ఎమ్మెల్యేలయ్యేందుకు అవకాశాలుంటాయని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రేటర్ పరిధిలోని ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ఆయా సందర్భాల్లో చేసిన కామెంట్లు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండటం కూడా పలు ఊహాగానాలకు తావిస్తోంది. ఒకవేళ ఎమ్మెల్యేలు పార్టీ మారితే తమకు అనుకూలురైన కార్పొరేటర్లను కూడా తీసుకు వెళ్లవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

జీహెచ్ఎంసీలో విచిత్ర పరిస్థితులు..

రాబోయే రోజుల్లో జీహెచ్ఎంసీలో విచిత్ర పరిస్థితులు నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనరల్‌బాడీ సమావేశాలకు, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు అధ్యక్షత వహించేది మేయర్. బీఆర్ఎస్‌కు చెందిన మేయర్‌ది ఇప్పటి వరకు అధికార పార్టీ కాగా, ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ. ప్రశ్నలు సంధించాల్సింది అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యులు. రాష్ట్రంలో తమ పార్టీ ప్రభుత్వమున్నప్పుడే సమావేశాల్ని సవ్యంగా నిర్వహించలేకపోయిన మేయర్.. ఇకముందు ఎలా నిర్వహిస్తారోననే ఆసక్తి రాజకీయ వర్గాల్లో ఏర్పడింది. ప్రతిసారీ గందరగోళాలు, రసాభాసలతో నడిచిన సమావేశాలు రాబోయే రోజుల్లో మరింత గందరగోళం కాగలవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాము ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్ సభ్యులు సైతం ఇకముందు తమ సమస్యల్ని ఎలా ప్రస్తావిస్తారో చూడాల్సిందే. ఇప్పటి వరకు మౌనంగా ఉన్న ఎంఐఎం.. అనుకూలంగానే ఉంటుందా.. వ్యతిరేకత ప్రదర్శిస్తుందా అన్నది స్పష్టం అయ్యేందుకు కొంత సమయం పట్టనుంది. భవిష్యత్‌లో ఒకవేళ ఎంఐఎం కాంగ్రెస్‌తో జత కలిస్తే ..మేయర్ సీటుకు సైతం ఎసరు రాగలదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఇలాంటి పరిణామాల్ని ఊహించి సైతం పార్టీల మార్పిడి జరగవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మరోసారి బంపర్ ఆఫర్

ఆన్‌లైన్‌లో ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్

- పెండింగ్ ఈ-చలాన్లు చెల్లించే అవకాశం
- 60 నుంచి 90 శాతం లభించనున్న డిస్కౌంట్
- వెబ్‌సైట్‌లోనే ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న లింకు
- ఈ నెల 26 నుంచి వచ్చే నెల 10 వరకు నిర్వహణ
- రాజధానిలోనే రూ.560 కోట్ల వరకు పెండింగ్



సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఈ-చలాన్ జరిమానా బకాయిలు భారీ తగ్గించుకోవడానికి అవకాశం కల్పించే ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్ ఈ నెలలో ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దీన్ని నిర్వహించడానికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ-చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాటిలో 91 శాతం ద్విచక్ర వాహనాలు, సామాన్యులకు సంబంధించినవే ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం భారీ డిస్కౌంట్ ఇస్తోంది. గడిచిన కొన్నేళ్లుగా ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో చలాన్లు విధించారు. అయితే ఆ స్థాయిలో వాహనచోకుల నుంచి చెల్లింపులు జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.800 కోట్లు ఈ-చలాన్ బకాయిలు ఉన్నాయి. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలోనే వీటిలో 70 శాతం ... అంటే దాదాపు రూ.560 కోట్ల మేర పెండింగ్‌లో ఉండిపోయాయి.

– గతంలో ప్రతి ఏడాది ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్‌లు జరిగేవి. 2016 అక్టోబర్ తర్వాత వీటికీ బ్రేక్ పడింది. సుదీర్ఘకాలం తర్వాత గత ఏడాది 45 రోజుల పాటు నిర్వహించారు. దీన్ని మూడు కమిషనరేట్లకు చెందిన 2.92 కోట్ల వాహనచోదకులు వినియోగించుకుని రూ.295 కోట్లు చెల్లించారు. సాధారణంగా మెగా లోక్ అదాలత్ ఒకే రోజు, నిర్దేశించిన ప్రాంతంలో జరుగుతుంది. అయితే ట్రాఫిక్ లోక్ అదాలత్ మాత్రం ఆన్‌లైన్‌లోనే జరగనుంది. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 10 వరకు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అవసరాన్ని బట్టి ఈ గడువు పెంపునకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటారు.

ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా..

వాహన చోదకులు తమ వాహనంపై జారీ అయి ఉన్న పెండింగ్ ఈ-చలాన్ వివరాలు పోలీసు అధికారిక వెబ్‌సైట్లతో పాటు ఈ-చలాన్‌కు సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. వాటిలో ఏర్పాటు చేయబోయే ప్రత్యేక లింకు ద్వారా ఎంటర్ కావాలి. అందులో వాహనం వివరాలు పొందుపరాలి. ప్రత్యేక అప్లికేషన్ డిసౌంట్ పోను ఎంత మొత్తం చెల్లించాలో చూపిస్తుంది. అక్కడ నుంచే వివిధ పేమెంట్ గేట్‌వేల్లోకి ద్వారా, ఈ-సేవ, మీ-సేవ కార్యాలయాల ద్వారానూ పేమెంట్లు చేయవచ్చు. పెండింగ్ చలాన్లు నేపథ్యంలో ఆయా వాహనాలపై గతంలో చార్జ్‌షీట్లు దాఖలై ఉంటే వాటినీ పోలీసులు ఉపసంహరించుకుంటారు. తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులపై కేసులు నమోదు చేసే ట్రాఫిక్ పోలీసులు వారికి ఈ-చలాన్ జారీ చేస్తారు. ఆర్టీసీ బస్సులపై జారీ అయ్యే ఈ-చలాన్లను ఆ సమయంలో వాహనం నడిపిన డ్రైవరే చెల్లించాలి. ఈ రెండు కేటగిరీలకు చెందిన వారికి సైతం మెగా లోక్ అదాలత్‌లో అవకాశం ఇస్తున్నారు.

సూర్యోదయాన్ని చూసి వస్తుండగా..

అదుపు తప్పి పల్టీ కొట్టిన కారు

- పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం
- మరో నలుగురికి స్వల్ప గాయాలు
- రాయదుర్గం పరిధిలో ఘటన





బోల్తాపడిన కారు పక్కన బానోతు శ్రీరాం మృతదేహం (ఇన్‌సెట్‌లో) బానోతు శ్రీరాం (ఫైల్)

గచ్చిబౌలి: సూర్యోదయాన్ని చూసి కారులో వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ మహేష్ తెలిపిన ప్రకారం వివరాలు.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఎర్రగడ్డ తండాకు చెందిన బానోతు రామ్మోహన్, వినోద దంపతుల కుమారుడు బానోతు శ్రీరాం (20) మెదక్ జిల్లా జోగిపేట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. ఇండస్ట్రియల్ విజిట్ కోసం అయిదుగురు క్లాస్‌మేట్‌లు కలిసి నగరానికి వచ్చారు. గురువారం రాత్రి మణికొండలో ఉండే మిత్రుడు దితేష్ ఇంట్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం సన్‌రైజ్ (సూర్యోదయం) చూసేందుకు ఖాజాగూడ పెద్ద చెరువు వ్యూ పాయింట్ వద్దకు వెళ్లారు. అక్కడ కొద్దిసేపు ఫొటోలు దిగి ఆనందంగా గడిపారు. అనంతరం లింక్ రోడ్డులో స్పోర్ట్స్ కారులో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ వైపు బయలుదేరారు. ఇక్కడ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత చెట్టును, ఓ బండరాయిని ఢీకొని అవతల రోడ్డుపై పల్టీ కొట్టింది. కారు ముందు సీట్లో కూర్చున్న బానోతు శ్రీరాం తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని చందానగర్ గంగారం నివాసి కె.ఉదయ్ సాయి, మణికొండకు చెందిన దితేష్, రామాయంపేటకు చెందిన వర్షిత్, నారాయణ్‌ఖేడ్‌కు చెందిన వంశీలకు గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన శ్రీరాంతో పాటు మిగతా నలుగురు జోగిపేట్‌లోని పాలిటెక్నిక్ కాలేజీలో ఫైనలియర్ చదువుతున్నారు. రోడ్డుపై పిల్లి అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేయగా కారు అదుపు తప్పిందని డ్రైవింగ్ చేసి ఉదయ్ సాయి చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీరాం ఎగిరి కారు కింద పడ్డాడని, సీటు బెల్ట్ పెట్టుకుంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని పోలీసులు తెలిపారు. అతి వేగంగా, నిర్లక్ష్యంగా కారు నడపడంతోనే అది అదుపు తప్పినట్లు పోలీసులు భావిస్తున్నారు.

కుమారుడు లేడని.. కన్నీరుమున్నీరుగా..

కూలిపనులు చేస్తూ రెక్కల కష్టంతో కుమారుడు శ్రీరాంను, కూతురు హిమశ్రీని చదివిస్తున్నానని మృతుడు శ్రీరాం తండ్రి రామ్మోహన్ ప్రమాద స్థలానికి వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. కొడుకు లేడని జీర్ణించుకోలేక గుండెలవిసేలా ఆయన రోదించారు. ఘటనా స్థలాన్ని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ మహేష్, ఎస్ఐ విజయ్ కుమార్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనవరి 6న 'జైపూర్ ఫుట్' వార్షికోత్సవం


మాట్లాడుతున్న బీఎంవీఎస్ఎస్ ప్రతినిధులు

సనత్‌నగర్: ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కృత్రిమ అవయవ మార్గదర్శి 'జైపూర్ ఫుట్' 20వ వార్షికోత్సవం జనవరి 6న హైటెక్‌సిటీలోని శిల్ప కళా వేదికలో జరపనున్నారు. రెండు మిలియన్ల ఆంప్యూటీలను చేరుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేదికపై పలువురి విజయగాథలను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయత సమితి (బీఎంవీఎస్ఎస్) చైర్‌పర్సన్ లక్ష్మీ నివాస్‌శర్మ, కార్యదర్శి ఇందర్‌చంద్ జైన్, ఉపాధ్యక్షులు ఫరీదా హుస్సేన్, రిటైర్డ్ ఐఏఎస్ పీసీ ప్రకాష్‌లు వివరాలు వెల్లడించారు. జైపూర్ ఫుట్‌ను ఆధారంగా చేసుకుని వైకల్యాన్ని జయించిన ఎందరో మహోన్నతులను సన్మానించనున్నట్లు తెలిపారు. ప్రఖ్యాత నర్తకి సుధాచంద్రన్, ప్రముఖ కవి కుమార్ విశ్వాస్, ప్రముఖ నటుడు విక్రమ్ అగ్నిహోత్రి, కళాకారుడు మనోజ్ భింగారే, ఐఐటీ చెన్నై పూర్వ విద్యార్థి నాగ నరేష్ కరుతుర, సివిల్ సర్వీస్ బ్యాచ్ 2022కు చెందిన సూరజ్ తివారీ, ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన శ్రీహరి బుధమగర్‌లు వారి జీవితానుభవాలను ఈ వేదికపై పంచుకోనున్నట్లు వివరించారు. అంగ వైకల్యం ఎదురైనప్పుడు కుంగిపోకుండా వారు ఎంచుకున్న రంగంలో జీవిత సవాళ్లను అధిగమించి ఉన్నత స్థానానికి చేరి స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖులను వార్షికోత్సవం సందర్భంగా ఒకచోట చేర్చడం జరుగుతుందన్నారు. తద్వారా ఇతరులను ప్రేరేపించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. కాగా ఈ సమావేశంలో జైపూర్ ఫుట్‌ను అమర్చుకున్న పలువురు తమ అనుభవాలను వివరించారు.

గ్రేస్ మార్కుల పెంపు కోసం సీఎంకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2016, 2017 బ్యాచ్ పూర్వవిద్యార్థులు గ్రేస్ మార్కుల పెంపు కోసం సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. శుక్రవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో షేక్ అహ్మద్ నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి.. ఇంజినీరింగ్ ఓయూలో చివరి సంవత్సరం విద్యార్థులకు అమలవుతున్న 0.5 గ్రేస్ మార్కుల శాతాన్ని 1కి పెంచాలని కోరారు. పాయింట్ ఫైవ్ విధానం వల్ల పెద్దగా ఉపయోగం లేదని, ఒక శాతానికి గ్రేస్ మార్కులు పెంచితేనే ఎక్కువ మంది ఉత్తీర్ణులవుతారని వివరించారు. విద్యార్థుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఓయూ వైస్ ఛాన్స్‌లర్‌తో మాట్లాడి అమలు చేసేల చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.

27న కొండా మాధవరెడ్డి గౌరవార్థం పోస్టల్ కవర్ విడుదల

లక్డీకాపూల్: దివంగత జస్టిస్ కొండా మాధవ రెడ్డి 100వ జయంతిని పురస్కరించుకొని, ఆయన గౌరవార్థం ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల కానుంది. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేతుల మీదుగా గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాలలో ఈ నెల 27వ తేదీన ఈ ప్రత్యేక పోస్టల్ కవర్‌ను విడుదల చేయనున్నారు. కొండా మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్, ముంబై హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మాధవరెడ్డి జీవిత సారాంశం, ఆయన రచనలు, విలువలు ఎనలేనివన్నారు. ఆయన జీవితం ప్రతిబింబించే మహత్తర సందర్భం ఇదన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం


డాక్టర్ అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న హీరో విరాజ్ అశ్విన్

పంజగుట్ట: రోజురోజుకూ కిడ్నీ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కిడ్నీ వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ నెఫ్రాలజీ వైద్యుడు డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. నెఫ్రాలజీ రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను వరల్డ్ వైడ్ హెల్త్‌కేర్ సంస్థ వారు బెస్ట్ నెఫ్రాలజీ ఆఫ్ ది ఇయర్‌గా 'వరల్డ్ వైడ్ హెల్త్‌కేర్ అచీవర్స్ అవార్డును' కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రి ఎస్.పి.సింగ్ బాగేల్ చేతుల మీదుగా ఈ నెల 12వ తేదీన ఢిల్లీలో అందుకున్న అరుణ్‌కుమార్‌ను శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సత్కరించారు. సినీనటుడు విరాజ్ అశ్విన్ (బేబీ సినిమా ఫేం) హాజరై అరుణ్‌కు అభినందనలు తెలిపారు. డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ..కిడ్నీ సమస్యలు హైబీపీ, డయాబెటిస్, పెయిన్ కిల్లర్లు వాడటం వల్ల వస్తాయని, ఈ మూడింటినీ మనం కంట్రోల్ చేసుకోవచ్చునని, సరైన డైట్, వ్యాయామం చేయడం ద్వారా బీపీ, డయాబెటిస్‌ను నియంత్రించవచ్చునన్నారు. మన తెలంగాణ వైద్యుడికి ప్రతిష్టాత్మక అవార్డు రావడం సంతోషంగా ఉందని సినీ హీరో విరాజ్ అశ్విన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నెఫ్రో ప్లస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రోహిత్ సింగ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి పోటెత్తిన జనం



లక్డీకాపూల్: ప్రజావాణికి కార్యక్రమానికి వివిధ సమస్యలపై దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం బేగంపేటలోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం ఉదయం 4.30 గంటల నుంచే మొదలు కావడం గమనార్హం. చలిని సైతం లెక్కచేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకుంటే తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశతో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నోడల్ అధికారిణి హరిచందన పర్యవేక్షణలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దరఖాస్తుదారులు క్యూ లో ఎక్కువసేపు ఉంచకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో వచ్చిన వాళ్ల ను వచ్చినట్టే క్యూ ద్వారా లోపలికి పంపిస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. ప్రజావాణిలో.. ఉద్యోగుల బదిలీలు, పెన్షన్లు, విజ్ఞప్తులతో పాటు భూకబ్జా లు, డబుల్ బెడ్రూమ్ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. కాగా తన కూతురు ఉద్యోగం కోసం వస్తే భార్య తప్పి పోయిందంటూ కొడంగల్‌కు చెందిన వెంకటేష్ ఆందోళన చెందాడు. ఐదుగురు ఆడపిల్లలు కలిగిన తాము ఏ కూతురికైనా చిన్న జాబ్ ఇస్తారనే ఆశతో ప్రజాభవన్‌కు వచ్చామని.. ఇక్కడ జనంలో తన భార్య తప్పిపోయిందని.. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కొండారెడ్డిపల్లికి చెందిన ఈరపాకుల పెద్ద పూశయ్య తన నాలుగు ఎకరాల భూమిని కబ్జా చేశారంటూ ఆవేదన చెందారు. ఈ విషయంలో గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రజాభవన్‌లో సీనియర్ సిటిజన్లు, మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలు, కౌంటర్లను ఏర్పాటు చేశారు.

అభ్యర్థులు ఖర్చుల వివరాలు సమర్పించాలి

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన వివిధ పార్టీల అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను సంబంధిత నియోజకవర్గాల్లోని అకౌంటింగ్ టీమ్, సహాయ వ్యయ పరిశీలకులకు అందజేయాలని అడిషనల్ కమిషనర్ (ఎన్నికలు)జె. శంకరయ్య తెలిపారు. శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో అభ్యర్థుల ఖర్చుల వివరాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీచేసిన అభ్యర్థులు డిసెంబర్ 29 నాటికి తమ ఖర్చుల వివరాలను పూర్తి స్థాయిలో అందించాలని కోరారు. వాటిని వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఖర్చుల వివరాలు సమర్పించని వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అకౌంట్ నోడల్ ఆఫీసర్ శరత్ చంద్ర మాట్లాడుతూ, ఈ నెల 29వ తేదీన జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల వ్యయ పరిశీలకులు, సహాయ వ్యయ పరిశీలకుల సమక్షంలో అకౌంట్ రీకన్సిలేషన్ సమావేశం నిర్వహించబడుతుందని తెలిపారు. ఆ లోపున అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను సమర్పించాలన్నారు.

రియల్టర్‌ను చితకబాదిన కేసులో మాజీ డీఐ అరెస్టు

చిక్కడపల్లి: రియల్టర్‌ను చితకబాదిన కేసులో చిక్కడపల్లి మాజీ డీఐ వి.ప్రసాద్‌ను చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల డీఐగా నెలరోజులపాటు పనిచేసిన ప్రసాద్‌పై చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. రియల్టర్‌పై దాడి చేసినట్లుగా బాధితులు ఫిర్యాదు చేయడంతో ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య పేర్కొన్న విషయం తెలిసిందే ఎన్నికల సమయంలో వి.ప్రసాద్ చిక్కడపల్లి డీఐగా ఒక నెలరోజులపాటు పనిచేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తన స్నేహితుడైన రాజు అనే రియల్టర్‌కు ప్రసాద్ డబ్బులు ఇచ్చారు. అయితే కంపెనీ రిజిస్ట్రేషన్‌లో తన అన్న శేఖర్ పేరు పెట్టాలని ప్రసాద్ సూచించాడు. అలా చేయకుండా రాజు మరో పేరు కంపెనీ రిజిస్ట్రేషన్‌లో పెట్టడంతో పాటు తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వనందుకు ఆగ్రహించి రాజును చితకబాదారని ఇన్‌స్పెక్టర్ సీతయ్య పేర్కొన్నారు.

సర్కిళ్ల వారీగా ఆస్తి పన్ను వసూలు

– జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

సాక్షి, సిటీబ్యూరో: సర్కిళ్లవారీగా వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆస్తి పన్ను వసూళ్లపై అడిషనల్, జోనల్, డిప్యూటీ,అసిస్టెంట్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా 18.9 లక్షల ప్రాపర్టీలలో 2023 డిసెంబర్ 20 నాటికి రూ.1208.35 కోట్ల ఆస్తి పన్ను సేకరించామని తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆస్తిపన్ను వసూళ్లను ఫిబ్రవరి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిళ్ల వారీగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని వారి జాబితాను పరిశీలించి వసూలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను వసూళ్లలో ఎటువంటి కోర్టు కేసులు ఉన్నా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, భవనాలతో సహ వాణిజ్య భవనాలు, హాస్టళ్లు, స్టేడియంల ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వసూలైన మొత్తం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ జోనల్ కమిషనర్లు వెంకటేష్ దోత్రె, మమత, శ్రీనివాస్ రెడ్డి, రవి కిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

272 కిలోల గంజాయి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

శామీర్‌పేట్: గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకుని..272 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పేట్ బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ శబరీష్ వివరాలు వెల్లడించారు. పూణే నగరానికి చెందిన అప్ప సోలంకీ, సత్ర జిల్లాకు చెందిన యోగేష్ రాజాసింగ్ జాదవ్, దినకర్ నారలి, చరణ్‌లాల్ సింద, యోగిరాజ్ సంజయ్ మహోత్కర్, చైతన్య తుషార్, రాహుల్ కాంతిలాల్ లు ఒక ముఠాగా ఏర్పడి..ఒడిశా నుండి గంజాయిని తీసుకొచ్చి పలు నగరాల్లో విక్రయిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం వీరు ఒడిశా నుంచి హైదరాబాద్ నగరం మీదుగా పూణేకు 272 కిలోల గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా శామీర్‌పేట ఓఆర్ఆర్ టోల్‌గేట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి గంజాయితోపాటు రెండు కార్లు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

డబ్బులు డిమాండ్ చేసినందుకే హత్య

రియల్టర్ హత్యకేసులో వెలుగులోకి నిజాలు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదరాజు రోహిత్ రాజు తదితరులు

సంతోష్‌నగర్: గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా రేషన్ బియ్యం దందాను నిర్వహిస్తున్న వ్యక్తులకు డబ్బులు డిమాండ్ చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని దారుణంగా హత్య చేసిన కేసులో శుక్రవారం ఏడుగురు నిందితులను ఐ.ఎస్.సదన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోని మైనర్ బాలున్ని జువైనల్ హోమ్‌కు తరలించారు. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదరాజు రోహిత్ రాజు, అడిషనల్ డీసీపీ మనోహర్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్‌లతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. ఈదిబజార్ రామచంద్రా నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ తారీఖ్ అలీ (39) రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మహ్మద్ మజ్హర్ ఆలియాస్ చోటు, మాదన్నపేట్ ప్రాంతానికి చెందిన షేక్ ముజమీల్ ఆలియాస్ షేక్ ముబీన్, ఖలీంఖాన్, మహ్మద్ అఫ్రోజ్ సిద్దిఖీలు ప్రజల వద్ద రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బీదర్‌తో పాటు పలు ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరంతా గత అక్టోబర్ నెలలోకర్మన్‌ఘాట్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ వీరి టేబుల్ సమీపంలో కూర్చున్న ఆరీఫ్‌తో పాటు అతని స్నేహితులతో ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఆరీఫ్ తల పగలగొట్టారు. ఈ విషయమై రాజీ కుదిర్చేందుకు మహ్మద్ తారీఖ్ అలీకి రూ.2 లక్షల నగదు ఇచ్చారు. కానీ ఆయన బాధితునికి డబ్బులు ఇవ్వకపోగా..తనకు నెలకు రూ.లక్ష ఇవ్వాలని, లేకుంటే మీ రేషన్ బియ్యం దందా గురించి ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దీంతో మహ్మద్ తారీఖ్ అలీని ఎలాగైనా హత్య చేయాలని నలుగురు పథకం వేశారు. ఈ నెల 18న రాత్రి మహ్మద్ మజ్హర్, షేక్ ముజమీల్, ఖలీం ఖాన్, మహ్మద్ అఫ్రోజ్ సిద్దిఖీలతో పాటు తలాబ్‌కట్టాకు చెందిన ఖాలేద్ ఉస్మాన్ అన్సారీ, ఓ మైనర్ బాలునితో కలిసి మద్యం సేవించి తెల్లవారుజామున 3 గంటల సమయంలో రామచంద్రానగర్‌లోని తారీఖ్ అలీ ఇంటి వద్దకు చేరుకున్నారు. అక్కడ తారీఖ్ అలీ తన ఇంటి ముందు కూర్చొని మొబైల్ చూస్తుండగా..మూకుమ్మడిగా కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసి పారిపోయారు. దీనిపై మృతుని సోదరుడు సాధిక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ నెల 21న సాయంత్రం 4 గంటల సమయంలో సంతోష్‌నగర్ దర్గా శ్మశాన వాటిక వద్ద నిందితులు ఉన్నారని తెలుసుకుని పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



మియాపూర్: ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడి ఓ చిన్నారి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన శ్రీరామ్, ప్రమీల దంపతులు నగరానికి వచ్చి మియాపూర్‌లోని గోపాల్‌రావు నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ప్రియ(5) ఉన్నారు. ప్రమీల, శ్రీరామ్‌లు గొడవల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. ప్రమీల తల్లి చోక్లీ దగ్గర ఉంటోంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 11:30 గంటల సమయంలో ఇంటి ముందు బట్టలు ఉతుకుతుంది. పక్కనే కూతురు ప్రియ ఆడుకుంటుంది. ప్రమీల సబ్బు తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లి వచ్చేసరికి కూతురు ఇంటి ముందు ఉన్న సంపులో పడిపోయింది. అది గమనించకుండా కూతురు కనబడడం లేదని చుట్టపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కొద్ది సేపటి తర్వాత నీటి సంపులో చూసే సరికి ప్రియ సంపులో కనబడింది. వెంటనే దగరలో ఉన్న ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక సహాయం అందజేత

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక పునరావాస పథకం కింద ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఛాంబర్లో ట్రాన్స్ జెండర్లు ప్రేమ , చిట్టి మహతి, వాద్యత్ అఖిలేష్ రాజపూత్‌లకు ఆర్థిక పునరావాస పథకం క్రింద ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ నగదు స్వీకరించిన ట్రాన్స్ జెండర్లు తమ జీవనోపాధి కోసం ఉపయోగించుకొని సమాజంలో ఆదర్శంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.

డబ్బు విషయంలో వివాదం.. యువకుడి కిడ్నాప్

- ఆపై చితకబాదిన నిందితులు..
- బాధితుడి తండ్రి ఫిర్యాదుతో పోలీస్‌స్టేషన్‌లో వదిలివెళ్లిన వైనం..

సనత్‌నగర్: తనకు ఇవాల్సిన డబ్బులు ఇవ్వనందుకు ముగ్గురు స్నేహితులతో కలిసి ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి చితకబాదిన ఉదంతం బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అయితే తన కుమారుడిని కిడ్నాప్ చేశారంటూ తండ్రి ఫిర్యాదు ఇవ్వడంతో కిడ్నాపర్..బాధితుడిని బేగంపేట పోలీస్‌స్టేషన్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. బాధితుడు బతుకుజీవుడా అంటూ ముందుగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకుని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనకు సంబధించిన వివరాలు ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌లో ఉండే మహ్మద్ హైదర్ (25) కారు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. రితిక్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన కారును అతనికి తెలియకుండా ఇటీవల రాజస్తాన్‌లో అమ్మేశాడు. ఈ విషయం తెలుసుకున్న రితిక్‌రెడ్డి రాజస్తాన్ వెళ్లి రూ.8 లక్షలు చెల్లించి తిరిగి తన కారును తెచ్చుకున్నాడు. అయితే ఆ డబ్బుల విషయమై రితిక్‌రెడ్డి, మహ్మద్ హైదర్‌ల మధ్య చర్చలు జరగ్గా చివరకు రూ.4 లక్షలు చెల్లిస్తానని మహ్మద్ హైదర్ ఒప్పుకుని అగ్రిమెంట్ కూడా రాశాడు. ఆ తర్వాత ఆ డబ్బు కోసం చాలాసార్లు రితిక్‌రెడ్డి..హైదర్ ఇంటికి వెళ్లి అడగ్గా అతని నుంచి సమాధానం రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 20న తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో రితిక్‌రెడ్డి, అతని స్నేహితులు మణిదీప్‌సాగర్, రేవంత్, రోహిత్‌లతో కలిసి కారులో హైదర్‌ను ఎక్కించుకుని డబ్బులు ఇచ్చేవరకు వదిలిపెట్టబోమని ఘట్‌కేసర్‌కు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి బొల్లారం వీబీ సిటీలోని రితిక్‌రెడ్డి గదికి తీసుకువెళ్లి బంధించి వెళ్లిపోయారు. ఇదే క్రమంలో తనను కిడ్నాప్ చేశారంటూ హైదర్ తన తండ్రి ఖాదర్‌కు ఫోన్‌కు మెసేజ్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న రితిక్‌రెడ్డి స్నేహితుడు వేముల సన్నీ..హైదర్ తన తండ్రికి మెసేజ్ చేసిన విషయాన్ని తెలుసుకుని అతనిపై దాడి చేశాడు. ఇదిలా ఉండగా ఖాదర్ తన కుమారుడిని కిడ్నాప్ చేశారని పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న రితిక్‌రెడ్డి రాత్రి 8 గంటల సమయంలో హైదర్‌ను బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో వదిలి వెళ్లిపోయారు. అయితే తీవ్రంగా కొట్టడంతో గాయపడిన హైదర్ సమీప ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనను కిడ్నాప్ చేసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే నిందితుల్లో ఒకరు ఎమ్మెల్యే కుమారుడిగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించడం లేదు.

బహిరంగ ప్రకటన

శ్రీమతి ఆర్. శాంత కుమారి, శ్రీ రఘుమూర్తి శశాంక్ మరియు శ్రీ రఘుమూర్తి మేఘాంశ్ ("యజమానులు") లు బాచుపల్లి గ్రామం మరియు మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వద్ద గల సర్వే నం.లు 407/A, 407/B, 419, 420 & 421 లోని 4681 చ.గలు లేదా 3913.91 చ.మీ.ల (25882.84 చ.గల లోనిది) విస్తీర్ణం గల ఖాళీ భూమి ("సదరు భూమి") లోని ప్రతిపాదిత నిర్మాణానికి సంబంధించి సంపూర్ణ యజమానులని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. సదరు యజమానులు నిర్దేశిత భూమిని నివాస అపార్ట్‌మెంట్స్‌గా అభివృద్ధి చేసేందుకు రిజిస్టర్డ్ DGPA No.2737/2023 తేది: 27-01-2023 ప్రకారం తమ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ GPA హోల్డర్‌గా మా క్లయింట్ M/s. శ్రీనిధి ప్రాజెక్ట్స్, ప్రాతినిధ్యం వహించువారు దాని భాగస్వాములు శ్రీ చిలకల రమణారెడ్డి మరియు శ్రీ అల్లు రమణా రెడ్డి లను నియమించారు.

సదరు యజమానుల పూర్వాధికారులలో కొందరు అనగా 1. కొలను లక్ష్మీ నరసింహా రెడ్డి, 2. బి బాలయ్య, 3. నేరుడి నర్సయ్య తమ పేర్ల మీద రెవెన్యూ రికార్డ్/ టైటిల్ డీడ్స్ లేకున్నా బాచుపల్లి గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నం.లు 420 మరియు 421లోని ఎ.2.27 గుంటల విస్తీర్ణం గల భూమికి సంబంధించి పసుమల బాలయ్య అను వారి పేరున రిజిస్టర్డ్ GPA No.92 of 1991 తేది: 06-03-1991ని అమలు చేశారు. సదరు పసుమల బాలయ్య మరొక GPA హోల్డర్ పి. మంగమ్మతో పాటు శ్రీ రఘుమూర్తి శ్రీహరి మరియు శ్రీమతి రఘుమూర్తి శాంత కుమారి పేరున రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.264/1999 ప్రకారం భూమి యజమానుల పేరున ఎ.2-20 గుంటల విస్తీర్ణం గల భూమిని విక్రయించారు. 2013 సంవత్సరంలో కొనుగోలుదార్లలో ఒకరైన శ్రీ రఘుమూర్తి శ్రీహరి పైన తెలిపిన భూమి యజమానులను అతని న్యాయవారసులుగా విడిచి మరణించారు. నా క్లయింట్ ఇప్పుడు సదరు భూమిని "1918" గా పిలువబడే ప్రాజెక్ట్ క్రింద నివాస అపార్ట్‌మెంట్లుగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం SMFG ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ నుండి డెవలపర్ రుణ సదుపాయాన్ని వినియోగించుకొని, పోటీగా ప్రాజెక్ట్‌లోని విక్రయించని యూనిట్లను ఆఫర్ చేసారు.

యజమాని తప్ప ఎవరేని వ్యక్తి/లు, కొనుగోలు, వారసత్వం, తనఖా, స్వాధీనత, గిఫ్ట్, అమ్మకం, లీజ్, టెనెన్సీ, లీన్, ఛార్జీలు, ట్రస్ట్ లేదా అనుభోగం లేదా ఇతరత్రా రూపంలో సదరు భూమిపై ఏదేని క్లెయిమ్, హక్కు, టైటిల్, ప్రయోజనం మొవి కలిగి ఉంటే మరియు / లేదా సదరు భూమికి సంబంధించి ఏదేని డాక్యుమెంట్(లు) కలిగి ఉన్నట్లు క్లెయిమ్ చేసే వారు ఈ నోటీస్ ప్రచురణ తేదీ నుండి ఏడు (7) రోజులలోగా పూర్తి డాక్యుమెంటరీ సాక్ష్యం/ దానికి రుజువుతో పాటు క్రింది సంతకందారుకు తమ క్లెయిమ్/లను దాఖలు చేయవలసిందిగా కోరడమైనది, లేనట్లయితే యజమాని మినహా ఏ వ్యక్తి(లు) సదరు భూమికి సంబంధించి ఏదేని హక్కు/టైటిల్/క్లెయిమ్ మరియు / లేదా ప్రయోజనం కలిగి లేరని భావించబడును మరియు అట్టి క్లెయిమ్, అభ్యంతరం కొట్టివేయబడినట్లు భావించబడును మరియు నా క్లయింట్ సదరు ప్రాజెక్ట్‌లోని విక్రయించని యూనిట్స్‌ని ఇవ్వడం ద్వారా రుణ సదుపాయాన్ని వినియోగించుకోవడం ముందుకు కొనసాగుతారు.

సం/- T. N. శ్రీనివాసులు (అడ్వకేట్),
M/s. శ్రీ లీగల్ అసోసియేట్స్,
303, రవీరా అపార్ట్‌మెంట్స్, ద్వారకాపురి కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500082.
సెల్: 9848148999, sreelegalassociates@gmail.com

బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్


గౌతంరావు నుంచి నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

ఫిలింనగర్: బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా ఫిలింనగర్‌కు చెందిన ముద్దంగుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని హైదరాబాద్ బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ ఖైరతాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, సీనియర్ బీజేపీ నేతలు రాఘవరెడ్డి, శ్రవణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... పార్టీకి విధేయుడిగా తాను చేస్తున్న సేవలను గుర్తించి డివిజన్ అధ్యక్ష పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో బీజేపీ మరింత బలోపేతం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు.

కరోనా జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రఫుల్లారెడ్డి

వెంగళరావునగర్: కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు పాటించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ సనత్‌నగర్ టీం సెక్రటరీ లయన్ డాక్టర్ ప్రఫుల్లారెడ్డి సూచించారు. యూసుఫ్‌గూడలోని అమరావతి హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు కోవిడ్ నిబంధనలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రఫుల్లారెడ్డి మాట్లాడుతూ... కనీస జాగ్రత్తలతో కరోనాబారి నుంచి మనల్ని మనం కాపాడు కోవచ్చన్నారు. మాస్కులు ధరించడం, శానిటైజర్ వాడటం ద్వారా కరోనా దరిచేరదని తెలిపారు. లయన్స్ క్లబ్ కేబినెట్ మెంబర్ లయన్ సుధాకర్ మాట్లాడుతూ... కరోనా బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మాస్కులను పంపిణీ చేశారు. పాఠశాల చైర్మన్ ప్రమోద్‌రెడ్డి, హెచ్‌ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం: ఆపై బెదిరింపులు

- మధురానగర్‌లో పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు

వెంగళరావునగర్: చిట్టీల పేరుతో మోసం చేయడం కాకుండా, డబ్బులు అడిగిన వారిని చంపుతామని చిట్టీ నిర్వాహకులు బెదిరించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫాతిమా బేగం టైలరింగ్ చేస్తుంది. పరిచయం ఉన్న కవిత అనే మహిళ వద్ద చిట్టీలు వేసేది. ఈ క్రమంలోనే తాను జమ జేసిన డబ్బులు ఇవ్వక పోవడంతో ఫాతిమాబేగం కవితను అడుగగా చిల్లిగవ్వ కూడా ఇవ్వక పోవడమే కాకుండా ఫాతిమాబేగంపై ఎస్సీ ఎస్టీ కేసు పెడతామని బెదిరించిందని ఫాతిమా తెలిపింది. చిట్టీల పేరుతో దాదాపు రూ. 40 లక్షలు వరకు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. ఫాతిమాబేగం పాటు మరికొంత మంది మహిళలు కవిత చిట్టీల పేరుతో మోసపోయారని పోలీసులు తెలిపారు.

బయోమెట్రిక్ హాజరు వేళలు మార్చాలని వినతి

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం వేళల్లో ఉద్యోగానికి హాజరయ్యేటప్పుడు బయోమెట్రిక్ అటెండెన్స్ వేళల్లో మార్పులు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కమిషనర్‌ను కలిసి కార్మిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ తిప్పర్తియాదయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.కృష్ణ వినతిపత్రం సమర్పించారు. తీవ్రమైన చలి ఉన్నందున పారిశుద్ధ్య కార్మికులు చాలా ఇబ్బందులకు, అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమయం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఉందని... ఈ సమయాన్ని ఉదయం 6 నుంచి 7 గంటల వరకు బయోమెట్రిక్ మిషన్‌లో మార్పు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం కూడా చలికాలంలో 6 నుంచి 7 గంటల వరకు హాజరు తీసుకున్నట్లు గుర్తుచేశారు. ఈ సంవత్సరం కూడా అదే విధానాన్ని కొనసాగించాలని కోరారు.

జడ్జిల క్లబ్ హౌస్ నిర్మాణ స్థలంలోకి మురుగు ప్రవాహం


చీఫ్ జస్టిస్ నివాసం పక్కన జడ్జిల క్లబ్ నిర్మాణ స్థలంలోకి వెళ్తున్న మురుగు నీరు


బంజారాహిల్స్ రోడ్ నెం. 7 చీఫ్ జస్టిస్ నివాసం పక్కన మురుగు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ నివాసం పక్కన మూడు నెలలుగా మురుగు ప్రవహిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జడ్జి నివాసం ముందే ఉన్న ఓ మ్యాన్‌హోల్ నుంచి పెద్ద ఎత్తున మురుగు ప్రవహిస్తూ జడ్జి నివాసం పక్కన నూతనంగా జడ్జిల కోసం నిర్మిస్తున్న క్లబ్ హౌజ్ నిర్మాణ స్థలంలోకి ఈ మురుగు నీరు ప్రవహిస్తున్నది. హైకోర్టు జడ్జి నివాసానికి కూతవేటు దూరంలోనే జలమండలి కార్యాలయం ఉన్నా సంబంధిత అధికారులు, సిబ్బందికి ఈ సమస్య కనిపించకపోవడం గమనార్హం.

ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగావకాశాలు కల్పించాలి

కాచిగూడ: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినంత మాత్రాన మహిళల అభివృద్ధి, రాష్ట్రాలు మారిపోవని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు మట్టి జయంతి గౌడ్ అన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబాలని ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉందని అన్నారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

- ఆలయాల్లో భారీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం
- జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయం వద్ద వన్‌వే

ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. శనివారం తెల్లవారుజామున భక్తులను ఉత్తర ద్వారం ద్వారా దర్శనానికి అనుమతులు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా ఆలయాల్లో నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.


జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు


శ్రీనగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద అలంకరణ చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ సంఖ్యలో భక్తులు రానుండటంతో ఆ మేరకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశాయి.

- జూబ్లీహిల్స్ రోడ్ నెం. 17లోని సీతారామ స్వామి దేవాలయంలో ఉదయం 5.30 గంటలకు భక్తులను వైకుంఠ ద్వారదర్శనానికి అనుమతిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు కె.వి.వి.రాఘవాచార్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు లక్ష తులసీ పూజ, 11 గంటలకు సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు.

వైకుంఠ ద్వార దర్శనం ఎక్కడెక్కడంటే..?

- బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం తెల్లవారుజామున ఉత్తర ద్వారం గుండా శ్రీవారి దర్శనాలకు అనుమతిస్తారు.
- జూబ్లీహిల్స్ రోడ్ నెం. 92లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం.
- ఫిలింనగర్‌లోని దైవసన్నిధానంలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం.
- బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం.
- బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీ జగన్నాథ స్వామి ఆలయం.
- బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్‌లో కొలువుదీరిన హరేకృష్ణ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం.
- పంజగుట్ట దుర్గా నగర్‌కాలనీ శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం.
- హిమాయత్‌నగర్ లిబర్టీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం.
- జూబ్లీహిల్స్ రోడ్ నెం. 17లోని శ్రీ సీతారామస్వామి దేవస్థానం.

జూబ్లీహిల్స్ టీటీడీ వద్ద వన్‌వే...

- జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఆలయం వద్ద వన్‌వే ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.
- ఒమేగా ఆస్పత్రి లోటస్ పాండ్ నుంచి వచ్చే వారికి సంత్ నిరంకారీ స్థలంలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
- అపోలో ఆస్పత్రి వైపు నుంచి వచ్చే వారు అపోలో ఆస్పత్రి లోపల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.
- ఆలయం ముందు వాహనాల రాకపోకలు సాగవని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వారు వివరించారు.

టీటీడీ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు


ప్రత్యేక అలంకరణతో హిమాయత్‌నగర్ టీటీడీ దేవస్థానం

హిమాయత్‌నగర్: వైకుంఠ ఏకాదశి పర్వదినానికి హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయాన్ని రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం తెల్లవారుజాము నుంచి కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక క్యూలైన్లు ఇతర ఏర్పాట్లు చేశారు. 23న వైకుంఠ ఏకాదశి, 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేకువజామున ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం ఏకాంతంగా నిర్వహిస్తారు. సర్వదర్శనం ఉదయం 3.30 గంటలకు ప్రారంభం అవుతుందని, వీఐపీలు, ప్రొటోకాల్ ప్రముఖులు 3 గంటలకు రిపోర్టు చేయాలని ఆలయ అధికారులు సూచించారు. సాయంత్రం 6 నుంచి 6.45 గంటల వరకు నైవేద్య విరామ సమయం ఉంటుందన్నారు. తిరిగి 6.45 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభం అవుతుందని తెలిపారు. భక్తుల రద్దీని బట్టి వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పిస్తామన్నారు. భక్తులంతా ఆలయ సిబ్బందికి సహకరించి, ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకొని ఆశీర్వాదం తీసుకోవాలని వారు కోరారు.

మహనీయుల మార్గం స్ఫూర్తిదాయకం

మాల ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ చెన్నయ్

ఖైరతాబాద్: దళిత హక్కు, ఐక్యత కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మార్గంలో తుది శ్వాస వరకు పోరాడిన మహనీయులు దివంగత గడ్డం వెంకటస్వామి (కాక), పీవీ రావులని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య కొనియాడారు. శుక్రవారం మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో పి.వి.రావు 18వ వర్ధంతి, వెంకటస్వామి తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ... పి.వి.రావు తన కుటుంబ శ్రేయస్సు కన్నా కులమే ముఖ్యమని వర్గీకరణకు వ్యతిరేకంగా తన ఉద్యోగాన్ని వదులుకొని దళితులను ఏకం చేసిన ధీరుడన్నారు. వెంకటస్వామి(కాక)తన జీవితం మొత్తం బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతికి పాటుపడటమే గాక నిలువ నీడలేని లక్షలాది మంది పేదలకు నీడనిచ్చి గుడిసెల వెంకటస్వామిగా కాక పేరు గాంచారన్నారు. బాబాసాహెబ్ వారసుడిగా, దేశ కార్మిక శాఖ మంత్రిగా ఉండి కార్మికుల ప్రయోజనాల కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత తుది శ్వాస విడిచారని గుర్తుచేశారు. వీరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బురుగుల వెంకటేశ్వర్లు, మన్నె శ్రీధర్ రావు, పుణ్యభాను ప్రకాష్, కాడారం వినయ్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల వెంకటేషు, తాలూకా రాజేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగి అనందరావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోకుల కళ్యాణ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 55, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 60, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 21, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 50, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి రూ. 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సంజయ్‌నగర్‌లో ఉచిత ఆధార్ సేవలు

రహమత్‌నగర్: సంజయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం యూసుఫ్‌గూడ పోస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ కార్డుల కోసం దరఖాస్తులు, సవరణల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పోస్టుమాస్టర్ మాధురి మాట్లాడుతూ... కేంద్ర పోస్టల్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పోస్ట్ బీమా సౌకర్యాలతో పాటు ఆధార్ సేవలు అందిస్తున్నామన్నారు.

వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం


వెంకటస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెన్న సదానంద్

లిబర్టీ: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామికి మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద్ ఘనంగా అంజలి ఘటించారు. వర్ధంతిని పురస్కరించుకొని లిబర్టీ సమీపాన ఉన్న వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. లోక్‌సభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు. దళిత వర్గాల అభ్యున్నతికి, పేద వర్గా సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారని ఆయన అన్నారు. వెంకటస్వామిని మార్గదర్శకంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం


సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు

శ్రీనగర్‌కాలనీ: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా పలు సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించారు. శుక్రవారం మధురానగర్ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో బంజారాహిల్స్ సర్కిల్, డివిజన్, అమీర్‌పేట సబ్ డివిజన్‌లలో ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారులకు వివరించారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు, ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్స్, సాంకేతిక లోపాలను వివరించారు. సమస్యలను తెలుసుకున్న విద్యుత్ ఉన్నతాధికారులు పలు సమస్యలను అప్పటికప్పుడు, మరి కొన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వినియోగదారులు నేరుగా దగ్గరలోని సబ్‌స్టేషన్‌లో ఆయా సమస్యలను తెలియజేయాలని కోరారు. ఎస్ఈ చంద్రశేఖర్, డీఈ నరేందర్‌రెడ్డి, అమీర్‌పేట ఏడీఈ ప్రేమ్‌కుమార్, బంజారాహిల్స్ ఏడీఈ అనురాధ, ఏఈ తిరుపతిరావు పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్




క్రిస్మస్ వేడుకల్లో సంస్కార్ స్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్‌కాలనీలోని బర్డ్స్ అండ్ బ్లూమ్స్‌లో శుక్రవారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు క్రిస్మస్ దుస్తులను ధరించి పండుగ విశిష్టతను తెలియజేశారు. పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్, ప్రిన్సిపాల్ శాంతికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో...

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ వేడుకల దుస్తులు ధరించి పలు ప్రదర్శనలతో క్రిస్మస్ విశిష్టతను తెలియజేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ బహుమతులు అందించారు. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఖైరతాబాద్: స్ఫూర్తి కుటుంబం తెలంగాణ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఖైరతాబాద్ డివిజన్‌లోని జీహెచ్‌ఎంసీ శాఖ గ్రౌండ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ సభ్యులు తెలిపారు. జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, పీడియాట్రిక్, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్ డాక్టర్లతో పాటు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్: 89776 13435లో సంప్రదించవచ్చని తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు

కాచిగూడ: సీఎం రేవంత్ రెడ్డిని శుక్రవారం మున్నూరుకాపు సంఘం నేత, గిన్నీస్ బుక్ రికార్డ్ హోల్డర్, మెజీషియన్ సామల వేణు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపులకు ప్రభుత్వంలో, పార్టీలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన సీఎంను కోరారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


మ్యాథ్స్ డేలో పాల్గొన్న సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కాలేజీలో శుక్రవారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జె. లక్ష్మణ్ నాయక్, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ధర్మయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏటా రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని జరుపుతుంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా రీసెంట్ అప్లికేషన్స్ ఇన్ మ్యాథమెటిక్స్‌అనే ఒక రోజు జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, పృథ్వీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత తదితరులు పాల్గొన్నారు.

గతి ప్రభుత్వ పాఠశాలలో...

గణితం అనగానే ఎక్కువ మంది విద్యార్థులు భయపడుతుంటారని నిత్య జీవితంలో ప్రధానపాత్ర పోషించేది లెక్కలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు, సిద్ధాంతాలపై అవగాహన పెంచుకుంటే విద్యార్థులు రాణించగలరని బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు. శుక్రవారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు గణితాన్ని సులువుగా ఎలా నేర్చుకోవచ్చో తెలియజేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.యాదగిరి, జనార్దన్, విజయలక్ష్మి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా గణితం నేపథ్యంగా నమూనా ప్రదర్శన ఏర్పాటు చేశారు.


సాయిరాం స్కూల్‌లో...


గతి ప్రభుత్వ పాఠశాలలో...

యూసుఫ్‌గూడ సాయిరాం స్కూల్‌లో...

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు మ్యాథమ్యాటిక్స్‌పై చేసిన ప్రయోగ ప్రదర్శనలు, క్విజ్, మారథన్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. శుక్రవారం యూసుఫ్‌గూడ సాయిరాం స్కూల్‌లో మాథ్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తమ ప్రతిభతో పాటు సృజనాత్మకతను జోడించి చేసిన ప్రదర్శనలు ఆలోచింజేశాయి. విద్యార్థుల ప్రతిభను స్కూల్ చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వర రావు అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రెసిడెంట్ నల్లపాటి రాజేశ్వరి, హెచ్‌ఎం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆంధ్రజ్యోతి ప్రతులు దహనం చేసిన బాలయ్య అభిమానులు

వేమూరి రాధాకృష్ణ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిక



కావలి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ కూడలిలో శుక్రవారం నందమూరి బాలకృష్ణ అభిమానులు ఆంధ్రజ్యోతి పత్రిక ప్రతులను దహనం చేశారు. ఉత్తరాంధ్రలో నారా లోకేశ్ యువగళం ముగింపు సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బాలకృష్ణ పాల్గొన్నప్పటికీ ఆంధ్రజ్యోతి పత్రికలో నందమూరి బాలకృష్ణ పేరు, ఫొటో కావాలనే ప్రచురించలేదని వారు మండిపడ్డారు. బాలకృష్ణపై ఆంధ్రజ్యోతికి ఎందుకు ఈ వివక్ష అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి యజమాన్యం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నందమూరి అభిమానులకు వేమూరి రాధాకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నందమూరి అభిమాన సంఘం నాయకులు, స్థానిక టీడీపీ నాయకులు చవల రామకృష్ణ, నక్కా కృష్ణ, అక్కిలిగుంట సూర్యప్రకాష్, మద్దూరి రవియాదవ్, తిరుపాల్, షరీఫ్, హనుమయ్య చౌదరి, కాలేషా, ఉప్పాల శ్రీనివాసులు గౌడ్, మహేష్, గునుపూడి కృష్ణ, సీహెచ్ మాల్యాద్రి, కే సునీల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మరో కొత్త పార్టీ


‘జై భారత్ నేషనల్ పార్టీ’ని ఏర్పాటు చేసిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

సాక్షి, అమరావతి: సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనాయరాణ ‘జై భారత్ నేషనల్’పేరుతో రాష్ట్రంలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. తాను పార్టీ ఏర్పాటు చేసినట్లు ఆయన శుక్రవారం విజయవాడలో ప్రకటించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుపరిపాలన కోసమే జై భారత్ నేషనల్ పార్టీ ఏర్పాటు చేశానని చెప్పారు. ఇది ప్రజల్లో నుంచి పుట్టిన పార్టీ అని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో అన్ని పార్టీలు విఫలమయ్యాయని, తాను సాధించి చూపిస్తానని తెలిపారు. ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీ ముద్దు... అని కొందరు అన్నారని విమర్శించారు.

అభిమానులపై ‘పంజా’!

‘బ్రో’...ఇదేం పద్ధతి అంటూ వాపోతున్న జనసేన కార్యకర్తలు

- సీఎం పదవిపై రకరకాలుగా మాట్లాడుతూ గందరగోళానికే పవన్ మొగ్గు
- కానీ.. గెలిస్తే చంద్రబాబే సీఎం అని... పవన్ కూడా అంగీకరించారని చెప్పిన లోకేశ్
- ఇందులో సందేహాలకు తావు లేదని, 150 సీట్లకు అభ్యర్థులూ రెడీ అని చెప్పిన చినబాబు
- ఈ విషయంపై ప్రశ్నలకు తప్పించుకునే రీతిలో నాదెండ్ల సమాధానాలు
- మూడో సారి కూడా మోసమేనా.. అంటూ మండిపడుతున్న జనసేన నేతలు
- పవన్! సీఎం పదవిపై ఆశలు వదిలేశావా?.. అంటూ జోగయ్య లేఖ



సాక్షి, అమరావతి : సాక్షి, అమరావతి: పదేళ్ల కిందట పెట్టిన పార్టీ. కానీ... ఇప్పటికీ్కాడా వేదిక ఎక్కి మాట్లాడే నాయకుడు ఒక్కడే!!. మరీ ముఖ్యమైన సందర్భాల్లో అయితే అటు పక్క సోదరుడు... ఇటుపక్క తన వ్యవహారాలన్నీ చక్కబెట్టే ఓ కార్యదర్శి స్థాయి నాయకుడు. ఏ జిల్లాకెళ్లినా అంతా అభిమానులే తప్ప వాళ్లలో ఒక్కరూ నాయకులుండరు. అసలు జనసేన రాజకీయ పార్టీయేనా? అలాగైతే పదేళ్లుగా ఎక్కడా ఒక్క బలమైన నాయకుడూ ఎందుకు తయారు కాలేదంటారు? ఎందుకంటే ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఉద్దేశమే అది. తనకు అధికారం అక్కర్లేదని పదేపదే ఆవేశాన్ని అభినయిస్తూ చెప్పే పవన్ కల్యాణ్ మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందనేది రాజకీయ విశ్లేషకుల మాట. ఎందుకంటే 2014 ఎన్నికల్లో ఆయన చంద్రబాబుకు బేషరతుగా మద్దతు ప్రకటించారు. చంద్రబాబు గెలిచారు. కానీ 2019 వచ్చేసరికి బాబు ప్రభుత్వంపై వ్యతిరేకత బాగా పెరిగిపోవటంతో... ఆ వ్యతిరేక ఓట్లన్నీ వైఎస్సార్ సీపీకి గంపగుత్తగా పడకుండా చీల్చాలని చంద్రబాబు ఆదేశించటంతో... కొత్త పాత్ర పోషిస్తూ బాబు స్నేహితుడి నుంచి బాబు ప్రతినాయకుడి పాత్రలోకి మారిపోయారు. లేని ఆవేశాన్ని తెచ్చుకుని, చంద్రబాబును చెడామడా తిట్టేస్తూ... ఆగ్రహంతో ఊగిపోయారు. రక్తి కట్టించాననుకున్నారు. కానీ సినిమా ఫ్లాపయింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అఖండమైన మెజారిటీతో గెలిచారు. మరి ఇప్పుడూ అదే చంద్రబాబు కదా? అప్పటికీ ఇప్పటికీ ఆయనలో ఏం మారింది? ఏం మారిందంటే చంద్రబాబు పాత్ర మారింది. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చారు. మళ్లీ ఎన్నికలొస్తున్నాయి. ఒంటరిగా అయితే జగన్‌ను ఎదుర్కోలేనన్నది చంద్రబాబు ఉద్దేశం. పవన్ కల్యాణ్ తనతో ఉంటే ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓట్లన్నీ గంపగుత్తగా వచ్చేస్తాయనే ఆశ. కాబట్టి పొత్తు పెట్టుకోవటం ద్వారా వాటన్నిటినీ తనకు బదిలీ చేయాలని పవన్‌కు ఆదేశించారు. మళ్లీ పవన్ వేషం మారింది. కాకపోతే రెండుసార్లు ఈయన్ను నమ్మి మోసపోయిన ఆ సామాజికవర్గం మళ్లీ నమ్ముతుందా? అది కూడా తమను పదేపదే మోసం చేసిన చంద్రబాబుకు అనుకూలంగా ఓట్లేయమంటే వేసేస్తారా? అందుకే పవన్ రకరకాల అభినయాలకు దిగుతున్నారు. ‘నేను ఎవరినీ ముఖ్యమంత్రిని చేయడానికి లేను’. ‘సీఎం పదవి చేపట్టేందుకు సిద్ధం’‘సీఎం పదవి ఇస్తే ఎవరైనా వద్దంటారా?’‘జనసేన గెలిచే సీట్లను బట్టి ముఖ్యమంత్రి ఎవరన్నది ఎన్నికల తరవాత తేలుతుంది’. ‘మనకు తగిన బలం లేనప్పుడు ఒక మెట్టు దిగటంలో తప్పులేదు’అనే పంచ్ డైలాగ్‌లు విసిరివిసిరి.. ఇప్పుడు దార్లోకి వచ్చారు. తెలుగుదేశంతో పొత్తును వ్యతిరేకించేవారు తనకు అక్కర్లేదని, పొత్తుకు కట్టుబడ్డవారే తనతో ఉండాలని, తెలుగుదేశం కోసం జనసేన కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పనిచేయాల్సి ఉంటుందని కుండబద్దలుగొట్టేశారు. ప్రీ రిలీజ్ ఫంక్షన్లకే కోట్లకు కోట్లు ఖర్చుచేసిన సినిమా రిలీజయ్యాక డిజాస్టరని తెలిస్తే ఎలా ఉంటుందో అంతకన్నా దారుణంగా తయారయింది జనసేన అభిమానుల పరిస్థితి.

పొత్తులో సీఎం అభ్యర్థిపై లోకేశ్ ఏమన్నారంటే..

విలేకరి ప్రశ్న: ఓట్లను పంచుకుంటున్నారు. సీట్లను పంచుకుంటున్నారు. సీఎం పదవిని కూడా జనసేనతో పంచుకుంటారా?

లోకేశ్: చాలా స్పష్టంగా చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి. దేర్ ఈజ్ నో సెంకడ్ థాట్ (రెండో మాటే లేదు). పవన్ కళ్యాణ్ కూడా అనేక సార్లు చెప్పారు. సమర్థవంతమైన నాయకత్వం కావాలి. అనుభవం ఉన్న నాయకుడు ఇప్పుడున్న పరిస్థితుల్లో అవసరమని చాలా స్పష్టంగా చెప్పారు. దేర్ ఈజ్ నో యాంబిగ్యుటీ (ఈ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు)

లోకేశ్ వ్యాఖ్యలపై విలేకరుల సమావేశంలో నాదెండ్ల మనోహర్ స్పందన..

విలేకరి ప్రశ్న: టీడీపీ – జనసేన పొత్తులో చంద్రబాబే ముఖ్యమంత్రి అభ్యర్థి అని లోకేశ్ ఓ ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు. పవన్ ఇన్నాళ్లుగా ఎన్నికల తర్వాతే సీఎం అభ్యర్థి ఎవరన్నది చర్చించి నిర్ణయం ఉంటుందంటున్నారు కదా?

నాదెండ్ల: నేను పర్టిక్యులర్‌గా వినలేదు. మీరు అనేది నిజమే అయితే, పొత్తులో భాగంగా పరస్పరం గౌరవించుకోవాలి. కొన్ని ఆలోచనలు సరైన సమయానికి ఇరు పార్టీల నాయకులు కూర్చొని, ఇరు పార్టీల ఎమ్మెల్యేలు కూర్చొని ఆ సందర్భంగా వారు కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. నా దృష్టిలో అయితే, (దీనిపై నిర్ణయం జరిగినట్టు) లేదు.

బాంబు పేల్చిన ‘తమ్ముడు’లోకేశ్

సీఎం ఎవరన్నదీ అసెంబ్లీ ఎన్నికల తరవాత టీడీపీ– జనసేన చర్చించి నిర్ణయాలు తీసుకుంటాయని పవన్ కల్యాణ్ చెబుతుంటే... అసలే గందరగోళంలో ఉన్న జనసేన అభిమానులపై చంద్రబాబు తనయుడు లోకేశ్ ఓ పిడుగు వేశాడు. ఇన్నాళ్లు పవన్ చెబుతున్న మాట పచ్చి అబద్ధమని తేల్చేశారు. ఓ టీవీ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ... ‘‘పొత్తులో చంద్రబాబే సీఎం అభ్యర్థి. దీన్లో రెండో ఆలోచనే లేదు’’అని తెగేసి చెప్పారు. అంతేకాదు. 150 సీట్లలో తమ అభ్యర్థులు ఖరారైపోయారని మరో బాంబు పేల్చారు. ఈ ఇంటర్వ్యూ చూసి జనసేన అభిమానులు హతాశులయ్యారు. ఇన్నాళ్లూ తమ ‘బ్రో’చెప్పినవన్నీ అబద్ధాలేనా అంటూ చర్చించుకుంటున్నారు. లోకేశ్ వ్యాఖ్యలపై జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా అనుమానాస్పదంగానే మాట్లాడారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో 15 మందితో కలిసి నాదెండ్ల విలేకరులతో మాట్లాడారు. లోకేశ్ వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. ‘నా దృష్టిలో లేదు, తెలియదు’ అని తప్పించుకున్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికల తర్వాతే ఎమ్మెల్యేలు సీఎం అభ్యర్థిని నిర్ణయిస్తారని చెప్పారు. నిజానికి పొత్తుపై టీడీపీతో ఏ చర్చ జరిగినా, జనసేన తరుపున పవన్ పక్కన నాదెండ్ల మనోహర్ మాత్రమే ఉంటారు. సీఎం అభ్యర్థిత్వంపై రెండు పార్టీల మధ్య నిర్ణయం జరగకుండా ఉంటే లోకేశ్ వ్యాఖ్యలను ఆయన ఖండించే వారు. కానీ, సీఎం అభ్యర్థి చంద్రబాబు అని పవన్ కూడా చాలాసార్లు చెప్పారని లోకేశ్ స్పష్టంగా చెప్పారు. దీన్ని మనోహర్ ఖండించలేదు. మనోహర్ ఇలా మాట్లాడటంతో... పవన్ ఉద్దేశపూర్వకంగానే సీఎం అభ్యర్థిత్వంపై అబద్ధాలు చెబుతూ మోసం చేస్తున్నారని జనసేన నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. 2014లో జనసేన పార్టీ ఏర్పాటు నుంచీ పవన్ రాజకీయ కార్యక్రమాలన్నీ చంద్రబాబు ప్రయోజనాల చుట్టూనే తిరుగుతున్నాయనే వాదనకు మరింత బలాన్నిచ్చేలా పవన్ తీరు ఉన్నట్టు వారు పేర్కొంటున్నారు. ఈ సారి కూడా చంద్రబాబు కోసమే తమ నాయకుడు పనిచేస్తున్నారని, చంద్రబాబు సీఎం అభ్యర్థిగా అంతర్గతంగా అంగీకరించి ఉంటారని, అయినా నిండా 20 సీట్లు కూడా ఇవ్వలేమని లోకేశ్ చెబుతుండగా ఇక సీఎం వంటి పదాలను పలకడం వృథా అని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్



తిరుమల ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా

తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

సీమ సిగలో ‘సెంచురీ’

వాణిజ్య ఉత్పత్తికి సిద్ధమైన బద్వేల్ సెంచురీ ప్యానల్స్

- నేడు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- రూ.1,000 కోట్లతో యూనిట్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాయలసీమ యువత, రైతులకు ప్రయోజనం చేకూరే మరో భారీ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. ప్లై ఉడ్ ప్యానల్స్ తయారీలో అగ్రగామి సంస్థగా పేరున్న సెంచురీ ప్యానల్స్ వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధమైంది. వైఎస్సార్ జిల్లా బద్వేల్ వద్ద గోపవరం పారిశ్రామిక పార్కులో రూ.1,000 కోట్ల పెట్టుబడితో 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సెంచురీ ప్యానల్స్‌ను శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ యూనిట్ ద్వారా 2,266 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. అలాగే అంతకు రెట్టింపు సంఖ్యలో పరోక్ష ఉపాధి కల్పిస్తోంది.

రైతులకు ప్రయోజనం

సెంచురీ ప్యానల్స్‌లో హై ప్రెజర్ లామినేట్స్ (హెచ్‌పీఎల్) మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డ్స్ (ఎండీఎఫ్) తయారవుతాయి. రోజుకు 950 టన్నుల సామర్థ్యం గల ఎండీఎఫ్‌లను తయారు చేస్తారు. ఇందుకోసం భారీ సంఖ్యలో కలప అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో 150 కి.మీ పరిధిలోని వైఎస్సార్, అన్నమయ్య, నంద్యాల, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతుల నుంచి యూకలిప్టస్‌ను సేకరించనుంది. ఇందుకోసం సుమారు 80,000 ఎకరాల్లో యూకలిప్టస్ పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు సెంచురీ ప్యానల్స్ జనరల్ మేనేజర్ రమేష్ కుమార్ రెడ్డి ‘సాక్షి’కి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా యూకలిప్టస్‌ను కొనుగోలు చేస్తామన్నారు. దీనివల్ల సుమారు 25,000 రైతు కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం దక్కుతుందని చెప్పారు. ఇప్పటికే రైతులకు 50 లక్షల విత్తన మొక్కలను సబ్సిడీ ధరలకు అందించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఉద్యోగ నియామకాల్లో 80 శాతం మంది స్థానిక యువతనే తీసుకుంటున్నామన్నారు. తొలుత గోపవరం, బద్వేలు మండలాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆ తర్వాత వైఎస్సార్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే ఈ యూనిట్‌కు అవసరమైన ముడి సరుకును అందించే రీసిన్ తయారీ యూనిట్‌ను నాయుడుపేట వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ యూనిట్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు.

‘ఐఎస్‌బీ’లో పూర్వ విద్యార్థి జ్ఞాపకార్థం స్కాలర్‌షిప్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) పూర్వ విద్యార్థి జ్ఞాపకార్థం ‘విదులా జలన్ సాల్కర్‌షిప్’ పేరిట ఒక కొత్త స్కాలర్‌షిప్‌ను శుక్రవారం ప్రకటించారు. నీడ్-కమ్-మెరిట్ ప్రాతిపదికన ఇద్దరు పీజీపీ విద్యార్థులకు (విద్యార్థి, విద్యార్థినికి) అందించనున్నారు. 2025 సంవత్సరం నుంచి ఇది అమలులోకి వస్తుంది. 2003 ఐఎస్‌బీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ) విద్యార్థి, దివంగత విదులా జలన్ పేరిట ఏర్పాటు చేసిన ఈ స్కాలర్ షిప్‌ను అన్షుమాన్, విదులా జలాన్ ఫౌండేషన్ ద్వారా అందిస్తామని ఫౌండేషన్ ట్రస్టీ ప్రతినిధి అన్షుమాన్ విక్రమ్ జలన్ అన్నారు. పూర్వ విద్యార్థి పేరిట స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల అన్నారు.

సాక్షి రియల్టీ



టీఎస్‌లో 8,227 ఏపీలో 3,900

- రెరాలో నమోదైన ప్రాజెక్టులివీ
- దేశవ్యాప్తంగా 1.16 లక్షల రిజిస్ట్రేషన్లు
- అత్యధికంగా మహారాష్ట్రలో 42,204
- రెండేళ్లలో 63 శాతం వృద్ధి నమోదు

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) గృహ కొనుగోలుదారులకు భరోసా, పెట్టుబడులకు భద్రత కల్పిస్తుంది. చట్టం అమలులోకి వచ్చిన కొత్తలో నత్తనడకన సాగినా... ప్రస్తుతం వేగం పుంజుకుంది. గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా ప్రాజెక్టల నమోదులో 63 శాతం, ఏజెంట్ల రిజిస్ట్రేషన్లలో 47 శాతం వృద్ధి రేటు నమోదవడమే ఇందుకు ఉదాహరణ. 2021 నవంబర్‌లో రెరాలో 71,307 ప్రాజెక్ట్‌లు నమోదు కాగా.. ఈ ఏడాది నవంబర్ నాటికి 1,16,117లకు పెరిగాయి. ప్రస్తుతం రెరాలో 82,755 మంది ఏజెంట్లు రిజిస్టరయ్యారని కేంద్ర గృహ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

- 2021 నవంబర్‌లో తెలంగాణ రెరాలో 3,630 ప్రాజెక్ట్‌లు నమోదు కాగా.. ఈ ఏడాది నవంబర్ నాటికి 8,227 ప్రాజెక్ట్‌లకు పెరిగాయి. ఇప్పటివరకు టీఎస్ రెరా 1,070 ఫిర్యాదులను పరిష్కరించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రెరాలో 2,049 ప్రాజెక్ట్‌లు నమోదు కాగా.. 2023 నవంబర్ నాటికి 3,900లకు పెరిగాయి. 228 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి.
- దేశవ్యాప్తంగా రెరాలో నమోదైన ప్రాజెక్ట్‌లలో తొలి స్థానంలో మహారాష్ట్ర రెరా నిలిచింది. ఇక్కడ 42,204 ప్రాజెక్ట్‌లు రిజిస్ట్రేషన్ కాగా.. 18,915 ప్రాజెక్ట్‌లతో తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది.
- దేశవ్యాప్తంగా 1,16,300 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి. ఇందులో సుమారు 38 శాతం ఫిర్యాదుల పరిష్కారంతో ఉత్తర్‌ప్రదేశ్ తొలి స్థానంలో నిలిచింది. ఇక్కడ 44,602 కేసులు పరిష్కారం కాగా.. 20,604 ఫిర్యాదుల పరిష్కారంతో హరియాణాలో రెండో స్థానంలో, 15,423 కేసుల పరిష్కారంతో మహారాష్ట్ర మూడో స్థానంలో నిలిచాయి.

నిర్మాణ ప్రాంతంలో డే కేర్ సెంటర్



డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవంలో మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ జూపల్లి రామూరావు

సాక్షి, హైదరాబాద్: భవన నిర్మాణ రంగంలో వలస నిర్మాణ కార్మికుల పాత్ర ముఖ్యమైనది. నిర్మాణం జరిగే ప్రాంతంలో కార్మికుల పిల్లల బాగోగులు ఆ నిర్మాణ సంస్థే చూసుకోవాలనే సదుద్దేశంతో ముందుకొచ్చింది. మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్. ఇందుకోసం అవేక్ష పేరుతో చైల్డ్ డే కేర్ సెంటర్‌ను ప్రారంభించింది. కోకాపేటలో నిర్మిస్తున్న నిషాద ప్రాజెక్ట్‌లో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. భవన నిర్మాణ కార్మికుల పిల్లల ప్రయోజనాల కోసం నిర్వహించే తొలి డే కేర్ సెంటర్ ఇది. అవేక్ష అనేది పారిశ్రామిక, నిర్మాణ రంగంలో వెనుకబడిన వర్గాల కార్మికుల కుటుంబాలకు చెందిన పిల్లలను ఉద్దేశించిన డే కేర్ కేంద్రం. ప్రస్తుతం ఈ కేంద్రంలో 60 మంది చిన్నారులు సంరక్షణ పొందుతున్నారు. బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాలకు చెందిన వలస భవన నిర్మాణ కార్మికుల పిల్లలు. ఈ కేంద్రం నిర్వహణ ఖర్చులను సిడ్బీ, మౌలిక సదుపాయాల వ్యయాలను ప్రైవేట్ సంస్థలు వెచ్చిస్తాయి. గత రెండేళ్లలో కోవే సంస్థ జీడిమెట్ల, చర్లపల్లి, ఉప్పల్, మౌలాలి, పాశమైలారం, జీనోమ్ వ్యాలీలలో అవేక్ష డే కేర్ సెంటర్లను ప్రారంభించింది.

నగర వార్తలు

రామానుజన్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



మ్యాథమెటిక్స్‌పై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ, ప్రొ. బాలసుబ్రమణ్యన్, బిట్స్ పిలానీ డైరెక్టర్ సుందర్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో శుక్రవారం ఇండియన్ మ్యాథమెటిక్స్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యన్ ముఖ్యఅతిథిగా హాజరై గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థ గణితంపైనే ఆధారపడి ఉందని, రామానుజన్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. విద్యార్థి దశ నుంచే గణితంపై మక్కువ పెంచుకుంటే ఉన్నతంగా రాణిస్తారన్నారు. గణితంలో ఫార్ములాను అర్థం చేసుకుంటే ఎంత కష్టమైన లెక్కలైనా సులభంగా చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా మ్యాథమెటిక్స్‌పై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాగా, ఈ వేడుకలకు దేశంలోని వివిధ యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల నుంచి అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ మ్యాథమెటిక్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎంఎం శిఖారే, కార్యదర్శి రాజశేఖర్, బిట్స్ పిలానీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సుందర్, గణిత శాస్త్ర విభాగ అధ్యక్షుడు ప్రొ.పీకే సాహూ తదితరులు పాల్గొన్నారు.

రేపు ‘కృష్ణవేణి శత వసంత మహోత్సవం’



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆకృతి సంస్థ అధ్యక్షుడు సుధాకర్ తదితరులు

బంజారాహిల్స్: నటి, గాయని, నిర్మాత, స్టూడియో అధినేతగా పలు బాధ్యతలు చేపట్టిన కృష్ణవేణి ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు గర్వించే సినీ విదుషీమణి అన్నారు ప్రముఖ నిర్మాత, తెలుగు ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి టి.ప్రసన్నకుమార్. శుక్రవారం ఫిల్మ్‌నగర్‌లోని ఫిలింఛాంబర్‌లో ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి అధ్యక్షుడు సుధాకర్, నిర్మాత అనురాధాదేవి, సీనియర్ పాత్రికేయులు భగీరథతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకృతి ఆధ్వర్యంలో, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో డిసెంబర్ 24న నిర్వహించే ‘కృష్ణవేణి శత వసంత మహోత్సవం’ కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, మహానటులు ఎస్వీ రంగారావు, సూర్యకాంతం, అంజలీదేవితోపాటు సంగీత దర్శకుడిగా ఘంటసాలను మొదటిసారి పరిచయం చేసిన ఘనత కృష్ణవేణిదే అని కొనియాడారు. ప్రముఖ పాత్రికేయులు భగీరథ, ఆకృతి సుధాకర్ మాట్లాడుతూ, ఈ నెల 24న ప్రసాద్ లాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో ఆకృతి నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారన్నారు.

ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేయాలి: ఐఎన్టీయూసీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ నాయకులు

హిమాయత్‌నగర్: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేసి, ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, స్టాఫ్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నారాయణగూడలోని ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో స్టాఫ్, వర్కర్స్ యూనియన్ నూతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్టీసీ పరిరక్షణతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్లను పునరుద్ధరించడంతో పాటు ఆర్టీసీ విలీన కమిటీ తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019లో సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికులపై పెట్టిన పోలీసు కేసులను ఎత్తివేసి, పెండింగ్‌లో ఉన్న డీఏను చెల్లించాలని కోరారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అడిషనల్ ప్రధాన కార్యదర్శులు డి.గోపాల్, అబ్దుల్ హఫీజ్ ఖాన్, జి.అబ్రహం, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిరెడ్డి, చీఫ్ ఉపాధ్యక్షుడు వై.డి.బెన్ సుశీల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా పోలీసుల సేవలు

నగర కొత్వాల్ శ్రీనివాస్‌రెడ్డి



మెహిదీపట్నంలో డీసీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నగర కొత్వాల్ శ్రీనివాస్‌రెడ్డి

గోల్కొండ: ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవలు అందించడమే తమ లక్ష్యమని నగర కొత్వాల్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మెహిదీపట్నంలో ఆధునికీకరించిన సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్‌ను అంతమొందించడానికి తొలి ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ రహిత హైదరాబాదే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీస్ శాఖ విస్తృత ప్రచారం నిర్వహించడానికి నిర్ణయించిందన్నారు. వారం రోజుల్లో కోట్లాది రూపాయల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే పబ్‌ల లైసెన్స్‌లను శాశ్వతంగా రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కొత్వాల్ వెంట సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి, వి.సత్యనారాయణ, ఏసీపీలు సయ్యద్ ఫయాజ్‌తో పాటు సౌత్ వెస్ట్ జోన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు ఉన్నారు.

శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి తదితరులు


సుల్తాన్‌బజార్: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర తెలంగాణ ప్రాంత కార్యాలయం శుక్రవారం కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో ప్రారంభమైంది. తీర్థక్షేత్ర రాష్ట్ర ప్రాంత సంయోజక్ గనాపురం రాజేశ్వర్‌రెడ్డి, సహ సంయోజక్ జగదీశ్వర్, వెంకటేశ్వరరాజు తదితరులు హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... హిందూవుల 500 సంవత్సరాల కల నెరవేరుతూ జనవరి 22న బలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట జరుగుతున్న శుభ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించాలని కోరారు. ఎంతో మంది రామభక్తుల త్యాగ ఫలంగా నిర్మించిన రామ మందిరాన్ని దర్శించుకుంటున్నామన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అయోధ్యలో పూజలందుకున్న పవిత్ర అక్షింతలు రామభక్తులు గడప గడపకూ తీసుకొచ్చి ఇస్తారన్నారు. కార్యక్రమంలో వీరేశలింగం, భరతవంశీ, శ్రీకాంత్, అజయ్‌రాజ్, జనార్దన్‌రెడ్డి, అభిషేక్ పాల్గొన్నారు.

‘హ్యాండ్ టు హ్యాండ్’ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



బంజారాహిల్స్: గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్ టు హ్యాండ్-సంప్రదాయ చేనేత పట్టు ఉత్పత్తుల వస్త్ర ప్రదర్శనను వర్ధమాన నటి కార్తీక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, నేటికీ వాటిపై వన్నె తగ్గలేదన్నారు. యువత హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకుడు జయేష్ మాట్లాడుతూ... ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో దేశంలోని 14 నగరాలకు చెందిన చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

క్రిస్మస్ కళ







శాంటా ఊరికి వెళదామా?

క్రిస్మస్ రోజున శాంటా తాత వస్తాడు. బహుమతులెన్నో తెస్తాడు. శాంటా ఉత్తర ధ్రువం నుంచి వస్తాడని అందరూ అంటారు. కాదు శాంటా మా ఊరి నుంచి వస్తాడు అంటారు ఫిన్‌లాండ్ దేశస్తులు. ఫిన్‌లాండ్‌లోని 'రొవానియమి' పెద్ద టూరిస్ట్ అట్రాక్షన్. ప్రతి క్రిస్మస్‌కు పర్యాటకులు అక్కడకు వెళ్లి శాంటా ఊరు ఇదేనంటూ సందడి చేస్తారు. ఈ ఊరి విశేషాలు చాలానే ఉన్నాయి. పిల్లలకు చెప్తే అబ్బుర పడతారు.

'జింగిల్ బెల్స్ జింగిల్ బెల్స్ జింగల్ ఆల్ ద వే'... ఎర్రని దుస్తుల్లో, తలమీద టోపీతో, గుబురు గెడ్డంతో, రైన్ డీర్లు లాగే స్లెడ్జ్ బండి మీద, బోలెడన్ని కానుకలు మూటగట్టుకుని క్రిస్మస్ రాత్రి ఆకాశ వీధుల గుండా క్రిస్మస్ తాత వస్తాడని పిల్లలకు ఒక నమ్మకం. క్రిస్మస్ వచ్చే ముందే తల్లిదండ్రులు పిల్లల్ని 'క్రిస్మస్ తాత ఏం ఇస్తే బాగుంటుందని అనుకుంటున్నావు' అని అడుగుతారు. కొందరు పిల్లలు 'ఫలానాది ఇవ్వు' అని క్రిస్మస్ తాతకు లెటర్లు రాస్తారు. కొందరు పిల్లలు ఇవేవీ అడక్కుండా తమకోసం ఏం ఇస్తాడో చూద్దాం అని ఉత్సుకతతో ఎదురు చూస్తారు.

ఎవరి బాల్యంలో అయినా ఇది అద్భుతమైన జ్ఞాపకం. క్రిస్మస్ తాత అంటూ ఎవరూ రారు అని పిల్లలకు తెలిసినా... ఏమో వస్తాడేమో అనుకునే అమాయకమైన వయసు అది. వస్తాడేమో అనిపించే ఉత్సుకత ఉండే ప్రాయం అది. అందుకే తల్లిదండ్రులు, బంధువులు చిన్నారులు ఉన్నచోట వారు నిద్ర పోయాక వారి కోసం తల దగ్గర కానుకలు పెట్టి వెళతారు. పిల్లలు తెల్లారి లేచి వాటిని చూసుకుని 'శాంటా ఇచ్చాడు' అని సంబర పడతారు.

శాంటా తాత ఎవరు?

ఇది బైబిల్ పాత్ర కాదు. క్రీ.శ.280 కాలంలో టర్కీలో సెయింట్ నికొలస్ అనే ఒక బిషప్ క్రిస్మస్ పండుగ నాడు పేదవారికి, ముఖ్యంగా పిల్లలకు ఎంతో కొంత సహాయం చేసేవాడట. నిద్రపోతున్న వారి పక్కన కానుకలు, డబ్బు పెట్టి వెళ్లేవాడట. సాక్సుల్లో బంగారు నాణెలు పెట్టి ఇళ్లల్లో పడేసేవాడని అంటారు. పండగంటే ఆనందం పంచడమే కదా. ఇది అందరికీ నచ్చింది. ఇలా ఒక తాత వచ్చి కానుకలు ఇస్తే బాగుండు అనే కోరిక పెరిగింది. మంచి కోరికను తీర్చడానికి ప్రపంచమంతా ముందుకొస్తుంది. అందుకే క్రిస్మస్ తాత అందరి తాత అయ్యాడు. సెయింట్ నికోలస్ కాస్తా శాంటా క్లాజ్ అయ్యాడు.



శాంటా ఊరు

నిజమైన శాంటా క్లాజ్ టర్కీ వాడైనా కాలక్రమంలో నార్త్‌పోల్ వాడయ్యాడు. దీనికి కారణం 1893–96ల మధ్య థామస్ నాస్ట్ అనే అమెరికన్ కార్టూనిస్టు శాంటా క్లాజ్ బొమ్మలు పత్రికలకు గీసి శాంటా నార్త్‌పోల్ వాడని అడ్రస్ పెట్టాడు. దానికి కారణం ఆ రోజుల్లో నార్త్ పోల్ (ఉత్తర ధ్రువం) ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు కనుక దాని చుట్టూ ఒక దైవిక కల్పనలు సాగేవి. సెయింట్స్ అక్కడే ఉంటారని అనుకొని ఉండొచ్చు. అదీగాక అక్కడ ఎప్పుడూ మంచు పడుతూ ఉంటుంది కనుక క్రిస్మస్ అంటే మంచుకాలం కనుక థామస్ నాస్ట్ ఏకంగా 24 గంటలూ మంచు ఉండే ప్రాంతాన్ని శాంటా క్లాజ్ తావును చేసి ఉంటాడు. ఇక అక్కడ రైన్‌డీర్లు ఉంటాయి కాబట్టి వాటిని వాహనంగా మార్చారు.

ఫిన్‌లాండ్ ఊరు

ఫిన్‌లాండ్ దేశం వారు శాంటా తమ ఊరి వాడేనని ఒక వాదన మొదలుపెట్టారు– పర్యాటక ఎత్తుగడే కావచ్చు. ఫిన్‌లాండ్ ఆర్కిటిక్ సర్కిల్‌లో వచ్చే దేశం కాబట్టి అక్కడ ఎప్పుడూ మంచే కాబట్టి శాంటా ఊరు తమ దేశంలోదే అనుకుని ఉండొచ్చు. అంతటితో ఆగక 'రొవానిఎమి' అనే ఊరిని శాంటా ఊరిగా టూరిస్ట్ ఎట్రాక్షన్ చేశారు. ఇక్కడ శాంటా ఇల్లు, శాంటా పోస్టాఫీసు, శాంటా తిరిగే స్లెడ్జ్‌బళ్లు అన్నీ ఉంటాయి. మైనస్ 12 డిగ్రీల చల్లదనం ఉండే క్రిస్మస్ కాలంలో కూడా టూరిస్టులు శాంటా ఊరికి వెళ్లి సందడి చేస్తారు. మత భావనలు పొందుతారు. ఈ ఊరి వారు శాంటాతో మాట్లాడాలనుకునే పిల్లల కోసం ఒక టెలిఫోన్ నంబర్ కూడా ఇచ్చారు. ఇక్కడి పోస్టాఫీసుకు ప్రతి సంవత్సరం 200 దేశాల నుంచి రెండు లక్షల ఉత్తరాలు శాంటా నుంచి పిల్లలకు వస్తాయి. ఇక్కడకు వెళ్లిన పర్యాటకులు ఇక్కడి పోస్టాఫీసులో ఉత్తరం రాసి పడేస్తే కరెక్ట్‌గా క్రిస్మస్‌కు అందేలా పంపుతారు. అంటే శాంటా పంపినట్టు పంపుతారు. అదో సరదా.

శాంటా అబద్ధం కావచ్చు.

కాని శాంటా ఉంటాడన్న పిల్లల అమాయక కామన అబద్ధం కాకూడదు.

ఈ క్రిస్మస్ రోజున అందరు పిల్లలకూ, ముఖ్యంగా ఆట వస్తువులు లేని పేద పిల్లలకు మీరే శాంటాగా మారండి. హ్యాపీ క్రిస్మస్.

పదిహేడు సంవత్సరాల వయసులో ఫైనాన్షియల్ మ్యాటర్స్ గురించి చాలా తక్కువమందికి ఆసక్తి ఉంటుంది. జిందాల్ మాత్రం అలా కాదు. హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన పదిహేడు సంవత్సరాల కశ్వీ జిందాల్‌కు ఆర్థిక విషయాలు అంటే బోలెడు ఆసక్తి. ఆ ఆసక్తి ఆమెను ఆర్థికరంగానికి సంబంధించిన అనేకానేక విషయాల గురించి తెలుసుకునేలా, 'ఇన్వెస్ట్ ది చేంజ్'కు శ్రీకారం చుట్టేలా చేసింది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా అట్టడుగు వర్గాల ప్రజలలో డిజిటల్ అక్షరాస్యత పెరిగేలా కృషి చేస్తోంది. రకరకాల ప్రభుత్వ పథకాల గురించి తన బృందంతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది కశ్వీ జిందాల్...

ఆ అ అలా మొదలైంది

ఆర్థిక అక్షరాస్యత

సేవా పథం



ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సకీనా బతుకుదెరువు కోసం దిల్లీకి వచ్చిన కశ్వీ జిందాల్ ఇంట్లో చిన్నాచితకా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఒకసారి రోడ్డు ప్రమాదం నుంచి తృటిలో బయటపడిందామె. ఇక అప్పటి నుంచి ఆమెకు భయం పట్టుకుంది. 'ఒకవేళ నాకు ఏమైనా అయితే పిల్లల పరిస్థితి ఏమిటి?'

ఆ భయంలో ఆమెకు సరిగ్గా నిద్రపట్టేది కాదు. అలాంటి రోజుల్లో ఒకరోజు 'ఇన్వెస్ట్ ది చేంజ్' స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సమావేశానికి హాజరైంది. ఆ సమావేశంలో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన గురించి తెలుసుకుంది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రమాదానికి గురైనా, చనిపోయినా రక్షణగా నిలిచే పథకం ఇది. సంవత్సరానికి ఇరవై రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఈ పథకంలో తన పేరు నమోదు చేసుకున్న సకీనా 'ఇప్పుడు నిశ్చింతగా ఉంది' అంటుంది.

ఈ పథకంలో తన పేరు నమోదు చేసుకోవడానికి ముందు సకీనాకు బ్యాంకు ఎకౌంట్ లేదు. దీంతో కశ్వీ బృందం సకీనాకు బ్యాంక్ ఎకౌంట్ రిజిస్టర్ చేయించింది.

తండ్రి ఫైనాన్షియల్ రంగంలో పనిచేస్తుండడంతో జిందాల్‌కు ఫైనాన్షియల్ మార్కెట్స్‌కు సంబంధించిన విషయాలు ఆసక్తిగా తెలుసుకునేది. తండ్రి విసుక్కోకుండా ఓపిగ్గా చెప్పేవాడు. దీంతో జిందాల్‌కు ఎకనామిక్స్ అనేది ఫేవరెట్ సబ్జెక్ట్ అయింది. ఫైనాన్స్ రంగంలోనే తన కెరీర్ ఏర్పాటు చేసుకోవాలనే భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

తమ అపార్ట్‌మెంట్‌లో హౌస్‌కీపింగ్ పనిచేసే వ్యక్తి మరణించాడు. అతడి వయసు 31 సంవత్సరాలు మాత్రమే. అతడి మీద కుటుంబం మొత్తం ఆధారపడి ఉంది. ఆ సమయంలో ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఇతర వర్కర్‌లతో మాట్లాడుతున్నప్పుడు వారికి ప్రాథమిక ఆర్థిక విషయాలు, ప్రభుత్వ పథకాల గురించి ఏమీ తెలియదు అని అర్థం అయింది.

ఈ నేపథ్యంలో జిందాల్ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన...మొదలైన ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ తరువాత స్వచ్ఛంద సంస్థ 'ఇన్వెస్ట్ ది ఛేంజ్' ప్రారంభించింది.

తొలిరోజు నుంచి 'ఇన్వెస్ట్ ది చేంజ్' నిర్వహించిన అవగాహన సదస్సులకు అద్భుత స్పందన లభించింది. ఆ సదస్సుల తరువాత 'ఫలానా స్కీమ్‌లో చేరుతాము' అంటూ ఫోన్లు వెల్లువెత్తేవి. వారు స్కీమ్‌లో చేరేలా ఆన్‌లైన్ అప్లయింగ్, ఫామ్-ఫిల్లింగ్ వరకు జిందాల్ బృందం ప్రతి పని దగ్గరుండి చూసుకునేది. ఏదైనా అప్లికేషన్ ఆమోదం పొందకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించేది.

'ఇన్వెస్ట్ ది చేంజ్'లో పదిహేనుమంది వాలంటీర్లు ఉన్నారు.

'రోటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్' భాగస్వామ్యంతో ప్రాథమిక ఆర్థిక విషయాలు, ప్రభుత్వ పథకాల గురించి ఎన్నో ప్రాంతాలలో ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది జిందాల్.

'ఇన్వెస్ట్ ది చేంజ్'ఎంతోమందిని ప్రభావితం చేసింది. మార్పు తీసుకు వచ్చింది. ఆఫీస్ బాయ్‌గా పనిచేసే ప్రకాష్ మండల్... కోవిడ్ కల్లోలంలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాడు. అతడికి ఉపయోగపడే గవర్నమెంట్ పాలసీల గురించి తెలియజేసి సహాయపడింది జిందాల్ బృందం.

'ఎన్నో స్కీమ్‌లు ఉన్నప్పటికీ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన నాకు నచ్చాయి. దీనికి కారణం సంవత్సరానికి చాలా తక్కువ మొత్తం కడితే సరిపోతుంది. స్కీమ్‌లో చేరాలనుకున్నప్పుడు ఫామ్స్ నింపడం, ఇతరత్రా విషయాలలో ఇబ్బంది పడ్డాను. ఇలాంటి సమయంలో జిందాల్ బృందం నాకు సహకరించింది' అంటున్నాడు ప్రకాష్.

భవిష్యత్‌లో ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించి మరిన్ని కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలనుకుంటుంది జిందాల్.

'ఆర్థిక అక్షరాస్యత అనేది మనల్ని స్వతంత్రులను చేస్తుంది. తెలివైన నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది. ప్రభుత్వ పథకాలతో పాటు పొదుపు మార్గాల గురించి కూడా తెలియజేస్తున్నాం' అంటుది కశ్వీ జిందాల్.

వారి నమ్మకమే మన బలం



గొప్ప లక్ష్యాలతో ముందుకు వచ్చినప్పటికీ ప్రజల్లో నమ్మకం పాదుకొల్పడం అనేది అతి పెద్ద సవాలు. వారి నమ్మకాన్ని గెలుచుకుంటే సగం విజయాన్ని సాధించినట్లే. వ్యక్తిగత విషయాలు కూడా మనతో పంచుకుంటారు. నా వయసు అనేది పెద్ద సమస్యగా మారింది. ఈ చిన్న అమ్మాయికి ఏం తెలుస్తుంది... అంటూ నన్ను పెద్దగా పట్టించుకునే వారు కాదు. అయితే నా ఉపన్యాసాల ద్వారా వారిని ఆకట్టుకొని వారికి నా పట్ల నమ్మకం కుదిరేలా చేసేదాన్ని.

– కశ్వీ జిందాల్,
ఇన్వెస్ట్ ది చేంజ్–ఫౌండర్

● ముగ్గుముచ్చట






సి. ఇందు సాయి
తడ, సూళ్లూరుపేట
తిరుపతి జిల్లా

9 చుక్కలు
1 వచ్చేవరకు
సరి చుక్క





కృష్ణవేణి
కొత్తగూడెం



20 చుక్కలు,
6 వరుసలు
6 వచ్చేవరకు



పద్మావతి
పల్లకడియం
తూర్పు గోదావరి జిల్లా

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



ఇంటిప్స్

- గ్లాసు నీళ్లల్లో బిర్యానీ ఆకు, దాల్చిన చెక్కను ముక్కలు చేసి వేయాలి. దీనిలో బోరిక్ యాసిడ్ రెండు టీస్పూన్లు వేసి మూడు గంటలపాటు నానబెట్టాలి. తరువాత ఈ నీటిని సింక్‌లో పోస్తే బొద్దింకలు రావు.
- నిమ్మకాయ ముక్కలు, పుదీనా ఆకులు వెనిగర్‌ను సమపాళ్లల్లో తీసుకుని ఐస్‌క్యూబ్ ట్రేలో పోసి రాత్రంతా రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ఉదయం ఈ ఐస్‌క్యూబ్‌ను తీసి దుర్వాసన వస్తోన్న సింక్‌లో వేస్తే దుర్వాసన పోతుంది.
- టొమాటో చుట్టూ చిన్నగా గాటు పెట్టి మరుగుతున్న నీటిలో వేయాలి. నిమిషం తరువాత తీసేసి ఐస్‌వాటర్‌లో వేయాలి. నిమిషం తరువాత టొమాటోను పట్టుకుని లాగితే తొక్క సులభంగా వచ్చేస్తుంది.
- బాణలిలో కొద్దిగా నీళ్లపోసి అవిరైపోయేవరకు వేడిచేయాలి. బాణలిలో ఒక్క నీటిచుక్క కూడా లేనప్పుడు నూనె వేసి ఫ్రైచేస్తే ఏ పదార్థమైనా బాణలికి అంటుకోదు.





ఈ రిక్షానే ఆసరాగా...

జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరిలా, పరిమళాలు వెదజల్లే పూలపాన్పులా ఉండదు. తమకున్న వనరులను ఉపయోగించుకుని పైగి ఎదగడానికి ప్రయత్నించి పెద్దవాళ్లు అయిన వాళ్లే ఎక్కువ. వీరు ఎంతోమందికి ప్రేరణగా కూడా నిలుస్తుంటారు. ఈ కోవకు చెందిన వ్యక్తే మీనాక్షి దేవి. జీవితాన్ని కష్టాల సుడిగుండంలో కొట్టుకుపోనివ్వకుండా... ఈ–రిక్షా లాగుతూ కుటుంబానికి జీవనాధారంగా మారింది. ఇలా తనకెదురైన కష్టాలకు ఎదురీదుతూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది మీనాక్షి దేవి.





మీనాక్షి దేవి

జమ్ము కశ్మీర్‌లోని దోడా జిల్లా భదర్వా టౌన్‌కు చెందిన 39 ఏళ్ల మీనాక్షి జీవితం ఏడాది క్రితం వరకు ఆనందంగా సాగింది. భర్త పమ్మి శర్మ, ఇద్దరు పిల్లలతో ఎంతో చక్కగా సాగిపోతున్న వీరి సంసారంలో అనుకోని ఉపద్రవం ఏర్పడింది. మీనాక్షి భర్తకు కిడ్నీలు పాడయ్యాయి. చికిత్సకోసం అనేక ఆసుపత్రులు తిరిగారు. మెడికల్ బిల్లులు పెరిగాయి కానీ సమస్య తీరలేదు. ఈ క్రమంలో వారు దాచుకున్న డబ్బులు మొత్తం ఆవిరైపోయాయి. ఉన్న కారు అమ్మేసి, వ్యాపారాన్ని మూసేసి అప్పులు తీర్చినా ఇంకా కొన్ని అప్పుల భారం అలానే ఉండిపోయింది.

ఏ దారీ దొరక్క...

భర్త సంపాదించే స్థితిలో లేకపోవడంతో మీనాక్షి దేవి కుటుంబ పోషణ కోసం పని వెతుక్కోవాల్సి వచ్చింది. కానీ తను చేయగలిగింది దొరకలేదు. ఈఎమ్ఐ ద్వారా కొన్న ఆటో ఒకటి ఇంట్లో ఉండడంతో అప్పుడప్పుడు పమ్మిశర్మ మీనాక్షికి సరదాగా ఆటో నేర్పించేవాడు. అప్పటి డ్రైవింగ్ స్కిల్స్‌ను మరింత మెరుగు పరుచుకుని ఆటో నడపాలనుకుంది మీనాక్షి. ఆమె కోరిక మేరకు ఆటో నడపడాన్ని పూర్తిస్థాయిలో నేర్పించాడు ఆమె భర్త. ఆ తరువాత సబ్సిడీలో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కొని, దాన్ని నడపడం ప్రారంభించింది మీనాక్షి. దానిమీద వచ్చిన డబ్బులతో భర్త మెడికల్ బిల్స్ కట్టడంతోపాటు, కొడుకులిద్దరి బాగోగులను చూసుకుంటోంది. ఇలా ప్రతికూల పరిస్థితుల్లో ఆటో డ్రైవర్‌గా మారిన మీనాక్షి దేవి చినాబ్ లోయలోనే తొలి ఈ–రిక్షా మహిళా డ్రైవర్‌గా నిలవడం విశేషం.

మరో ఆప్షన్ లేక..

"ప్రారంభంలో ఆటో నడుపుతానన్న నమ్మకం మీనాక్షికి లేదు. రద్దీగా ఉండే భదర్వా టౌన్‌లో ఆటో నడపడానికి చాలా భయపడేది. కుటుంబం గడవడానికి మరో గత్యంతరం లేదు. అందుకే ఎంతో కష్టపడి, ధైర్యంగా ఆటో నడపడం నేర్చుకుని అండగా నిలుస్తోంది. మీనాక్షిని చూస్తే నాకు తృప్తిగానే గాక, గర్వంగానూ ఉంది. రోజురోజుకి పెరిగిపోతున్న మెడికల్ బిల్స్ నన్ను తీవ్రంగా కుంగతీసేవి. ఒక దశలో తీవ్ర నిరాశకు లోనై.. పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన పడేవాడిని. నా రెండు కిడ్నీలు పనిచేయడం లేదు. ఎంతకాలం ఉంటానో కూడా తెలియని పరిస్థితుల్లో నా భార్య ఆటో నడుపుతూ నాకు మానసిక ప్రశాంతతను కల్పిస్తోంది" అని మీనాక్షి భర్త ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

"నాలుగు నెలల క్రితం తొలిసారి ఆటోతో ఆటోస్టాండ్‌లో అడుగు పెట్టాను. అక్కడ ఉన్న మిగతా డ్రైవర్లంతా నన్ను ఒక ఏలియన్‌లా చూశారు. కొంతమంది అయితే ఈమె కస్టమర్లను భద్రంగా ఇంటికి తీసుకెళుతుందో లేదో అంటూ చెవులు కొరుక్కునేవారు. లేదు. ఇరుగు పొరుగు, బంధువులు ఆటో నడపవద్దు అని నిరుత్సాహ పరిచారు. కానీ ఇది నా కుటుంబ జీవనాధారం. అందుకే నేను ఎవరి మాటలను పట్టించుకోకుండా ముందుకు సాగాను. రోజురోజుకీ నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇప్పుడు రోజుకి పదిహేను వందల నుంచి రెండు వేలరూపాయల వరకు సంపాదిస్తున్నాను" అని మీనాక్షి సగర్వంగా చెబుతోంది.

ఆస్మా

దమ్ముందా? ఇలా చేసి చూడండి!



చలికాలంలో చర్మసమస్యలు, జుట్టు రాలిపోవడం వంటివి ఎంత సాధారణమో, ఆస్మారోగులకు ఆయాసం ఎక్కువ కావడం, ఆర్థరైటిస్ అంటే కీళ్ల జబ్బులు ఉన్నవారికి కీళ్లనొప్పులు పెరగడం అంతే సహజం. గతవారం మనం కీళ్లజబ్బులకు పరిష్కార మార్గాలు తెలుసుకున్నాం కాబట్టి ఈవారం ఆస్మా రోగులు ఏం చేయాలి, ఏం చేయకూడదు... వంటి విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

దగ్గు, బ్రాంకైటిస్, ఉబ్బసం, న్యుమోనియా మొదలైనవన్నీ శ్వాసనాళాలకి, ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధులే. ఆస్తమా లేదా ఉబ్బసం అనేది ఒక దీర్ఘకాలిక శ్వాసకోశ సంబంధ వ్యాధి. దీనికి వయసుతో నిమిత్తం లేదు. చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా ఎవరికైనా రావచ్చు. సరిపడని తత్వం అంటే ఎలర్జీ, దుమ్ము, ధూళి, పొగ, ధూమపానం, ఘాటైన వాసనలు, కాలుష్య వ్యర్థాలు, చలి వాతావరణం సరిపడకపోవటం వంటివి. ముందుగా శీతాకాలంలో ఆస్మా రోగులు ఎలా ఉండాలో చూద్దాం.

- శరీర తత్వాన్ని అనుసరించి ఏ పదార్థం తీసుకుంటే ఉబ్బసం వస్తుందో, ఆ పదార్థం లేదా పదార్థాలను పూర్తిగా మానివేయాలి.
- నిల్వ ఉన్న పదార్థాలకు ఉబ్బసం వ్యాధిగ్రస్థులు దూరంగా ఉండాలి.
- మంచినీరు ఎక్కువగా తాగాలి. ఉబ్బసం ప్రకోపించినప్పుడు, మరింతగా ఎక్కువ నీరు తాగాలి.
- రోగ నిరోధకశక్తిని పెంచేది విటమిన్-సి. అందువలన విటమిన్ 'సి' పుష్కలంగా ఉండే పండ్లు, కూరలు అవసరం. ఆ క్రమంలో ప్రతిరోజు కనీసం ఒక సిట్రస్ పండు అయినా తప్పనిసరిగా తినాలి.
- మాంసాహారులయితే ఒమేగా-3 ఫాటీ యాసిడ్స్‌తో కూడిన చేపలను, కోడిమాంసాన్ని తీసుకోవచ్చు. శ్వాసనాళాలలోని జిగురు పొర పల్చబడకుండా ఉండటానికి కోడి మాంసం దోహదం చేస్తుంది.
- ఉబ్బసానికి వాడే అల్లోపతి మందులు చాలావరకు స్టెరాయిడ్ మందులు. వీటి వలన మంచితోబాటు కీడు కూడా జరుగుతుంది.
- ఉదయం పూట వేప నూనె ముక్కులో రెండు చుక్కలు వేసుకోవాలి. రాత్రి నిద్రించే ముందు ఆవు నెయ్యి గోరువెచ్చగా చేసి ముక్కులో వేసుకోవాలి.
- రాత్రి పడుకొనే ముందు ఆవాల నూనె ఛాతీ మీద, గొంతుకు రాయాలి.
- ఆస్తమాతో బాధపడుతున్న వారు చికిత్సకు ప్రాధాన్యం ఇస్తున్నట్టే.. ఆహారపరమైన మార్పులు చేసుకోవడం కూడా అవసరం అవుతుంది. కొన్ని రకాల ఆహార పదార్థాల విషయంలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా స్పందించినప్పుడు అది ఆహార పరమైన అలర్జీలకు దారితీస్తుంది. ఇది కొంతమందిలో ఆస్తమాకు దారితీయ వచ్చని వైద్యులు చెబుతున్నారు.

వీటిని దూరం పెట్టాలి..

- పులిసిన పదార్థాలు
- పొగ తాగటం
- మత్తుపానీయాలను సేవించటం
- మసాలా దినుసులు
- తీపి పదార్థాలు
- కడుపునిండా తినడం

కొన్ని ఆహార పదార్థాలు ఆస్తమాకు కారణం కాకపోయినా, ఆస్తమా లక్షణాలను తీవ్రతరం చేస్తాయి. కనుక వాటికి దూరంగా ఉండడం అవసరం. సల్ఫైట్స్ అనే ప్రిజర్వేటివ్ ఆస్తమా లక్షణాలను పెంచుతుంది. ప్యాకేజ్డ్ పచ్చళ్లు, ప్యాకేజ్డ్ లెమన్ జ్యూస్, డ్రై ఫ్రూట్స్‌పై సల్ఫైట్స్ ఉంటాయి. కాఫీ, టీ, కొన్ని రకాల సుగంధ, మసాల దినుసుల్లోని శాలిసిలేట్స్ కూడా ఉబ్బసాన్ని పెంచుతాయి. ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో వాడే ప్రిజర్వేటివ్ లు, ఆర్టిఫీషియల్ కలర్స్, ఫ్లావర్స్ తోనూ సమస్య పెరుగుతుంది.

విటమిన్ డి

ఆస్తమా నుంచి రక్షణనిచ్చే వాటిలో విటమిన్ డి ది కీలక పాత్ర. ముఖ్యంగా 6 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు పిల్లలకు డి విటమిన్ లోపం లేకుండా చూసుకోవాలి. గుడ్లు, చేపలు, పాలు రూపంలో విటమిన్ డి అందుతుంది. పాలు, గుడ్లు కొందరిలో అలర్జీకి కారణమవుతాయి. పడని వారు వీటిని తీసుకోకూడదు.

విటమిన్ ఎ

శరీరంలో విటమిన్ ఎ తగినంత ఉన్న పిల్లలకు ఆస్తమా సమస్య తక్కువగా ఉంటున్నట్టు పలు అధ్యయనాలు గుర్తించాయి. పిల్లలలో విటమిన్ ఎ అధికంగా ఉంటే వారి ఊపిరితిత్తుల పనితీరు మెరుగ్గా ఉంటుందట. క్యారట్, బ్రకోలీ, ఆలుగడ్డ, పాలకూర తదితర వాటిల్లో విటమిన్ ఎ ఎక్కువగా లభిస్తుంది.

పండ్లు

రోజూ ఒక యాపిల్ తీసుకుంటే ఆస్తమా రిస్క్ తగ్గుతుంది. ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. అరటిపండులో ఉండే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఆస్తమా నివారణకు ఉపయోగపడతాయి.

మెగ్నీషియం

మెగ్నీషియం తక్కువగా ఉంటే శ్వాసకోశ వ్యవస్థ పనితీరు కూడా తగ్గుతుందని వైద్యులు అంటున్నారు. కనుక గుమ్మడి గింజలు, చేపలు, డార్క్ చాక్లెట్, పాలకూర తదితర మెగ్నీషియం తగినంత లభించే వాటిని తీసుకోవాలి.

చలికాలంలో ఈ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఆస్తమా వ్యాధిగ్రస్థులకు ఉపశమనం.

లైఫ్@360



మన శరీరంలో పోషకాలు, ఆక్సిజన్ ప్రతి కణానికి సరిగ్గా అందడం లో రక్తం పాత్ర ముఖ్యమైనది. సరైన ఆరోగ్యం కోసం తగినంత రక్తం శరీరంలో ఉండాల్సిన అవసరం ఉంది. శరీరంలో రక్తం లోపించిన పరిస్థితిని అనీమియా అంటారు. రక్తం సరిగ్గా ఉండటానికి సరైన ఆహారాలు తినటం ఎంత ముఖ్యమో ప్రాసెస్ట్ ఆహారాలు, కృత్రిమ షుగర్స్ గల ఆహారాలు తగ్గించడం కూడా అంతే ముఖ్యం.

ఇవి తీసుకోండి.. రక్తహీనత రాదు!

- ఐరన్ అనేది ఎర్ర రక్త కణాలలోని హిమోగ్లోబిన్‌లో కనిపించే ఒక ఖనిజం. హిమోగ్లోబిన్ ఆక్సిజన్‌ను శరీరంలోని అన్ని భాగాలకు చేరవేస్తుంది. శరీరంలో ఐరన్ లోపం ఉన్నప్పుడు, ఎర్ర రక్త కణాలు సరిగా ఉత్పత్తి కావు, గుడ్లు, మాంసం, చేపలు, టోఫు, పప్పులు, చిక్కుళ్ళు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల ఐరన్ లోపం తలెత్తకుండా ఉంటుంది.
- విటమిన్ బి 12 అనేది ఒక విటమిన్, ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం. విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు, ఎర్ర రక్తకణాలు సరిగా పనిచేయలేవు.
- అందువల్ల ఆహారంలోకి విటమిన్-బి 12 లభించే మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, గుడ్లు తీసుకోవాలి.
- ఫోలిక్ యాసిడ్ అనేది ఒక విటమిన్, ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా అవసరం. ఫోలిక్ యాసిడ్ లోపం ఉన్నప్పుడు, ఎర్ర రక్త కణాలు సరిగా పెరగలేవు, అందువల్ల ఫోలిక్ యాసిడ్ ఉండే గుడ్లు, మాంసం, చేపలు, ఆకుకూరలు, బీన్స్, చిక్కుళ్ళు తీసుకోవాలి.
- ప్రోటీన్లు అనేవి శరీరం నిర్మాణాత్మక భాగాలు. ప్రోటీన్లు ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా అవసరం.
- ప్రోటీన్ల-మూలం మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, పప్పులు, చిక్కుళ్ళు, ధాన్యాలు, ఆకుకూరలు, తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకుకూరల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది, ఈ ఐరన్ మన రక్తం లోని హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో ముఖ్యమైనది. ఆకు కూరల్లాంటి ఐరన్ రిచ్ ఫుడ్స్ తినడం వల్ల రక్తం పెరిగి అనీమియా వంటి సమస్య రాకుండా ఉంటుంది.

చిక్కుళ్ళు, పప్పు దినుసులు

చిక్కుళ్ళు, పప్పు దినుసుల్లో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇందులో ఉన్న ప్లాంట్ బేస్డ్ ఐరన్ రక్త వృద్ధికి సహాయపడాలంటే వీటితో పాటు విటమిన్ సి అధికంగా ఉన్న ఫుడ్స్ కూడా తీసుకోవాలి. అలాగే వీటిలో ఫోలియేట్, విటమిన్ బి 6 కూడా ఉండటం వల్ల రక్తం తయారవ్వటానికి ఇవి బాగా దోహదం చేస్తాయి.

నట్స్, సీడ్స్

బాదం, గుమ్మడి గింజలు, సన్‌ఫ్లవర్ గింజలు వంటి నట్స్, సీడ్స్ లో ఫోలియేట్, ఐరన్, విటమిన్ ఇ ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్ ఇ ఎర్ర రక్తకణాలు నష్టపోకుండా కాపాడుతుంది.

బీట్ రూట్

బీట్ రూట్స్ లో ఐరన్, విటమిన్ ఇ పుష్కలంగా ఉంటాయి. అందుకని మన శరీరం లో బ్లడ్ లెవల్స్ పెరగడానికి ఇది సహాయపడుతుంది. అలాగే ఈ బీట్‌రూట్స్ లో ఉండే నైట్రేట్స్ రక్త ప్రసరణ సవ్యంగా జరగడానికి అలాగే రక్తంలో ఆక్సిజన్ సరిగ్గా ఉండటానికి సహాయపడతాయి.

సిట్రస్ పండ్లు

నారింజ పళ్ళు, ద్రాక్ష, నిమ్మకాయలు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి అనేది మన శరీరంలో రక్తం పెరగడానికి అవసరం అయ్యే ఐరన్ గ్రహించడానికి సహాయపడుతుంది. అందుకనే ఐరన్ రిచ్ ఫుడ్స్ తో పాటు ఈ సిట్రస్ పండ్లు కూడా తీసుకోవటం మంచిది.

హెల్త్ టిప్స్

చిన్న సమస్యలకు ఇంటి చిట్కాలు



కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే వ్యర్థపదార్థాల నుంచి కాలేయానికి రక్షణ దొరుకుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.

- తులసి ఆకులు, వ్యాధి నిరోధక శక్తిని వద్ధి చేయడమే కాదు, శ్వాసకోశ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఓ ఐదారు ఆకుల కషాయాన్ని మరగించి టీ మాదిరి చేసుకుని తాగితే, దగ్గు, జలుబు, ఆస్తమా అదుపులోకి వస్తాయి.
- పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.



- మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ బాగా సాయమవుతుంది.



ఒక కప్పు నీటిలో ఒక పూవు చొప్పున వేసి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.

- అల్లం, జీర్ణశక్తిని పెంచడంతో పాటు కడుపులోని వికారాన్ని తగ్గిస్తుంది. అల్లం రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటే, ఆకలి పెరుగుతుంది.



- పడుకునే ముందు చెర్రీపండ్లు తిన్నా లేదా జ్యూస్ తాగినా.. అందులో ఉండే 'మెలటోనిన్' వల్ల చక్కగా నిద్ర పడుతుంది

మీకు తెలుసా?

సాధారణంగా కొందరు ఉదయం నిద్రలేచిన వెంటనే వేడి నీరు తాగుతారు. ఇది జీర్ణక్రియలో సహాయపడుతుంది. అయితే వేడినీటిలో నెయ్యి కలుపుకుని తాగడం వల్ల జీర్ణ వ్యవస్థకు మరింత మేలు జరుగుతుంది.



- ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. నెయ్యిలో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ గుండెకు చాలా మేలు చేస్తాయి. ఇది కాకుండా, కేలరీలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు ఎ, ఇ మొదలైనవి నెయ్యిలో లభిస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో నెయ్యి తీసుకోవడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది.
- చర్మ సంబంధిత సమస్యల నుంచి బయటపడవచ్చు. చర్మం ఆరోగ్యంగా... ప్రకాశవంతంగా మారుతుంది. కొవ్వు కరిగిపోతుంది. ఎముకలు దృఢంగా తయారవుతాయి. ఇది వెచ్చని నీటితో లేదా ఆహారంతో ఉదయాన్నే ఖాళీ కడుపుతో తీసుకోవచ్చు.
- ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతోపాటు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి.



సినిమా

ఆడా లేరు... ఈడా లేరు...

ఈ ఏడాది కొంతమంది కథానాయికలను తెలుగు తెర మిస్సయింది. ఆ మాటకొస్తే తెలుగులో మాత్రమే కాదు.. ఏ భాష తెరపైనా ఈ తారలు కనిపించలేదు. ఆడా లేరు.. ఈడా లేరు అన్నట్లు ఎక్కడా కనిపించకుండా ఆ నాయికలు ఏం చేస్తున్నారో చూద్దాం.

2023 రౌండప్

'లవ్ స్టోరీ (2021)', 'శ్యామ్ సింగ రాయ్ (2021)', 'విరాటపర్వం (2022)' సినిమాలతో రెండేళ్లుగా తెలుగు తెరపై సందడి చేసిన సాయి పల్లవి ఈ ఏడాది మాత్రం సిల్వర్ స్క్రీన్‌కి దూరమయ్యారు. చెప్పాలంటే 2023లో నటిగా సాయిపల్లవి పూర్తిగా బ్రేక్ తీసుకున్నట్లే. ఎందుకంటే ఆమె హీరోయిన్‌గా చేసిన సినిమాలేవీ తెలుగులోనే కాదు... ఇతర భాషల్లో కూడా విడుదల కాలేదు. 2022లో తమిళంలో చేసిన 'గార్గి' చిత్రం తర్వాత సాయి పల్లవి నటించిన మరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రాలేదు. ప్రస్తుతం నాగచైతన్యతో 'తండేల్', శివ కార్తికేయన్‌తో ఒక చిత్రం... సాయి పల్లవి కమిట్ అయిన సినిమాలు ఇవే. 'తండేల్' షూటింగ్ జరుగుతోంది. శివ కార్తికేయన్‌తో చేస్తున్న సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది. సో.. వచ్చే ఏడాది డబుల్ ధమాకాలా సాయి పల్లవి ఈ రెండు చిత్రాలతో థియేటర్స్‌లో సందడి చేస్తారు.

***

హీరోయిన్‌గా 'కార్తికేయ 2', '18 పేజెస్', 'అంటే.. సుందరానికీ' సినిమాలో ఓ అతిథి పాత్ర, 'బటర్ ఫ్లై'తో డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ ఇలా.. 2022లో అనుపమా పరమేశ్వరన్ ఫుల్ ఫామ్‌లో కనిపించారు. కానీ ఈ ఏడాది వెండితెరపై సందడి చేయలేదు. తెలుగులో అనుపమ చేస్తున్న 'డీజే టిల్లు' సీక్వెల్ 'డీజే టిల్లు స్క్వేర్' చిత్రం ఈ ఏడాది విడుదలకు ముస్తాబైనా కొన్ని కారణాల వల్ల వచ్చే ఏడాది ఫిబ్రవరి 9కి వాయిదా పడింది. దాంతో ఈ ఏడాది ఆమె కనిపించలేదు. ప్రస్తుతం అనుపమ చేతిలో రవితేజ 'ఈగల్', తెలుగులో ఓ లేడీ ఓరియంటెడ్ మూవీ ఉన్నాయి. ఇతర భాషల్లో మరో రెండు సినిమాలు ఉన్నాయి. జనవరిలో 'ఈగల్', ఫిబ్రవరిలో 'డీజే టిల్లు స్క్వేర్' విడుదలవుతాయి. చూస్తుంటే.. 2024లో అనుపమా పరమేశ్వరన్ ముచ్చటగా మూడు సార్లయినా వెండితెరపై మెరిసే అవకాశం ఉంది.

***

గత ఏడాది రెండు తెలుగు సినిమాలు (పక్కా కమర్షియల్, థ్యాంక్యూ), రెండు తమిళ సినిమాలు (తిరుచిత్రంబలం, సర్దార్)లతో కెరీర్‌లో దూకుడు పెంచినట్లుగా కనిపించారు రాశీ ఖన్నా. కానీ ఆ స్పీడ్‌కు ఈ ఏడాది స్పీడ్ బ్రేకర్ పడింది. రాశీ ఖన్నా సైన్ చేసిన హిందీ చిత్రం 'యోధ' రిలీజ్ వచ్చే ఏడాదికి వాయిదా పడింది. అలాగే తెలుగులో శర్వానంద్‌తో రాశీ ఖన్నా కమిట్ అయిన సినిమా ప్రస్తుతానికి హోల్డ్‌లో ఉంది. ఇలా రాశీ ఖన్నా వెండితెరపై మెరవలేక పోయారు. అయితేనేం.. తమిళంలో రాశీ ఖన్నా ఓ హీరోయిన్‌గా నటించిన 'అరణ్మణై 4', హిందీ 'యోధ' రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. మరో రెండు ప్రాజెక్ట్స్ కూడా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ స్టేజ్‌లో ఉన్నాయి. సో.. వచ్చే ఏడాది రాశీ ఖన్నా జోరు మళ్లీ కనిపిస్తుంది.

అన్నట్లు మరో మాట.. తెలుగులో 'తెలుసు కదా' అనే సినిమాలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రాశీ ఖన్నా. సిద్ధు జొన్నలగడ్డ ఓ హీరోగా, 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధీ శెట్టి మరో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజా కోన దర్శకురాలిగా పరిచయం కానున్నారు. ఇక గత ఏడాది 'కేజీఎఫ్ 2' వంటి బ్లాక్ బస్టర్, తమిళంలో 'కోబ్రా' చిత్రంతో తెరపై కనిపించిన శ్రీనిధీ శెట్టి ఈ ఏడాది కనిపించలేదు.

***

తెలుగులో 'హీరో', తమిళంలో 'కలగ తలైవన్' సినిమాలతో గత ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై మెరిశారు నిధీ అగర్వాల్. కానీ ఈ ఏడాది మాత్రం స్లో అయ్యారు. ఈ ఏడాది ఆమె హీరోయిన్‌గా నటించిన ఏ చిత్రం ఏ భాషలో కూడా వెండితెరపైకి రాలేదు. నిధి నటిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం షూటింగ్ దశలో ఉంది.

***

నాని 'గ్యాంగ్‌లీడర్', శర్వానంద్ 'శ్రీకారం' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ ప్రియాంకా అరుళ్ మోహన్ సుపరిచితురాలే. గత ఏడాది 'ఈటీ', 'డాన్' వంటి తమిళ చిత్రాలతో వెండితెరపై మెరిశారామె. అయితే ఈ యంగ్ బ్యూటీ కూడా ఈ ఏడాది వెండితెరపై కనిపించలేదు. ప్రియాంక హీరోయిన్‌గా నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రం ఈ ఏడాది రిలీజ్‌కు షెడ్యూలై, ఆ తర్వాత సంక్రాంతికి షిఫ్ట్ అయ్యింది. అలా ఈ ఏడాదిని మిస్ అయ్యారు ప్రియాంక. ప్రస్తుతం తెలుగులో 'సరిపోదా శనివారం', 'ఓజీ', తమిళంలో 'బ్రదర్' చిత్రాలు చేస్తున్నారు ప్రియాంకా అరుళ్ మోహన్.



సాయి పల్లవి



అనుపమా పరమేశ్వరన్



రాశీ ఖన్నా



శ్రీనిధీ శెట్టి



నిధీ అగర్వాల్




ప్రియాంక

ఆస్కార్ రేసు నుంచి 2018 చిత్రం అవుట్

- పది విభాగాల్లో షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించిన అకాడమీ

భారతీయ సినీ ప్రేమికులకు నిరాశ ఎదురైంది. 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీకి భారతదేశం తరఫున అధికారిక ఎంట్రీగా వెళ్లిన మలయాళ సినిమా '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో' ఆస్కార్ షార్ట్‌లిస్ట్ జాబితాలో చోటు దక్కించుకోలేక పోయింది. 96వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 10న లాస్ ఏంజెల్స్‌లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ వేడుకకు సంబంధించిన కార్యక్రమాలను వేగవంతం చేశారు అకాడమీ నిర్వాహకులు. ఇందులో భాగంగా.. డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్, డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్, ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్, మేకప్ అండ్ హెయిర్ స్టైలింగ్, ఒరిజినల్ స్కోర్ మ్యూజిక్, ఒరిజినల్ సాంగ్ మ్యూజిక్, యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్, లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్, సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్.. ఇలా మొత్తం పది విభాగాల్లో ఆస్కార్‌కు నామినేషన్ బరిలో ఉన్న షార్ట్ లిస్ట్‌ను ప్రకటించారు మేకర్స్. హాలీవుడ్ చిత్రాలు 'బార్బీ, ఓపెన్ హైమర్'ల హవా ఈ షార్ట్‌లిస్ట్ జాబితాలో కనిపించింది. ఇక ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నామినేషన్ కోసం 88 దేశాల చిత్రాలు పోటీ పడగా, 15 చిత్రాలు షార్ట్‌లిస్ట్ అయ్యాయి. ఈ లిస్ట్‌లో మలయాళ '2018' సినిమాకు చోటు దక్కలేదు. కాగా ఇండో-కెనెడియన్ ఫిల్మ్‌మేకర్ నిషా పహుజా దర్శకత్వం వహించిన 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో షార్ట్ లిస్ట్ అయింది. ఇప్పటికే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో 'టు కిల్ ఏ టైగర్' అవార్డ్స్‌లతో సత్తా చాటింది. జార్ఖండ్‌లో గ్యాంగ్ రేప్‌కు గురైన తన కుమార్తెకు న్యాయం జరగాలని ఓ తండ్రి చేసే పోరాటం నేపథ్యంలో 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ కథనం ఉంటుంది. అస్కార్ నామినేషన్ కోసం పదిహేను డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్స్‌తో 'టు కిల్ ఏ టైగర్' పోటీ పడాల్సి ఉంది. ఇక అన్ని విభాగాల్లోని ఆస్కార్ నామినేషన్స్ జనవరి 23న వెల్లడి కానున్నాయి. ఇందుకోసం జనవరి 11 నుంచి జనవరి 16 వరకు ఓటింగ్ జరుగుతుంది.

ప్రస్తుతానికి ప్రకటించిన ఆస్కార్‌లోని పది విభాగాల షార్ట్ లిస్ట్ జాబితాలో ఒక్క ఇండియన్ చిత్రానికి కూడా చోటు లభించలేదు. ఇక '2018' విషయానికొస్తే కేరళలో 2018లో సంభవించిన వరదల ఆధారంగా ఈ సినిమాను జూడ్ ఆంటోనీ జోసెఫ్ డైరెక్ట్ చేశారు. టొవినో థామస్, కుంచాకో బోబన్, అపర్ణా బాలమురళి, అసిఫ్ అలీ, వినీత్, తన్వి రామ్, అజు వర్గీస్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఈ ఏడాది మార్చిలో విడుదలై బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించింది. దాదాపు రూ. 150 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను ఈ చిత్రం వసూలు చేసింది.





ఆస్కార్ బరిలో నిలిచి నామినేషన్ దక్కించుకోలేకపోయిన నాలుగో మలయాళ చిత్రంగా '2018: ఎవ్రీ వన్ ఏ హీరో' చిత్రం నిలిచింది. గతంలో 70వ ఆస్కార్ అవార్డ్స్‌కు 'గురు (1997)', 83వ ఆస్కార్ అవార్డ్స్‌కు 'అదామింటే మకాన్ అబు (2011)', 93వ ఆస్కార్ అవార్డ్స్ కోసం 'జల్లికట్టు (2019)', 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో' చిత్రాలను ఆస్కార్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగపు నామినేషన్ కోసం ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అకాడమీకి పంపింది.



బార్బీ పోస్టర్

ప్రేమకు జై

అనిల్ బురగాని, ఆర్. జ్వలిత జంటగా నటించిన చిత్రం 'ప్రేమకు జై'. శ్రీనివాస్ మల్లం దర్శకత్వంలో అనసూర్య నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌ని ప్రముఖ పాటల రచయిత శివశక్తి దత్త విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. నూతన నటీనటులు చాలా బాగా నటించారనిపిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో జరిగిన ఒక వాస్తవ ఘటన ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. హీరో హీరోయిన్లతో పాటు ప్రతినాయకుడు దుబ్బాక భాస్కర్ బాగా నటించారు. మా సినిమాని నూతన సంవత్సరంలో విడుదల చేయనున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఉరుకుందా రెడ్డి, సంగీతం: చైతు, లైన్ ప్రొడ్యూసర్: మైలారం రాజు.



అనిల్, జ్వలిత

ఇష్క్ జైసా కుచ్..

హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ జంటగా రూపొందిన చిత్రం 'ఫైటర్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మమతా ఆనంద్, రామన్ చిబ్, అంకు పాండే నిర్మించారు. ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా నుంచి 'ఇష్క్ జైసా కుచ్..' అంటూ సాగే రెండో పాటను విడుదల చేశారు. ''హృతిక్ రోషన్, దీపికా పదుకోన్‌ల మధ్య వచ్చే ఫుల్ రొమాంటిక్ సాంగ్ 'ఇష్క్ జైసా కుచ్..'. దీపిక, హృతిక్ డ్యాన్స్ అదరగొట్టారని ప్రేక్షకులు అంటారు. ఈ సినిమాలో హృతిక్ స్క్వాడ్రన్ లీడర్ షంషేర్ పఠానియాగా (పాటీ) కనిపించనుండగా, స్క్వాడ్రన్ లీడర్ మిన్నీగా (దీపికా) కనిపిస్తారు'' అని మేకర్స్ అన్నారు.



హృతిక్ రోషన్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
242	94
71,107	21,349

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 10.00 గంటలకు)

నాస్‌డాక్	15,012	▲	49
డోజోన్స్	37,455	▲	41
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,698	▲	3
డాక్స్	16,703	▲	16
షాంఘై	2,915	▼	4
నికాయ్	33,169	▲	29

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,844	▲	509
బంగారం (99.5 స్వచ్ఛత)	62,592	▲	506
వెండి (కేజీ)	74,918	▲	368

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.85	83.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.49	107.06
€	యూరో	ఎస్‌బీఐ	90.53	92.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.84	59.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.55	57.53
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.02	63.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.74	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.55	12.62

జీఆర్‌టీ జ్యుయలర్స్ 'వజ్రో'త్సవ ఆఫర్



హైదరాబాద్: పండుగల సీజన్‌ను పురస్కరించుకుని ప్రముఖ జీఆర్‌టీ జ్యుయలర్స్ 'డాజిలింగ్ డైమండ్ క్యాంపెయిన్' (మిరుమిట్లు గొలిపే వజ్రాల ప్రచారోత్సవం) పేరుతో భారీ ఆఫర్లకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం సంస్థ తన విస్తృతశ్రేణి డైమండ్స్, అన్‌కట్ డైమండ్స్ విక్రయాలపై (సాలిటైర్ మినహా) 25% వరకూ మినహాయింపు లభిస్తుంది. ప్లాటినం జ్యుయలర్స్‌కు సంబంధించి మేకింగ్ చార్జీలు, వేస్టేజ్‌పై 30% వరకూ రిబేట్ లభిస్తుంది. ఎంఆర్‌పీ డైమండ్ నెక్లెస్‌ల శ్రేణిలో 10 శాతం డిస్కౌంట్ ఉంటుంది.

శ్రీ ధూతపాపేశ్వర్ నుంచి స్వామల ప్రొడక్ట్ కొత్త ప్యాక్



హైదరాబాద్: ఫార్మాస్యూటికల్స్, ఆయుర్వేదంలో అపార అనుభవం కలిగిన శ్రీ ధూతపాపేశ్వర్ లిమిటెడ్ తాజాగా సువర్ణ భస్మతో కూడిన బలవర్ధకమైన చ్యవన్‌ప్రాష్- స్వామల ప్రొడక్ట్ కొత్త ప్యాక్‌ను ఆవిష్కరించింది. స్వామల చ్యవనప్రాష్ ఆరోగ్య ప్రయోజనాలను సంరక్షించడంతోపాటు, తరచూ ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడే సువర్ణ భస్మ, రజత్ భస్మ, లోహ భస్మ వంటి ఇతర పదార్థాలను కలిగి ఉందని సంస్థ ఎండీ రంజిత్ పురాణిక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా బజాజ్ పల్సర్ మేనియా నేషనల్ ఫినాలే



హైదరాబాద్: టూ వీలర్, త్రీ-వీలర్ ప్రముఖ కంపెనీ బజాజ్ ఆటో.. బజాజ్ పల్సర్ మేనియా నేషన్ ఫినాలే- మాస్టర్స్ ఎడిషన్‌ను ముంబైలో నిర్వహించింది. దాదాపు 100 నగరాల్లో పోటీ పడిన ఉత్సాహవంతమైన రైడర్‌లు- ఈ పోటీలో పాల్గొన్నారు. 100 నగరాల్లో జరిగిన కార్యక్రమాన్ని లక్షమందికిపైగా వీక్షిస్తే, ముంబైకి దాదాపు 25,000 మంది విచ్చేశారు. కార్యక్రమంలో 30 మంది 'అల్టిమేట్ పల్సర్ మేనియాక్' టైటిల్ కోసం పోటీ పడ్డారు. పోటీలో మొదటి, రెండు, మూడు స్థానాల్లో మహ్మద్ నూమాన్, జీత్ సింగ్, ఇనియవన్ రవిచంద్రన్ విజేతలుగా నిలిచారు.

ఫ్లిప్‌కార్ట్‌కు 600 మిలియన్ డాలర్లు

10 శాతం అధిక వేల్యుయేషన్‌తో సమకూరుస్తున్న వాల్‌మార్ట్



న్యూఢిల్లీ: దేశీ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌కు అమెరికన్ రిటైల్ దిగ్గజం 600 మిలియన్ డాలర్లు సమకూర్చనుంది. ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుత వేల్యుయేషన్‌కు అదనంగా 5-10% లెక్కగట్టి వాల్‌మార్ట్ ఈ నిధులు అందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, తాజా నిధుల సమీకరణ తర్వాత కంపెనీ వేల్యుయేషన్ ఎంత స్థాయిలో ఉంటుందనేది వెల్లడి కాలేదు. ఇది 40 బిలియన్ డాలర్ల లోపే ఉంటుందని ఇతర వర్గాలు తెలిపాయి. ఫ్లిప్‌కార్ట్ చివరిసారి 37.6 బిలియన్ డాలర్ల విలువతో జీఐసీ, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ 2 తదితర సంస్థల నుంచి 3.6 బిలియన్ డాలర్లను సమీకరించింది.

ఐపీఓకి ఓలా... సెబీకి దరఖాస్తు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వెరసి రెండు దశాబ్దాల తదుపరి ఆటోరంగ కంపెనీ ఐపీవో ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కానుంది. కాగా.. ఇష్యూలో భాగంగా రూ. 5,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 9,51,91,195 షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ ఓసీటీ ఏర్పాటు చేస్తున్న ఓలా గిగాఫ్యాక్టరీ కోసం పెట్టుబడి వ్యయాలుగా వినియోగించనుంది.

జనరల్ అట్లాంటిక్ చేతికి ఆసుపత్రులు!

- అమర్ ఉజాలా నుంచి కొనుగోలుకి సై
- రూ. 1,600 కోట్ల సంస్థ విలువలో డీల్



ముంబై: గ్లోబల్ పీఈ దిగ్గజం జనరల్ అట్లాంటిక్(జీఏ) దేశీ ఆసుపత్రుల చైన్‌ను కొనుగోలు చేసే బాటలో సాగుతోంది. 19 ఆసుపత్రుల నెట్‌వర్క్ కలిగిన ఉజాలా సిగ్నస్ హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో 70 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలుస్తోంది. సంస్థ విలువను రూ. 1,600 కోట్లుగా మదింపు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సంస్థలో తొలుత ప్రస్తుత ఇన్వెస్టర్ల నుంచి 51 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ప్రస్తుత వాటాదారులలో 8 రోడ్స్ వెంచర్స్ ఇండియా, ఇవాల్వెన్స్ ఇండియా ఫండ్, సోమర్‌సెట్ ఇండస్ హెల్త్‌కేర్ ఫండ్ ఉన్నాయి. అంతేకాకుండా ప్రమోటర్ల నుంచి సైతం కొద్దిపాటి వాటానుచేజిక్కించుకోనుంది. వెరసి ఉజాలా సిగ్నస్ పేరుతో అమర్ ఉజాలా నిర్వహిస్తున్న సంస్థలో మొత్తం 70 శాతం వాటాను జీఏ కొనుగోలు చేయనుంది. డీల్ ప్రస్తుతం డాక్యుమెంటేషన్ స్థితిలో ఉన్నదని, కొద్ది వారాలలో పూర్తి కాగలదని తెలుస్తోంది. అయితే అటు జీఏ, ఇటు ఉజాలా సిగ్నస్ ప్రతినిధులు ఈ అంశాలపై స్పందించకపోవడం గమనార్హం!

ఉత్తరాదిన సర్వీసులు

ఉజాలా సిగ్నస్ ప్రధానంగా ఉత్తరాదిన ద్వితీయ, తృతీయస్థాయి పట్టణాలలో 19 ఆసుపత్రులను కలిగి ఉంది. హర్యానా, యూపీ, ఉత్తరాఖండ్, జేఅండ్‌కే, ఢిల్లీలలో మొత్తం 1,800 పడకలతో హెల్త్‌కేర్ సర్వీసులు విస్తరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 600 కోట్ల టర్నోవర్, రూ. 120 కోట్ల నిర్వహణ లాభం ఆర్జించగలదని అంచనా. సిగ్నస్ మెడికేర్‌ను 2011లో డాక్టర్లు దినేష్ బాత్రా, షుచిన్ బజాజ్ ఏర్పాటు చేశారు. తదుపరి 2019లో అమర్ ఉజాలా మెజారిటీ వాటాను సొంతం చేసుకుంది. హెల్త్‌కేర్ రంగంలో విస్తరించే ప్రణాళికలతో 10 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్వహిస్తున్న సంస్థలో రూ. 130 కోట్లకు నియంత్రణ వాటాను కొనుగోలు చేసింది. ఆపై ఉజాలా హెల్త్‌కేర్‌కుగల రెండు ఆసుపత్రులను సిగ్నస్‌లో విలీనం చేసింది. తద్వారా విలీన సంస్థలో నియంత్రణతోపాటు ప్రధాన వాటాను పొందింది. కాగా.. 2018లో కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్ హాస్పిటల్స్)లోనూ జీఏ 13 కోట్ల డాలర్లు(సుమారు రూ. 1,079 కోట్లు) ఇన్వెస్ట్ చేసి మైనారిటీ వాటాను కొనుగోలు చేసిన విషయం విదితమే.

దలాల్ స్ట్రీట్‌లో శాంటాక్లాజ్ లాభాలు

- ఐటీ, మెటల్ షేర్లకు డిమాండ్
- సూచీలకు రెండో రోజూ లాభాలు
- మళ్లీ 71,000 పాయింట్ల పైకి సెన్సెక్స్
- 21,300 పాయింట్ల ఎగువకు నిఫ్టీ



ముంబై: క్రిస్మస్‌కు ముందు దలాల్ స్ట్రీట్‌లో శాంటాక్లాజ్ ర్యాలీ కనిపించింది. పతనమైన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ లాభపడ్డాయి. ఐటీ, మెటల్, టెక్, ఆటో, ఫార్మా, రియల్టీ షేర్లు రాణించాయి. ఫలితంగా సెన్సెక్స్ 242 పాయింట్లు పెరిగి 71,107 వద్ద నిలిచింది. నిఫ్టీ 94 పాయింట్లు బలపడి 21,349 వద్ద స్థిరపడింది. ఉదయం స్వల్పలాభాలతో మొదలైన స్టాక్ సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర లాభ, నష్టాల మధ్య కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 395 పాయింట్లు లాభపడి 71,260 వద్ద, నిఫ్టీ 135 పాయింట్లు పెరిగి 21,390 వద్ద ఇంట్రాడే గరిష్టాలు నమోదు చేశాయి. బ్యాంకులు, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ షేర్లు 1.04%, 0.75% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,829 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,167 కోట్ల షేర్లు కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా(ఎంపీఎస్) కల్పించే అంశంలో పదేళ్ల గడువు లభించడంతో ఎల్ఐసీ షేరు 4% పెరిగి రూ.793 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 7% పెరిగి రూ.820 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. షేరు నాలుగు లాభపడంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులో రూ.18,057 కోట్లు పెరిగి రూ.5.01 లక్షల కోట్లకు చేరింది.
- ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో ఐటీ షేర్లు రాణించాయి. విప్రో 6.55%, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4%, ఎంఫసీస్, హెచ్‌సీఎల్ టెక్ 3%, కోఫోర్జ్ 2.50%, ఎల్అండ్‌టీఎం, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ ఒకటిన్నర శాతం, ఎల్‌టీటీఎస్, టీసీఎస్ షేర్లు ఒకశాతం చొప్పున లాభపడ్డాయి.
- స్టాక్ మార్కెట్ వరుస 3 రోజులు పనిచేయదు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు కాగా, సోమవారం(డిసెంబర్ 25న) క్రిస్మస్ సందర్భంగా ఎక్స్ఛేంజీలు పనిచేయవు. ట్రేడింగ్ తిరిగి మంగళవారం యథావిధిగా ప్రారంభం అవుతుంది.
- అజాద్ ఇంజనీరింగ్ ఐపీఓకు 80.60 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1.01 కోట్ల ఈక్విటీలు జారీ చేయగా మొత్తం 81.58 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఐబీ కోటా 179.66 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్లు విభాగం 87.55 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 23.71 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది.
- కెనడియన్ బిలియనీర్ ప్రేమ్ వాట్సా గ్రూప్ ఫెయిర్‌ఫాక్స్ గ్రూప్.., ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థలో 5.7% వాటాను దక్కించుకుంది. ఓపెన్ మార్కెట్ ద్వారా ఎఫ్ఐహెచ్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ నుంచి ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు చెందిన 2.16 కోట్ల ఈక్విటీల(5.7% వాటా)ను రూ.1,198 కోట్లకు కొనుగోలు చేసినట్లు బల్క్‌డీల్ డేటా తెలిపింది. ఈ లావాదేవీ తర్వాత ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ షేరు 4% నష్టపోయి రూ.573 వద్ద స్థిరపడింది.

ధర పెరిగినా... ఆభరణాల డిమాండ్ 'బంగారమే'!

- 2023-24లో వినియోగం విలువ అంచనాలు అప్
- 10-12 శాతానికి పెంచిన ఇక్రా
- ధరలు ఎగబాకుతాయని విశ్లేషణ



ముంబై: ధరలు పెరిగినప్పటికీ పసిడి ఆభరణాలకు డిమాండ్ తగ్గడం లేదని తాజా నివేదిక ఒకటి పేర్కొంది. బంగారం ఆభరణాల వినియోగం.. విలువ పరంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023-24) 10 నుంచి 12 శాతం పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా- నివేదిక పేర్కొంది. ఇంతక్రితం వేసిన 8 నుంచి 10 శాతం అంచనాలను ఈ మేరకు ఎగువముఖంగా సవరించింది. పసిడి ధరల పెరుగుదలే దీనికి కారణమని వివరించింది. 2023-24 మొదటి ఆరునెలల కాలాన్ని (ఏప్రిల్-సెప్టెంబర్) 2022-23 ఇదే కాలంతో పరిశీలిస్తే ఆభరణాల వినియోగం విలువ 15 శాతానికి పైగా పెరిగినట్లు నివేదిక పేర్కొంది. బంగారం కొనుగోళ్లకు శుభప్రదంగా భావించే 'అక్షయ తృతీయ' సమయంలో స్థిరమైన డిమాండ్, అధిక బంగారం ధరలు దీనికి కారణంగా పేర్కొంది. అయితే ద్వితీయార్థంలో ఈ శాతం 6 నుంచి 8 శాతమే ఉంటుందని అభిప్రాయపడింది. గ్రామీణ డిమాండ్ మందగమనం, ద్రవ్యోల్బణం తీవ్రత తమ అంచనాలకు కారణమని పేర్కొంది. నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే..

- డిసెంబర్ 2022-ఏప్రిల్ 2023 మధ్య అస్థిరత కొనసాగిన బంగారం ధరలు, 2023-24 మొదటి అర్ధభాగంలో (ఏప్రిల్-సెప్టెంబర్) స్థిరంగా ఉన్నాయి. అయితే క్రితం సంవత్సరం సగటు ధరలతో పోలిస్తే 14 శాతం పెరిగాయి.
- పెరిగిన ధరలు.. పలు ఆభరణాల రిటైలర్ల ఆదాయ పటిష్టతకు దోహదపడ్డాయి.
- మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, ప్రపంచ స్థూల ఆర్థిక అనిశ్చిత పరిస్థితులతో సమీప కాలంలో బంగారం ధరలు పెరిగే అవకాశాలే ఉన్నాయి.
- అక్టోబర్ 2023 ప్రారంభం నుండి బంగారం ధరల పెరుగుదల, స్థిరంగా కొనసాగుతున్న ద్రవ్యోల్బణం తీవ్రతవల్ల యల్లో మెటల్ ఆభరణాల డిమాండ్ కొంత తగ్గవచ్చు.

సాక్షి స్పోర్ట్స్



స్వదేశానికి విరాట్ కోహ్లి

రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం దక్షిణాఫ్రికా వెళ్లిన భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి దక్షిణాఫ్రికా నుంచి అనూహ్యంగా స్వదేశానికి తిరిగి బయల్దేరాడు. 'వ్యక్తిగత కారణాలతో' కోహ్లి వెనక్కి వ్చనట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. కోహ్లి ఇంటికి వెళ్లడంపై స్పష్టమైన కారణం ఏమిటో తెలియకపోయినా... ఈ విషయంపై అతను ముందే బీసీసీఐ అనుమతి తీసుకున్నట్లు సమాచారం. గురువారమే కోహ్లి భారత్‌కు బయల్దేరాడు. ఇది ముందే నిర్ణయించుకున్నది. అందుకే అతను భారత్, దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య జరిగిన మూడు రోజుల ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లో కూడా ఆడలేదు' అని బోర్డు ప్రతినిధి ఒకరు చెప్పారు. అయితే ఈ నెల 26 నుంచి జరిగే తొలి టెస్టు సమయానికి అతను మళ్లీ దక్షిణాఫ్రికాకు చేరుకుంటాడని, మ్యాచ్ కూడా ఆడతాడని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ చేతి వేలి గాయం కారణంగా టెస్టు సిరీస్ నుంచి తప్పుకున్నాడు.

క్రికెట్‌కు ఎల్గర్ గుడ్‌బై



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ టెస్టు క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ తనకు చివరిది కానుందని అతను వెల్లడించాడు. తనకు ఇష్టమైన కేప్‌టౌన్ మైదానంలోనే కెరీర్ ముగించాలని నిర్ణయించుకున్నట్లు ఎల్గర్ చెప్పాడు. 2012లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన ఎల్గర్ 84 టెస్టుల్లో 47.38 సగటుతో 5146 పరుగులు చేశాడు. ఇందులో 13 సెంచరీలు ఉన్నాయి. 17 టెస్టుల్లో దక్షిణాఫ్రికాకు కెప్టెన్‌గా వ్యవహరించిన అతను 9 మ్యాచ్‌లలో జట్టును గెలిపించాడు. ఎల్గర్ 8 వన్డేల కెరీర్ 2018లోనే ముగిసింది.

టైటాన్స్‌కు తొలి గెలుపు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. శుక్రవారం జరిగిన తమ ఆరో మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 37-36తో హరియాణా స్టీలర్స్ జట్టుపై నెగ్గింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ అత్యధికంగా 10 పాయింట్లు, అజిత్ పవార్ 7 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 46-33తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	6	5	1	0	26
బెంగాల్ వారియర్స్	6	3	1	2	21
హరియాణా స్టీలర్స్	6	4	2	0	21
జైపూర్ పింక్ పాంథర్స్	6	3	2	1	20
గుజరాత్ జెయింట్స్	6	3	3	0	18
పట్నా పైరేట్స్	6	3	3	0	17
యు ముంబా	5	3	2	0	16
యూపీ యోధాస్	6	2	3	1	15
బెంగళూరు బుల్స్	7	2	5	0	14
దబంగ్ ఢిల్లీ	5	2	3	0	12
తమిళ్ తలైవాస్	5	2	3	0	10
తెలుగు టైటాన్స్	6	1	5	0	7

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు



స్మృతి



జెమీమా రోడ్రిగ్స్



దీప్తి శర్మ

మన బ్యాటర్లూ అదరగొట్టారు

- స్మృతి, జెమీమా రోడ్రిగ్స్, రిచా, దీప్తి శర్మ అర్ధ సెంచరీలు
- భారత్‌కు 157 పరుగుల ఆధిక్యం
- ఆస్ట్రేలియా మహిళలతో ఏకైక టెస్టు

ముంబై: ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఏకైక టెస్టులో భారత మహిళల హవా రెండో రోజూ కొనసాగింది. వాంఖెడే మైదానంలో తొలి రోజు పదునైన బౌలింగ్‌తో ఆసీస్ మహిళలను కట్టడి చేసిన మన జట్టు శుక్రవారం బ్యాటింగ్‌లోనూ చెలరేగి భారీ ఆధిక్యాన్ని అందుకుంది. మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 119 ఓవర్లలో 7 వికెట్లకు 376 పరుగులు చేసింది. దాంతో ప్రస్తుతానికి భారత్‌కు 157 పరుగుల ఆధిక్యం లభించింది. స్మృతి మంధాన (106 బంతుల్లో 74; 12 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (121 బంతుల్లో 73; 9 ఫోర్లు), దీప్తి శర్మ (147 బంతుల్లో 70 నాటౌట్; 9 ఫోర్లు), రిచా ఘోష్ (104 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. ఆసీస్ బౌలర్లలో ఆఫ్ స్పిన్నర్ యాష్లీ గార్డ్‌నర్ 4 వికెట్లు పడగొట్టింది. ప్రస్తుతం క్రీజ్‌లో దీప్తితో పాటు పూజ వస్త్రకర్ (115 బంతుల్లో 33 బ్యాటింగ్; 4 ఫోర్లు) ఉంది. వీరిద్దరు ఇప్పటికే ఎనిమిదో వికెట్‌కు అభేద్యంగా 102 పరుగులు జోడించడం విశేషం. శుక్రవారం ఆట మొత్తం 100 ఓవర్ల పాటు సాగగా, గార్డ్‌నర్ ఒక్కతే 36 ఓవర్లు వేసింది.

స్మృతి రనౌట్...

ఓవర్‌నైట్ స్కోరు 98/1తో భారత్ రెండో రోజు ఆట కొనసాగించింది. స్నేహ్ రాణా (9) ఎక్కువ సేపు నిలవలేకపోగా, 68 బంతుల్లో స్మృతి అర్ధ సెంచరీ పూర్తయింది. ఆపై కొన్ని చక్కటి షాట్లు ఆడిన స్మృతి స్వయంకృతంతో వెనుదిరిగింది. గార్డ్‌నర్ బౌలింగ్‌లో బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ఆడి సింగిల్‌కు ప్రయత్నించింది. అయితే రిచాతో సమన్వయలోపంతో పరుగు ఆలస్యం కావడంతో నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌లో రనౌటైంది. అనంతరం రిచా, జెమీమా భాగస్వామ్యం భారత్‌ను మెరుగైన స్థితికి చేర్చింది. తొలి సెషన్‌లో భారత్ 2 వికెట్లు కోల్పోయి 95 పరుగులు జోడించింది.

భారీ భాగస్వామ్యాలు...

లంచ్ తర్వాత ఇన్నింగ్స్ 63వ ఓవర్లో గార్డ్‌నర్ బౌలింగ్‌లో రిచా కొట్టిన ఫోర్‌తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. జెమీమా 86 బంతుల్లో, కెరీర్‌లో తొలి టెస్టు ఆడుతున్న రిచా 98 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. అయితే రిచాను గార్త్ అవుట్ చేయడంతో ఈ భాగస్వామ్యానికి తెర పడింది. జెమీమా, రిచా నాలుగో వికెట్‌కు 113 పరుగులు జత చేశారు. అనంతరం చెలరేగిన గార్డ్‌నర్ తన వరుస ఓవర్లలో హర్మన్‌ప్రీత్ (0), యస్తిక (1)లను పెవిలియన్‌ను పంపడంతో పాటు కొద్ది సేపటికే జెమీమాకు కూడా అవుట్ చేసింది. 14 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోవడంతో 274/7 వద్ద భారత్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతో సేపు పట్టదనిపించింది. అయితే దీప్తి, పూజ భిన్నంగా ఆలోచించారు. చివరి సెషన్‌లో పట్టుదలగా నిలబడి పరుగులు సాధిస్తూ ఆసీస్ బౌలర్లను చికాకు పెట్టారు. దీప్తి తన బ్యాటింగ్ ప్రతిభను ప్రదర్శించగా... బౌలింగ్‌లో చెలరేగిన పూజ బ్యాటింగ్‌లోనూ మంచి డిఫెన్స్‌తో దీప్తికి అండగా నిలిచింది. ఈ క్రమంలో 115 బంతుల్లో దీప్తి హాఫ్ సెంచరీని అందుకుంది. కెరీర్‌లో నాలుగో టెస్టు ఆడుతున్న దీప్తి ప్రతీ టెస్టులోనూ అర్ధసెంచరీ చేయడం విశేషం. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ ఎనిమిది బౌలర్లతో ఎంతగా శ్రమించినా లాభం లేకపోయింది. 38 ఓవర్ల సెషన్‌లో భారత్ 100 పరుగులు సాధించగా, ఆసీస్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 219; భారత్ తొలి ఇన్నింగ్స్: షఫాలీ (ఎల్బీ) (బి) జొనాసెన్ 40; స్మృతి (రనౌట్) 74; స్నేహ రాణా (బి) గార్డ్‌నర్ 9; రిచా (సి) గార్డ్‌నర్ (బి) గార్త్ 52; జెమీమా (సి) సదర్లాండ్ (బి) గార్డ్‌నర్ 73; హర్మన్‌ప్రీత్ (ఎల్బీ) (బి) గార్డ్‌నర్ 0; యస్తిక (ఎల్బీ) (బి) గార్డ్‌నర్ 1; దీప్తి శర్మ (బ్యాటింగ్) 70; పూజ (బ్యాటింగ్) 33; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (119 ఓవర్లలో 7 వికెట్లకు) 376. వికెట్ల పతనం: 1-90, 2-140, 3-147, 4-260, 5-261, 6-265, 7-274. బౌలింగ్: లౌరెన్ 9-3-23-0, గార్త్ 10-1-49-1, పెర్రీ 4-0-31-0, గార్డ్‌నర్ 41-7-100-4, జొనాసెన్ 18-4-42-1, సదర్లాండ్ 8-2-20-0, అలానా 19-1-69-0, తహీలా 10-2-22-0.

నాకొద్దీ 'పద్మశ్రీ'...

పౌర పురస్కారాన్ని వెనక్కి ఇచ్చిన స్టార్ రెజ్లర్ బజరంగ్	రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడి ఎన్నికపై కొనసాగుతున్న నిరసన	'పద్మశ్రీ' తిరిగిచ్చేయడం బజరంగ్ వ్యక్తిగత నిర్ణయమన్న క్రీడాశాఖ





న్యూఢిల్లీ: దేశానికి పతకాలు తెచ్చిపెట్టిన భారత స్టార్ రెజ్లర్ల నుంచి మరో తీవ్రమైన నిర్ణయం వెలువడింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికల ఫలితాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న రెజ్లర్లు ఆటకు వీడ్కోలు పలకడం, ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారాలను వెనక్కి ఇచ్చేయడం చేస్తున్నారు. ఇది భారత క్రీడాలోకానికి మచ్చగా మిగలడం ఖాయం! డబ్ల్యూఎఫ్ఐలో తిష్ట వేసుక్కూర్చున్న వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ చెరలోనే రెజ్లింగ్ సమాఖ్య కొనసాగుతుండటం, ఆయన వీర విధేయుడు సంజయ్ సింగ్ ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడిగా గెలవడంతో గురువారం రియో ఒలింపిక్స్ కాంస్య విజేత సాక్షి మలిక్ రిటైర్మెంట్ ప్రకటించింది. శుక్రవారం తాజాగా టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజరంగ్ పూనియా భారత ప్రభుత్వం 2019లో ఇచ్చిన పౌర పురస్కారం 'పద్మశ్రీ'ని వెనక్కి ఇచ్చేశాడు. బజరంగ్ పార్లమెంట్ వైపు వెళ్తుండగా కర్తవ్యపథ్ వద్ద ఢిల్లీ పోలీసులు అతన్ని అడ్డుకున్నారు. దీంతో అక్కడి రోడ్డుమీదే పురస్కారాన్ని ఉంచి తన నిరసన లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి చేరేలా చూడాలని పోలీసు అధికారుల్ని బజరంగ్ వేడుకొని అక్కడి నుంచి నిష్క్రమించాడు. 'ప్రధాని మోదీకి నేను పద్మశ్రీని తిరిగి ఇచ్చేస్తున్నా. ఈ లేఖే నా ఆవేదనగా భావించాలి' అని సోషల్ మీడియా 'ఎక్స్'లో పేర్కొన్నాడు. ఇక ఆ లేఖలో ఏముందంటే... 'మోదీజీ మీరు బిజీగా ఉంటారని తెలుసు. అలాగే గత కొన్నాళ్లుగా మహిళా రెజ్లర్లు పడుతున్న పాట్లు, బ్రిజ్‌భూషణ్ నుంచి ఎదుర్కొంటున్న వేధింపులు మీకు తెలుసు. దీనిపై మేం రెండుసార్లు రోడ్డెక్కి నిరసించాం. న్యాయం చేస్తామన్న ప్రభుత్వ హామీతో మా దీక్షను విరమించాం. ముందుగా అసలు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. తాత్సారం తర్వాతే కేసు నమోదు చేశారు. మొదట్లో బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా 19 మంది మహిళా రెజ్లర్లు స్టేట్‌మెంట్ ఇస్తే తదనంతరం ఈ సంఖ్య ఏడుగురికి పడిపోయింది. దీంతో అతని పలుకుబడి ఏ రకంగా శాసిస్తుందనేది అర్థమైంది. ఇప్పుడు మళ్లీ ఆయన వర్గమే రెజ్లింగ్ సమాఖ్యకు కొత్తగా ఎన్నికైంది. దీనికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నాను' అని బజరంగ్ లేఖలో వివరించాడు. మరోవైపు బజరంగ్ 'పద్మశ్రీ'ని తిరిగిస్తుంటే కేంద్ర క్రీడాశాఖ తేలిగ్గా తీసుకున్నట్లుంది. వెనక్కి ఇవ్వడమనేది అతని వ్యక్తిగత నిర్ణయమని తెలిపింది. రెజ్లింగ్ ఎన్నికల్ని ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించారని... అయినప్పటికీ బజరంగ్‌ను తన నిర్ణయం మార్చుకోవాలని కోరతామని క్రీడాశాఖ అధికారి ఒకరు తెలిపారు.

విండీస్‌దే టి20 సిరీస్



పావెల్

తరూబా (ట్రినిడాడ్): సొంతగడ్డపై వెస్టిండీస్ జట్టు వన్డే, టి20ల్లో ఇంగ్లండ్‌పై పైచేయి సాధించింది. ఇంతకుముందే వన్డే సిరీస్‌ను గెలుచున్న విండీస్ ఇప్పుడు టి20 సిరీస్‌నూ 3-2తో తమ ఖాతాలో వేసుకుంది. గురువారం జరిగిన చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో రోవ్‌మన్ పావెల్ కెప్టెన్సీలోని వెస్టిండీస్ నాలుగు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ముందుగా ఇంగ్లండ్ 19.3 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. ఫిల్ సాల్ట్ (22 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గుడకేశ్ మోతీ (3/24) ఇంగ్లండ్‌ను కట్టడి చేశాడు. అనంతరం విండీస్ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 133 పరుగులు సాధించింది. షై హోప్ (43 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు.

క్లుప్తంగా...

నకుల్ పుషప్స్.. 133

నగరవాసి గిన్నిస్ యత్నం



పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌కు చెందిన చింతల కృష్ణారెడ్డి ఒక్క నిమిషంలో అత్యధిక నకుల్ పుషప్‌లు చేశారు. శుక్రవారం అన్నోజిగూడలోని తులిప్ గ్రాండ్ హోటల్‌లో వివిధ శాఖల అధికారుల సమక్షంలో 133 పుషప్‌లు చేశారు. అనంతరం దీనికి సంబంధించిన వీడియోలను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులకు ధ్రువీకరణ కోసం అందజేశారు. 2023, ఏప్రిల్ 13న పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ 124 నకుల్ పుషప్‌లు చేసి గిన్నిస్ రికార్డ్ సృష్టించారు. కృష్ణారెడ్డి తన 48వ బర్త్‌డే సందర్భంగా ఈ అత్యధిక పుషప్‌లు చేయడం గమనార్హం.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు శుభవార్త

డబుల్ డ్యూటీ చార్జీల పెంపు



సాక్షి, హైదరాబాద్: డ్రైవర్లు, కండక్టర్లకు ఇస్తున్న డబుల్ డ్యూటీ చార్జీలను ఆర్టీసీ పెంచింది. ఒక డ్యూటీ (ఎనిమిది గంటలు)కి వన్‌టైం సెటిల్‌మెంట్‌గా ఈ నిర్ధారిత మొత్తం చెల్లిస్తారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో రెగ్యులర్ డ్రైవర్‌కు రూ.740 (ప్రస్తుతం) నుంచి రూ.900కి, రెగ్యులర్ కండక్టర్‌కు రూ.700 నుంచి రూ.850కి, కాంట్రాక్ట్ డ్రైవర్‌కు రూ.590 నుంచి రూ.720కి, కాంట్రాక్ట్ కండక్టర్‌కు రూ.510 నుంచి రూ.620కి పెంచారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ వెలుపల.. రెగ్యులర్ డ్రైవర్‌కు రూ.600 నుంచి రూ.730కి, రెగ్యులర్ కండక్టర్‌కు రూ.530 నుంచి రూ.650కి, కాంట్రాక్టు డ్రైవర్‌కు రూ.480 నుంచి రూ.590కి, కాంట్రాక్టు కండక్టర్‌కు రూ.420 నుంచి రూ.510కి పెంచారు.



మహా రద్దీ..

ఆర్టీసీకి తప్పని తలనొప్పి
నిత్యం వివాదాలే...

సాక్షి, హైదరాబాద్: 'మహాలక్ష్మి పథకం' ఇప్పుడు ఆర్టీసీకి పెద్ద సవాలుగా మారింది. ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం నుంచి ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో తెలంగాణ మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించిన విషయం తెలిసిందే. దీంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణించే మహిళల సంఖ్య భారీగా పెరిగింది. తాజా లెక్కల ప్రకారం.. 'మహాలక్ష్మి' తర్వాత బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య దాదాపు 13 లక్షల మేర పెరిగింది. గతంలో 66 శాతంగా ఉన్న ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేషియో ఇప్పుడు 90 శాతానికి చేరుకుంది. కొన్ని మార్గాల్లో అది వందశాతం కూడా దాటింది. అంటే సీట్ల సామర్థ్యం కంటే ఎక్కువ మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మహిళా ప్రయాణికులు 70 శాతం సీట్లలో కూర్చుంటున్నారు. దీంతో మిగతా మహిళలు, పురుషులు నిలబడే ప్రయాణించాల్సి రావడం వివాదాలకు కారణమవుతోంది.

బస్సులు సరిపోక...

పెరిగిన రద్దీని క్రమబద్ధీకరించాలంటే బస్సుల సంఖ్య భారీగా పెంచాలి. ప్రస్తుతం సాధారణ రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో సగటున 41 లక్షల మంది, రద్దీ ఎక్కువగా ఉండే సోమవారాల్లో 51 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో 90 శాతంగా ఉంటోంది. మహిళలకు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంది. ఈ కేటగిరీ బస్సులు ప్రస్తుతం ఆర్టీసీలో 7292 బస్సులు మాత్రమే ఉన్నాయి. నిజానికి ఆర్టీసీ డిపోల్లో ఉన్న అన్ని బస్సులు రోజూ రోడ్డెక్కవు. వాటిల్లో కొన్ని బ్రేక్‌డౌన్‌లో ఉంటాయి. కొన్ని ఇతర అవసరాల కోసం స్పేర్‌లో ఉంటాయి. సాధారణ రోజుల్లోనే బస్సులు సరిపోక ట్రిప్పులకు ఇబ్బంది అవుతూ వస్తున్న తరుణంలో, మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అమలులోకి రావటంతో బస్సులకు ఒక్కసారిగా తీవ్ర కొరత ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో వంద శాతాన్ని మించి ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతుండటంతో అదనపు ట్రిప్పు నడపాల్సి వస్తోంది. కానీ బస్సులు అందుబాటులో లేక సర్దుబాటు చేయలేకపోతున్నారు. ఫలితంగా, ప్రయాణికులతో కిక్కిరిసి నడపాల్సి వస్తోంది. స్థలం సరిపోక కొందరు ప్రయాణికులు దిగిపోవాల్సి వస్తోంది. దీంతో అదనపు బస్సు నడపాలంటూ వారు సిబ్బందితో ఘర్షణ పడుతున్నారు.

ఇప్పటికిప్పుడు 4 వేల బస్సులు కావాల్సిందే..

ప్రస్తుత రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ ఇప్పటికిప్పుడు దాదాపు 4 వేల వరకు కొత్త బస్సులు సమకూర్చుకోవాల్సి ఉంది. గతంలోనే ఆర్టీసీ రెండు వేల బస్సులకు ఆర్డరిచ్చింది. వాటిల్లో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు 1,500 వరకు ఉంటాయి. కానీ ఆ బస్సులు అందుబాటులోకి రావాలంటే ఇంకా నాలుగు నెలల సమయం పడుతుంది. వచ్చే మార్చి చివరి నాటికి అవి దశలవారీగా అందుబాటులోకి వస్తాయి. మరో 20 రోజుల్లో 50 బస్సులు అందనున్నాయి. కానీ అప్పటి వరకు ఈ రద్దీని తట్టుకునే పరిస్థితి లేదు. రోజురోజుకు ప్రయాణికులు–ఆర్టీసీ సిబ్బంది మధ్య వివాదాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని సంతోషపడుతున్నా.. రోజూ నిలబడి ప్రయాణించటం ఇబ్బందిగా భావించేవారు మళ్లీ ఆటోల వైపు మళ్లుతారు. దీంతో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో కొంత పడిపోతుంది. ఇది జరగకుండా ఉండాలంటే నాలుగు వేల బస్సులు కావాలి. కానీ, అన్ని బస్సులు సమకూర్చుకోవటానికి ఆర్టీసీ వద్ద నిధులు లేవు. ఇప్పటి వరకు ప్రభుత్వం కొత్త బస్సుల అంశాన్ని ప్రస్తావించలేదు.

ఎలక్ట్రిక్ బస్సులు లాగుతాయా..

త్వరలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సమకూర్చుకోనుంది. వాటిలో 500 బస్సులు సిటీ సర్వీసులుగా తిరుగుతాయి. నగరంలో ఓఆర్ 90 శాతాన్ని దాటింది. అంత లోడ్‌ను ఎలక్ట్రిక్ బస్సులు లాగుతాయా అన్న సందేహం అధికారుల్లో వ్యక్తమవుతోంది. లాగినా, బ్యాటరీలు ముందుగానే డిస్చార్జి అవుతాయని ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ అద్దె బస్సుల నోటిఫికేషన్

సమస్య నుంచి గట్టెక్కాలంటే వెంటనే కొత్త బస్సులు సమకూర్చుకోవాల్సి ఉన్నందున, ఆర్టీసీ అధికారులు మరోసారి అద్దె ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తుల నుంచి బస్సులు సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు అద్దె బస్సులు కావాలంటూ నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రస్తుతం రద్దీ విపరీతంగా పెరిగినందున, పాత అద్దె రేట్లకు బస్సులు పెట్టేందుకు ప్రైవేటు వ్యక్తులు సుముఖంగా లేరు. అద్దె చార్జీలు సవరించాలని కోరుతున్నారు. సవరిస్తే ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతుంది.

వారంలో 50 కొత్త బస్సులు: ఎండీ సజ్జనార్

కొత్తగా వచ్చే బస్సుల నమూనాను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శుక్రవారం పరిశీలించారు. వాటిల్లో లహరి స్లీపర్ కమ్ సీటర్, రాజధాని, ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. సంక్రాంతి నాటికి 200 బస్సులు రోడ్డెక్కుతాయని, వీటిలో 50 బస్సులు వారం రోజుల్లో అందుతాయని సజ్జనార్ వెల్లడించారు. నాలుగైదు నెలల్లో విడతలవారీగా 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లెవెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 రాజధాని, 540 ఎలక్ట్రిక్ సిటీ బస్సులు, నగరం వెలుపల తిరిగేందుకు 500 ఎలక్ట్రిక్ బస్సులు అందుతాయని వెల్లడించారు.



కొత్త నమూనా బస్సును పరిశీలిస్తున్న సజ్జనార్



మేమూ రెడీనే..

క్రిస్మస్‌ను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడానికి ఓవైపు ప్రపంచమంతా సన్నద్ధమవుతుంటే.. మేమేం తక్కువ అన్నట్లు డైనోసార్లలో బాహుబలిలాంటి టీరెక్స్ కూడా శాంటా గెటప్‌లో రెడీ అయిపోయి ఫొటోకిలా పోజిచ్చింది. క్రిస్మస్ నేపథ్యంలో లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో బొమ్మ టీరెక్స్‌ను శాంటా రూపంలో అలంకరించడంతో వచ్చినవారంతా దీన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డీఏ ఘన విజయం

- 13 స్థానాలూ కైవసం
- సీనియర్ డాక్టర్లను ఓడించిన జూనియర్లు
- కౌన్సిల్ చైర్మన్ కోసం పోటాపోటీ!



గెలిచిన హెచ్‌ఆర్‌డీ ప్యానెల్ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) ఎన్నికల్లో హెల్త్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) ఘన విజయం సాధించింది. హెచ్‌ఆర్‌డీఏ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్‌కుమార్ నేతృత్వంలోని డాక్టర్ల టీమ్ ఎన్నికలు జరిగిన అన్ని స్థానాలనూ కైవసం చేసుకుంది. హేమాహేమీలుగా పిలిచే ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు ఓడిపోయారు. కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉన్న ప్రతి డాక్టర్ 13 ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఈ 13 ఓట్లను కలిపి ఒక్క ఓటుగా పరిగణిస్తారు. అలా ఈ ఎన్నికల్లో మొత్తం 17,090 ఓట్లు పోల్ కాగా, రకరకాల కారణాలతో 3,311 ఓట్లను రిటర్నింగ్ ఆఫీసర్ తిరస్కరించారు. మిగిలిన 13,779 ఓట్లను లెక్కించారు. అత్యధికంగా డాక్టర్ ప్రతిభాలక్ష్మి 7,007 ఓట్లను సాధించగా, డాక్టర్ మహేశ్‌కుమార్ 6,735 ఓట్లు సాధించారు.

రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారిగా ఎన్నికలు...

రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. మెడికల్ కౌన్సిల్ 25 మంది డాక్టర్లతో ఏర్పాటవుతుంది. అందులో 13 మంది ఇప్పుడు డాక్టర్లు ఓటు ద్వారా ఎన్నికయ్యారు. మిగిలిన 12 మందిని ప్రభుత్వం నామినేట్ చేయాల్సి ఉంది. అనంతరం చైర్మన్‌ను ఎన్నుకుంటారు. చైర్మన్ కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. ఈ పదవినీ హెచ్‌ఆర్‌డీఏ కైవసం చేసుకునే అవకాశం ఉంది. వాస్తవంగా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందే మెడికల్ కౌన్సిల్ ఎన్నికలకు తెరలేచింది. అసెంబ్లీ ఎన్నికల వల్ల మెడికల్ కౌన్సిల్ ఎన్నికలపై ఎవరూ పెద్దగా ఫోకస్ చేయలేదు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వాళ్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఈ ఎన్నికల్లో వారే ఓట్లేశారు.

విజేతలు సాధించిన ఓట్లు ఇలా

డాక్టర్ ప్రతిభా లక్ష్మి 7,007 ఓట్లు, డాక్టర్ కె.మహేష్ కుమార్ 6,735, డాక్టర్ బండారి రాజ్‌కుమార్ 6,593, డాక్టర్ జి.శ్రీనివాస్ 6,454, డాక్టర్ కిరణ్‌కుమార్ 6,434, డాక్టర్ ఎస్.ఆనంద్ 6,192, యెగ్గన శ్రీనివాస్ 6,086, డాక్టర్ రవికుమార్ 6,085, డాక్టర్ నరేష్‌కుమార్ 6,091, డాక్టర్ శ్రీకాంత్ 5,974, డాక్టర్ సన్నీ దావిస్ 5,912, డాక్టర్ విష్ణు 5,844, డాక్టర్ సయ్యద్ ఖాజా ఇమ్రాన్ అలీ 5695 ఓట్లు సాధించారు.

వీఆర్‌ఏలకు సకాలంలో జీతాలివ్వండి

సాక్షి, హైదరాబాద్: వీఆర్‌ఏలకు ఎంప్లాయీ ఐడీ కార్డులు, వేతనాలను సకాలంలో మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వీఆర్ఏ జేఏసీ కోరింది. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్‌ను వీఆర్ఏ జేఏసీ నేతలు రమేష్ బహదూర్, వంగూరు రాములు, బిర్రు ఎల్లన్న తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

సెక్యులర్ ప్రభుత్వంతోనే మత సామరస్యం

- క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్ పార్టీదే..



చిన్నారులకు కానుకలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సెక్యులర్ ప్రభుత్వాల పాలనలోనే మత సామరస్యం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, కేంద్రంలో తిరిగి సెక్యులర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలసి రేవంత్ పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పాలనలో అన్ని మతాలకు సమ ప్రాధాన్యం దక్కుతుందని చెప్పారు. ''డిసెంబర్‌లో తెలంగాణలో మిరాకిల్ జరుగుతుందని నేను ముందుగానే చెప్పాను. మొన్న హిమాచల్, నిన్న కర్ణాటక, నేడు తెలంగాణలో సెక్యులర్ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును అన్ని వర్గాల ప్రజలు కోరుకోవాలి.. అని పేర్కొన్నారు.

నిత్యం ప్రజల్లోనే ఉంటా..

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని, ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని చివరి లబ్ధిదారు వరకు అందించే దిశగా పాలన సాగిస్తామని రేవంత్ చెప్పారు. తామంతా పాలకుల మాదిరి కాకుండా సేవకుల్లా పనిచేస్తామని.. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఆ దిశగానే గడీలను బద్దలుకొట్టి ప్రజలకు ప్రవేశం కల్పించామని.. వారంలో రెండ్రోజులు ప్రజావాణి వింటున్నామని చెప్పారు. మిడ్జిల్ జెడ్పీటీసీ సభ్యుడిగా ప్రజల్లోకి వచ్చిన తాను ఇప్పటివరకు ప్రజలతోనే ఉన్నానని, ఇకపైనా నిత్యం ప్రజల్లోనే ఉంటానని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటు కోసం మైనార్టీలు ఎన్నో ప్రార్థనలు చేశారని, ఇప్పుడు దేశంలోనూ కొత్త ప్రభుత్వం కోసం అదే తరహాలో ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని సీఎం రేవంత్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, డీజీపీ, బిషప్‌లు పాల్గొన్నారు.

రూ. 9675,67,35,596

ఈ ఏడాది హైదరాబాద్‌లో వైట్ కాలర్ నేరగాళ్ల పాలైన మొత్తం రూ. 9 వేల కోట్లపైనే..

- నగరవాసుల్ని నీట్‌గా దోచేస్తున్న వైనం
- హైదరాబాద్ నగర పోలీసుల వార్షిక నివేదిక-2023 గణాంకాల్లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రూ. పదుల కోట్లు.. రూ. వందల కోట్లు కూడా కాదు... రూ. 9675,67,35,596! భాగ్యనగరంలో వైట్ కాలర్ కేటుగాళ్లు బాధితుల నుంచి ఈ ఏడాది కొల్లగొట్టిన సొమ్ము విలువ ఇది!! హైదరాబాద్ నగర పోలీసు విభాగం శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2023కుగాను విడుదల చేసిన వివిధ నేరాల వార్షిక నివేదికలో వైట్ కాలర్ నేరాల కేసులకు సంబంధించి ఈ ఆశ్చర్యకర గణాంకాలున్నాయి. బుధవారం వరకు నమోదైన కేసులు, లెక్కల ప్రకారం చూస్తే నేరాల్లో ప్రజలు కోల్పోయిన మొత్తం రూ. 9714,05,44,337గా ఉంది. ఇందులో వైట్ కాలర్ అఫెండర్స్‌గా పిలిచే మోసగాళ్లు, ఆర్థిక నేరగాళ్లు స్వాహా చేసిన మొత్తం రూ. 9675,67,35,596 (99.6 శాతం)గా తేలింది.

కారణాలు అనేకం...

శ్రమ తక్కువ, ఫలితం ఎక్కువ... ఇదీ వైట్‌కాలర్ నేరగాళ్ల తీరు. దొంగతనం, దోపిడీ వంటి నేరాలు చేయాలంటే దానికి భారీ తతంగం అవసరం. టార్గెట్‌ను ఎంచుకోవడం, రెక్కీ చేయడం, పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం... ఇలా ఎన్నో ముందస్తు ప్రక్రియలు పూర్తి చేయాలి. ఇంత చేసినా ఆ నేరంలో సఫలీకృతం అవుతాడనే నమ్మకం లేదు. కొన్ని సందర్భాల్లో చేయడానికి ముందో, చేస్తూనో చిక్కే ప్రమాదం కూడా ఉంటుంది. ఒకవేళ విజయవంతంగా నేరం చేసినా కొల్లగొట్టే సొత్తు విలువ తక్కువే. దీంతో వైట్‌కాలర్ నేరగాళ్లు ఎదుటి వ్యక్తినో, వ్యక్తుల్నో లేదా సంస్థనో పక్కాగా నమ్మించి మోసగించే పంథాకు తెరతీస్తున్నారు. ఈ తరహా నేరాల్లో 'ప్రతిఫలం' రూ. కోట్లలో ఉంటుండటంతో వైట్‌కాలర్ నేరగాళ్లు ఓపక్క నేరుగా, మరోపక్క ఆన్‌లైన్ ద్వారా అందినకాడికి దండుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరవాత సైబర్ నేరాలూ అదే స్థాయిలో పెరిగిపోయాయి.

చిక్కడం అరుదే....

సైబర్ నేరాలతోపాటు కొన్ని రకాలైన మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లు చిక్కే అవకాశాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. ఎవరికి ఫిర్యాదు చేయాలన్నది సామాన్యులకు స్పష్టంగా తెలియక, కొన్నిసార్లు స్థానిక పోలీసుల నుంచి సరైన స్పందన లేక అనేక కేసులు నమోదు కావట్లేదు. రిజిస్టర్ అయినా సైబర్ నేరగాళ్లు తీసుకుంటున్న జాగ్రత్తలకు తోడు.. నేరాల దర్యాప్తులో అన్ని విభాగాల పోలీసులకు పట్టులేక కొలిక్కిరావట్లేదు. సైబర్ నేరాల్లో 30 శాతం కూడా కేసులు నమోదు కావట్లేదు. నమోదైన నేరాల్లో కూడా కొలిక్కి వస్తున్నవి 10 శాతానికి మించట్లేదు.

ప్రధానమైన ఆర్థిక నేరాల గణాంకాలు ఇలా...

నేరం	కేసులు	కోల్పోయిన మొత్తం (రూ.)
ఆర్థిక సంస్థల నేరాలు	19	157,32,22,042
ఎన్‌బీఎఫ్‌సీలు చేసినవి	16	153,56,74,042
ఇతర సంస్థలు చేసినవి	34	271,98,30,455
స్టాక్ మార్కెట్ మోసాలు	2	3,70,00,000
వ్యక్తులు చేసిన మోసాలు	871	559,94,48,444
ఫిక్స్‌డ్ డిపాజిట్ల స్కాంలు	2	5,27,00,000
చిట్స్, మనీ సర్క్యులేషన్	12	152,29,18,000
భూ కుంభకోణాలు	93	762,14,89,470

నోట్: మిగిలిన మొత్తం ఇతర 28 రకాల నేరాల్లో బాధితులు మోసపోయారు.



శిక్షలు తక్కువే..

వైట్‌కాలర్ నేరాల్ని దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులకు అవసరమైన స్థాయిలో ఇతర విభాగాల సహకారం లభించట్లేదు. కేసు నమోదు, దర్యాప్తు పూర్తై కోర్టు విచారణ ప్రక్రియ ముగియడానికి చాలా సమయం పడుతోంది. అప్పటి వరకు వేచి ఉండేందుకు ఆసక్తి చూపని బాధితులు మధ్యలోనే మోసగాళ్లతో రాజీ పడుతున్నారు. కోల్పోయిన మొత్తంలో 50-60 శాతం తిరిగి వస్తే చాలనే ధోరణితో ఉంటున్నారు. ఇలాంటి అనేక కారణాల నేపథ్యంలో మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏటా జరుగుతున్న నేరాల్లో బాధితులు కోల్పోతున్న సొమ్ములో 95 శాతానికిపైగా మోసగాళ్ల వద్దకు చేరుతోంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.